3-5Pg1exHMNWJQE.qxd OK:3-5Pg1exHMNWJQE.qxd 1/1/02 7:15 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ
epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
శ్రీకాకుళం
fb.com/vaartha Digital
Published from Srikakulam, Visakhapatnam, Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem,
3-5-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 92 పేజీలు: 16 వెల: 8.00


చేనేతల లోగిళ్లలో 'ఉచిత' కాంతులు 2లో
ఇరాన్ అణ్వస్త్ర తయారీని ఆపాం: ట్రంప్ 5లో

## నేడే నీట్ పరీక్ష



### 180 కేంద్రాలు సిద్ధం
### అరగంట ముందే గేట్లు మూసివేత
### మధ్యాహ్నం 2 గం.నుంచి 5 గం. దాకా నిర్వహణ

**విజయవాడ,మే2,ప్రభాతవార్తప్రతినిధి:** వైద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం దేశ వ్యాప్తంగా నిర్వహించే నీట్ ప్రవేశ పరీక్షకు రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాట్లు చేశారు. రాష్ట్రంలో 45 వేల మంది విద్యార్థులు నీట్‌కు హాజరవుతుండగా 180 కేంద్రాలు సిద్ధం చేశారు. ఎన్టీఆర్ జిల్లాలో నీట్ నిర్వహణపై కోర్డినేటర్లతో విజయవాడ ఆర్కిటెక్చర్ కళాశాలలో సంబంధిత అధికారులు సమావేశం నిర్వహించారు. జిల్లాలో 32 సెంటర్లలో 12 వేల మందిపైగా విద్యార్థులు హాజరవుతున్నారు. పరీక్ష ప్రారంభమై ముగిసేలోపు 3 గంటల సమయాన్ని విద్యార్థులు పూర్తిగా వినియోగించుకునేలా కోర్డినేటర్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ మార్గదర్శకాలు అమలు చేయాలని అధికారులు సూచించారు.వైద్యవిద్యలో ప్రవేశానికి రాయాల్సిన నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) నిర్వహణకు యంత్రాంగం సిద్ధమైంది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) ఆధ్వర్యంలో మే 3న ఆదివారం జరగనున్న ఈ కీలక పరీక్షలకు ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేసింది. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు చేశామని అధికారులు చెబుతున్నా, గత అనుభవాల దృష్ట్యా సౌకర్యాలపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన >>2



# ఉద్యాన హబ్‌గా సీమ

### • రూ. లక్ష కోట్ల వ్యయంతో వినూత్నంగా రూపకల్పన • రాష్ట్రంలో మంచి ఆదాయవనరుగా ఉద్యానం • లాజిస్టిక్స్ రంగంలో పెను మార్పులు • రూ. 4 వేల కోట్లతో గ్రామీణ రహదారుల అనుసంధానం: సిఎం చంద్రబాబు

**విజయవాడ,మే2,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో మంచి ఆదాయ వనరుగా ఉద్యానరంగం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేసారు.అన్ని ప్రాంతాల్లోను ఉద్యాన పంటల సాగుకు మంచి అనుకూలత ఉందన్నారు.ఉద్యాన పంటల ఉత్పత్తికి అవసరమైన మార్కెట్ జాతీయ,అంతర్జాతీయలో ఉందన్నారు.'ఎక్స్' వేదికగా ఎపిలో సిఎం చంద్రబాబు ఒక పోస్టులో ఉద్యాన పంటల సాగుపై రైతులు దృష్టి పెట్టాలన్నారు.రూ. లక్ష కోట్లతో రాయలసీమను ఉద్యాన హబ్‌గా తయారు చేస్తామన్నారు.ఇప్పటికే ఆ దిశలో రూ.30 వేల కోట్ల మేర ప్రభుత్వ నిధులు కేటాయింపు జరిగిందన్నారు. రూ.70 వేల కోట్లు ప్రైవేటు పెట్టుబడులతో సీమలో హార్టీకల్చర్ అభివృద్ధి చేస్తాం.ప్రస్తుతం ఏడాదికి 400 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ఫలాల ఉత్పత్తి జరుగుతోంది.వాటి మంచి ధరతో కూడిన మార్కెట్ ఉందన్నారు. మార్కెటింగ్ అవసరాలకు వీలుగా రవాణా సదుపాయాలను అభివృద్ధి చేస్తామన్నారు. భవిష్యత్తులో 1000 లక్షల మెట్రిక్ టన్నుల ఉద్యాన ఉత్పత్తులకు కేంద్ర స్థానంగా రాయలసీమ ఎదుగుతుంది.'ఎక్స్'లోనే మరో పోస్టులో సిఎం చంద్రబాబు వ్యాఖ్యానిస్తూ గత ప్రభుత్వ పాలనలో అక్వా రంగం ఒడిదుడుకులు ఎదుర్కొందన్నారు. రూ.1.50 యూనిట్ చొప్పున విద్యుత్‌ను ఆక్వాకు ఇస్తున్నామన్నారు.. ప్రపంచంలోనే అత్యుత్తమ ఆక్వాకల్చర్ హబ్‌గా మన ప్రాంతం తయారవుతుంది. ధాన్యం కొనుగోలు చేసి 24 గంటల్లో డబ్బులు చెల్లించింది కూడా కూటమి ప్రభుత్వమే. కోకోనట్, కోకో, కాఫీ లాంటి పంటలపై కేంద్రం దృష్టి సారించింది.దీనిపై మరింత శ్రద్ధపెట్టి వ్యాల్యూ అడిషన్ చేసేలా చర్యలు తీసుకుంటాం. ఎపిలో రైతుల ఆత్మహత్యలను నివారించేలా చర్యలు చేపడుతున్నాం. ప్రతీ ఘటననూ ఆడిట్ చేయిస్తాం.విద్యార్థులు కూడా ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్షలు ఎదుర్కోవాలి.ఆత్మహత్యలు దేనికీ పరిష్కారం కాదని అందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను. లాజిస్టిక్స్ రంగంలో పెనుమార్పులు సాధించేలా నిర్ణయం తీసుకుంటున్నాం.రైల్వే రంగంలో రూ.3 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులు చేపట్టేలా ప్రయత్నాలు జరుగుతున్నాయని సిఎం సామాజిక మాధ్యమంలోనే మరో పోస్టులో స్పష్టం చేసారు.రెండేళ్లలో ఇచ్ఛాపురం నుంచి దిగువ వరకూ నాలుగు లేన్ల ట్రాక్ వచ్చే అవకాశం ఉంది.తద్వారా కార్గో, ప్రయాణికుల మార్గాలు విస్తృతం అవుతాయి.

జాతీయ రహదారులు కూడా పెద్దఎత్తున నిర్మించేలా కేంద్రం ప్రాజెక్టులు ప్రతిపాదించింది. డబుల్ ఇంజన్ సర్కారులో త్రిబుల్ ఫలితాలు వచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నామన్నారు..గ్రామీణ ప్రాంతాల్లోని రహదారులను రూ.4 వేల కోట్లతో అనుసంధానిస్తున్నారు. 2047 స్వర్ణాంధ్ర విజన్ ద్వారా ఎపిని అగ్రస్థానంలో నిలిపేలా ప్రణాళికలు చేశాం. పది సూత్రాల ద్వారా ఈ విజన్‌ను సాధించేందుకు లక్ష్యాలు నిర్దేశించుకున్నాం. 2.4 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా ఎపిని >>2



## విద్యుత్ కోతలు రానివ్వం
### -మంత్రి గొట్టిపాటి

**విజయవాడ,మే2,ప్రభాతవార్తప్రతినిధి:** వేసవిలో ఎంత డిమాండ్ ఉన్నా విద్యుత్ కోతలు ఉండటానికి వీల్లేదని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులకు స్పష్టంచేశారు. అకాల వర్షాలు, అధిక వేడి వల్ల తాత్కాలిక కరెంట్ సమస్యలు తలెత్తినా వెంటనే పునరుద్ధరించాలని ఆదేశించారు. శనివారం విద్యుత్ సిఎండీలతో మంత్రి గొట్టిపాటి టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. అధికారికంగా లేదా అనధికారికంగా ఎపిలో ఎక్కడా >>2

## చత్తీస్‌గఢ్‌లో పేలిన పాతర
### ఇన్‌స్పెక్టర్, ముగ్గురు జవాన్లు మృతి

**చర్ల,మే 2, ప్రభాతవార్త:** చత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఆపరేషన్ కగార్ మార్చి 31తో ముగిసిన విషయం తెలిసిందే.కగార్ సమయంలో మావోయిస్టులు భారీ ఎత్తున లొంగిపోయారు. లొంగిపోయిన మావోయిస్టులు ఇచ్చిన సమాచారం మేరకు గత కొంతకాలంగా చత్తీస్‌గఢ్‌లోని మావోయిస్టు ప్రభావిత జిల్లాలైన కాంకేర్ దంతెవాడ సుకుమా నారాయణ పూర్ బీజాపూర్ అటవి ప్రాంతంలో ఐఇడిల వెలికితీత చేపట్టాయి భద్రతా బలగాలు ఈ క్రమంలో శనివారం కాంకేర్ నారాయణపూర్ జిల్లా సరిహద్దు చోటేబేధియా పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీప్రాంతంలో డిమైనింగ్ ఏరియా డామినేషన్‌లో భాగంగా డిఆర్జీ జవాన్లు ఆపరేషన్ చేపట్టారు. >>2

## ఎపి పేపర్ మిల్లు లాకౌట్
### కార్మికుల్లో తీవ్ర ఆందోళన

**కడియం, మే 2, ప్రభాతవార్త:** తూర్పుగోదావరి జిల్లాలో ప్రముఖ పరిశ్రమగా ఉన్న ఎపి పేపర్ మిల్‌లో యాజమాన్యం అకస్మాత్తుగా లాకౌట్ ప్రకటించడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ నిర్ణయంతో సుమారు 1200 మంది కార్మికులు, ఉద్యోగులు ఉపాధి కోల్పోతామన్న ఆందోళనలో ఉన్నారు.కడియం మండలం, మాధవరాయుడుపాలెం గ్రామంలో ఉన్న యూనిట్‌ను శుక్రవారం 1 అర్ధరాత్రి 10 గంటల నుండి మూసివేసినట్లు యాజమాన్యం ప్రకటించింది. నెలకు సుమారు 5 వేల టన్నుల పేపర్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన ఈ యూనిట్‌లో గతవారం వేతనాల >>2

# పుట్టపర్తిలో యుద్ధవిమానాల కేంద్రం



### రూ. 15 వేల కోట్లతో డిఆర్‌డిఒ భారీ ప్రాజెక్టు
### దాదాపు వెయ్యి ఎకరాల భూమి కేటాయింపు
### 15న శంకుస్థాపన చేయనున్న సిఎం చంద్రబాబు
### 2035 నాటికి పూర్తిస్థాయి విమానాల ఉత్పత్తి

**అనంతపురం, మే 2, ప్రభాతవార్త బ్యూరో :** దశాబ్దాల కాలం నుంచి కరువు కాటకాలతో వెనుకబడిన శ్రీ సత్య సాయి జిల్లా రక్షణ, ఏరోస్పేస్ హబ్‌గా వేగంగా మారేందుకు అవకాశాలు కనిపిస్తున్నాయి. శ్రీసత్యసాయి జిల్లా బెంగళూరుకు సమీపంగా ఉండటంతో జిల్లాకు ప్రాధాన్యత పెరిగి ఏరోస్పేస్, రక్షణ రంగం పరుగులు పెట్టనుంది అని పరిశీలకులు భావిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో ఏకంగా రూ.15,000 కోట్ల పెట్టుబడితో ఐదో తరం స్టెల్త్ యుద్ధ విమానాల తయారీ ప్రాజెక్టును ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ డిఆర్‌డిఒ (రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ) ముందుకు వచ్చింది. ఈ నెల 15న సిఎం చంద్రబాబు ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్టు రాకతో శ్రీసత్యసాయి జిల్లా దేశ రక్షణ రంగ పటంలో కీలక స్థానాన్ని సంపాదించనుంది.

ఈ ప్రాజెక్టులో భాగంగా అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఎఎంసీఎ) మోడల్ యుద్ధ విమానాలను తయారు చేయనున్నారు. దేశీయంగా, అత్యాధునిక సాంకేతికతతో రూపొందించే ఈ విమానాలను భారత వైమానిక దళం, నౌకాదళం కోసం వినియోగిస్తారు. ప్రస్తుతం వాడుకలో ఉన్న సుఖోయ్ ఎస్‌యూ30 యుద్ధ విమానాలకు ప్రత్యామ్నాయంగా వీటిని అభివృద్ధి చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 600 ఎకరాల భూమిని డిఆర్‌డిఒకు కేటాయించింది. భవిష్యత్ అవసరాల కోసం మరో 400 ఎకరాలను కూడా అందుబాటులో ఉంచింది. నిర్మాణ పనులను వేగంగా పూర్తిచేసి, 2029 నాటికి మొదటి నమూనాను సిద్ధం చేయాలని, 2035 నాటికి పూర్తిస్థాయిలో విమానాల ఉత్పత్తి ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఏరోస్పేస్ హబ్‌గా శ్రీసత్యసాయి జిల్లా ఈ ఒక్క ప్రాజెక్టుతోనే కాకుండా శ్రీసత్యసాయి జిల్లా క్రమంగా ఏరోస్పేస్, డిఫెన్స్ హబ్‌గా రూపాంతరం చెందుతోంది.

ఇప్పటికే పాలసముద్రం వద్ద రూ.500 కోట్ల పెట్టుబడితో భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బిఇఎల్) వెయ్యి ఎకరాల్లో డిఫెన్స్ సిస్టమ్స్ ఇంటిగ్రేషన్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేస్తోంది. అలాగే మడకశిరలో కల్యాణి స్ట్రాటజిక్ సిస్టమ్స్ లిమిటెడ్ రూ.2,500 కోట్ల వ్యయంతో వెయ్యి ఎకరాల్లో డిఫెన్స్ ఎనర్జిటిక్స్ తయారీ కాంప్లెక్స్‌ను నిర్మించనుంది. ఇప్పుడు డిఆర్‌డిఒ ప్రాజెక్టు కూడా తోడవడంతో జిల్లా పారిశ్రామిక స్వరూపం పూర్తిగా మారిపోనుంది. బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయానికి కేవలం 130 కిలోమీటర్ల దూరంలో ఈ ప్రాంతం ఉండటం పరిశ్రమల ఏర్పాటుకు కలిసివస్తోంది. బెంగళూరు చుట్టుపక్కల రక్షణ రంగ విస్తరణకు అవకాశాలు తగ్గడంతో కంపెనీలన్నీ శ్రీసత్యసాయి జిల్లా వైపు చూస్తున్నాయి. జిల్లాలోని పుట్టపర్తిలో విమానాశ్రయం అందుబాటులో ఉండటం కూడా ఈ ప్రాజెక్టులకు అదనపు బలంగా మారింది. ఈ పరిణామాలతో రానున్న రోజుల్లో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ సంస్థలు ఈ ప్రాంతానికి రావడం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు.



## ఎండ దెబ్బకు దడదడ

### ప్రకాశం జిల్లా కొప్పెరపాడులో 45.4°
### 239 మండలాల్లో సగటున 41° ఉష్ణోగ్రతలు
### కొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో వానలు

**విజయవాడ, మే 2, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో విభిన్న వాతావరణ కొనసాగుతుంది.అదిరిపోయే ఉష్ణోగ్రతలు దడపుట్టిస్తున్నాయి.అన్ని వయస్సుల వారిని ఉక్కపోత ఇబ్బంది పెడుతుంది. వడగాల్పులకు రాష్ట్రంలో ఇరువురు మృతి చెందినట్లు సమాచారం.శనివారం ప్రకాశం జిల్లా కొప్పెరపాడులో 45.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డయినట్లు విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. మొత్తం 28 జిల్లాలకు గాను 17 జిల్లాల పరిధిలోని 239 మండలాల్లో ఎండ తీవ్ర ప్రభావం చూపి 41 డిగ్రీలకు పైగా నమోదైనట్లు వెల్లడించారు. కడప జిల్లా 34 మండలాలు, నెల్లూరు 32, తిరుపతి 29, పల్నాడు 26, ప్రకాశం 25, మార్కాపురం 21, నంద్యాల20 , కర్నూలు17, చిత్తూరు జిల్లా 10 మండలాల్లో ఎక్కువగా ప్రభావం చూపిందన్నారు. జిల్లా వారిగా గమనిస్తే ప్రకాశంలో కొప్పెరపాడులో 45.4 మార్కాపురంలో బొట్లగూడూరులో 45.1 తిరుపతిలో వెంకటగిరిలో 45, నెల్లూరులో కలిగిరిలో 44.4 పల్నాడులో నూజెండ్లలో 44.3 చిత్తూరులో తవణంపల్లె, నంద్యాలలో దొర్నిపాడులో 44.1 వైఎస్సార్ కడపలో కలసపాడులో 43.9, బాపట్లలో కారంచేడులో 43.7, కర్నూలులో మంత్రాలయంలో 43.2 అనంతపురంలో తెరన్నపల్లిలో 42.8 ఎన్టీఆర్‌లో విజయవాడ తూర్పులో 42.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు పేర్కొన్నారు. మరోవైపు రాజస్థాన్‌పై గల ఉపరితల ఆవర్తనం నుండి విదర్భ,తెలంగాణ, రాయలసీమ, తమిళనాడు మీదుగా కొమోరియన్ ప్రాంతం వరకు ద్రోణి విస్తరించి ఉందని ఎపిఎస్డీఎంఎ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు.

వాతావరణం ఇప్పటి అంచనాల ప్రకారం కనీసం రెండురోజుల పాటు ఇలాగే ఉంటుందన్నారు. ఆదివారం ఎండ తీవ్రతతో పాటుగా గుంటూరు జిల్లా మేడికొండూరు, పెదనందిపాడు, ఫిరంగిపురం, ప్రత్తిపాడు, తుళ్లూరు, వట్టిచెరుకూరు మండలాల్లో తీవ్ర వడగాల్పులు ప్రభావం. చూపే అవకాశం ఉందన్నారు.విజయనగరం 10, మన్యం 12, అల్లూరి1, పోలవరం 5, తూర్పుగోదావరి 3, ఏలూరు 2, కృష్ణా 7, ఎన్టీఆర్ 14, గుంటూరు 12, బాపట్ల 9, పల్నాడు 22, >>2

## భారీగా పెరిగిన యుపిఐ లావాదేవీలు

### • రూ. 314 లక్షల కోట్లకు చేరిక • ప్రపంచంలో అతిపెద్ద చెల్లింపుల వేదికగా భారత్ • కేంద్ర ఆర్థిక శాఖ వెల్లడి



**హైదరాబాద్, మే 2, ప్రభాతవార్త :** నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐ) అభివృద్ధి చేసిన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యుపిఐ) 10 ఘనమైన సంవత్సరాలను పూర్తి చేసుకుంది. ఈ కాలంలో ప్రపంచంలోనే అతిపెద్ద రియల్‌టైమ్ చెల్లింపుల వేదికగా రూపుదిద్దుకుంది. ఈ మేరకు దీనికి సంబంధించి కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ విడుదల చేసిన వివరాలు ప్రకారం రిజర్వ్ బ్యాంక్ నియంత్రణ పర్యవేక్షణలో నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా 11 ఏప్రిల్ 2016న ప్రారంభించబడిన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ దేశ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థకు వెన్నెముకగా, ఆర్థిక సమ్మిళితానికి కీలక చోదకంగా ఆవిర్భవించింది. దశాబ్దానికి పైగా కార్యకలాపాలలో, యూపిఐ అసాధారణమైన స్థాయిని ప్రదర్శించింది. వార్షిక లావాదేవీలు చూస్తే 2016-17 ఆర్థిక సంవత్సరంలో కేవలం 2 కోట్ల నుండి 2025-26లో అది 24,162 కోట్లకు పైగా లావాదేవీలకు విస్తరించింది. ఇది లావాదేవీల పరిమాణంలో దాదాపు 12 వేల రెట్ల పెరుగుదలను సూచిస్తుంది. రోజువారీ సగటు లావాదేవీలను చూస్తే 66 కోట్ల మేర >>2

## కల్తీ నెయ్యిలో అసలు సూత్రధారులు ఏరీ?

### ఏకసభ్య కమిటీ తుది నివేదికలపై చర్యలెప్పుడు?
### తిరుమలను కుదుపుతున్న కల్తీ పాపం
### టిటిడి బోర్డుకు ప్రత్యేక ఆహ్వానితులను నామినేట్ చేయడం ఆపాలి



**తిరుమల,మే 2ప్రభాతవార్తప్రతినిధి:** చిన్నపిల్లవాడు అన్నం తినకుండా మారాం చేస్తే చందమామను చూపిన చందంగా ఏడుకొండల వేంకటేశ్వరస్వామి పవిత్రతను కాపాడాల్సిన కీలక పెద్దలు లోపాలను అవకాశంగా మార్చుకుని లక్షల్లో దండుకున్నారనేది బహిరంగమే. 2019-24 మధ్యకాలంలో గత వైసిపి ప్రభుత్వంలోని టిటిడి వైసిపి బోర్డు ఛైర్మన్, కొందరు టిటిడి అధికారులు చేతులు కలిపి ఏకంగా టెండర్ల నిబంధనలే మార్పుచేసి, అర్హత లేని డెయిరీలకు నెయ్యిసరఫరా చేయడం అప్పగించారనేది 2024లోనే గుప్పుమంది.

సుమారు 70లక్షలకిలోల నెయ్యి కల్తీ టిటిడికి తిరుమలకు చేరిందని, దాదాపు 300కోట్ల రూపాయలు పైమాటే ఆర్థిక లావాదేవీలు జరిగాయనేది ఇప్పటికే సిబిఐ సిట్, ఏకసభ్య కమిటీలు నివేదికలను రాష్ట్రప్రభుత్వానికి అందించాయి. ఇప్పుడు కల్తీనెయ్యి వినియోగం, సరఫరాలో గత మాజీ ఛైర్మన్‌లు వైవి సుబ్బారెడ్డి, అప్పటి >>2



## ఇరాన్‌కు 500 కోట్ల డాలర్ల నష్టం!

### నౌకల దిగ్బంధంతో తీవ్రంగా దెబ్బతిన్న ఇరాన్ ఆర్థిక వ్యవస్థ
### 40కి పైగా నౌకల దారి మళ్లింపు, రెండు నౌకలు ఇంకా అమెరికా అధీనంలోనే!

**వాషింగ్టన్, మే 2:** గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో అమెరికా నేతృత్వంలో కొనసాగుతున్న కఠినమైన దిగ్బంధనం కారణంగా ఇరాన్ ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింది. ఈ ఆంక్షల వల్ల ఇరాన్ చమురు అమ్మకాల ద్వారా పొందాల్సిన దాదాపు 5 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని కోల్పోయిందని అమెరికా రక్షణ శాఖ (పెంటగాన్) అంచనా వేసింది. ఇస్లామాబాద్‌లో జరిగిన శాంతి చర్చలు విఫలమైన నేపథ్యంలో ఇరాన్‌ను మళ్లీ చర్చల వేదికకు తీసుకురావడానికి ఈ ఆర్థిక దిగ్బంధనాన్ని తమ ప్రధాన అస్త్రంగా అమెరికా ఉపయోగిస్తోంది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశాలతో ఏప్రిల్ 13న ఈ దిగ్బంధనం ప్రారంభమైంది. అప్పటి నుంచి చమురు లేదా ఇతర నిషేధిత >>2




## ఆపరేషన్ సిందూర్‌లో ధ్వంసం చేసిన ఉగ్ర శిబిరాల జాబితా విడుదల చేసిన ఆర్మీ

**న్యూఢిల్లీ, మే 2:** భారత్ సాయుధ దళాలు ఆపరేషన్ సింధూర్‌లో తాము టార్గెట్‌చేసిన కీలక ఉగ్రవాద శిబిరాల వివరాలను శనివారం విడుదలచేసారు. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ప్రాంతంలో ఉన్న ఈ శిబిరాలే లక్ష్యంగాచేసుకుని దాడులుచేసినట్లు వెల్లడి అయింది. భారత్ ఆర్మీ, ఎయిర్‌ఫోర్‌న సంయుక్తంగా జైషే ముహ్మద్, లష్కరే తాయిబా, హిజ్బుల్ ముజాహిదీన్‌లకు చెందిన తొమ్మిది శిబిరాలను గత ఏడాది మే ఏడో తేదీ సమూలంగాధ్వంసంచేసాయి. భావల్పూర్‌లోని జైషేముహ్మద్ కేంద్ర కార్యాలయం మర్కజ్ సుభాన్ అల్లా, మురిడ్కేలోని లషనకరే తాయిబా శిక్షణా కేంద్రం మర్కజ్ తాయిబా, టెహ్రాకలాన్‌సియాల్‌కోట్‌లో ఉన్న సర్జల్ శిబిరం హిజ్బుల్ ముజాహిదీన్‌కు చెందిన శిబిరంతోపాటు అదే సంస్థకు చెందిన సియాల్‌కోట్‌లోని మెహూనాజోయా, బర్నాలాలో లష్కరే తాయిబా శిక్షణాకేంద్రం మర్కజ్ అహ్లే హదిత్, కోట్లిలో జైషే ముహ్మద్ శిక్షణా కేంద్రం మర్కజ్ అబ్బాస్, అక్కడే హిజ్బుల్ ముజాహిదీన్‌శిబిరం మస్కర్ రహీల్ షాహిద్, లష్కరే తాయిబా లాంచ్‌పాట్ ముజఫరాబాద్‌లో షావాయి నల్లా క్యాంప్, అక్కడే జైషే శిక్షణాకేంద్రం సైద్‌నా బిలాల్‌క్యాప్‌లను ఆపరేషన్ సింధూర్‌లో ధ్వంసంచేసినట్లు ఆర్మీ ప్రకటించింది. ఎలాంటి ఉద్రిక్తతలకు తావులేకుండా నిర్దిష్టమైన లక్ష్యాలనను ఎంచుకుని కేవలం 22 నిమిషాల్లోనే దాడులను ముగించినట్లు వెల్లడించింది. పహల్గాంవ్‌లో గత ఏడాది ఏప్రిల్ 22వ తేదీ జరిపిన ఉగ్రకాల్పుల్లో 26 మంది బలిదానానికి ప్రతీకార చర్యగా ఆపరేషన్ సింధూర్ నిర్వహించారు. ఇండోపాక్ సరిహద్దునుంచి 60 కిలోమీటర్ల పాక్ లోపలికి వెళ్లి మరీ మన మిలిటరీ ఎయిర్‌ఫోర్స్ కాల్పులకు తెగబడింది.

## లైంగిక వేధింపుల వ్యవహారంపై ప్రభుత్వం చర్యలు

**విజయవాడ.మే2,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలో లైంగిక వేధింపుల వ్యవహారంలో ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ ఘటనపై విచారణ అనంతరం ప్రొఫెసర్ దేవదత్ మోళీనాయక్, ల్యాబ్ టెక్నీషియన్ సుబ్రహ్మణ్యంను సస్పెండ్ చేసింది. విద్యార్థినుల ఫిర్యాదుపై నిరక్ష ్యంగా వ్యవహరించిన కళాశాల ప్రిన్సిపల్, మరో అధ్యాపకురాలిని ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ ఆయుష్ విభాగం కమిషనర్ రోణంకి గోపాలకృష్ణ ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే ఈ ఘటనలో ప్రొఫెసర్, ల్యాబ్ టెక్నీషియన్‌ను సస్పెండ్ చేయాలని రాష్ట్ర మహిళా కమిషన్ ప్రభుత్వానికి సిఫార్సు చేసింది.ఆ క్రమంలో ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంది

## వాహన ప్రమాదంలో ఇద్దరు సజీవ దహనం

**ఉరవకొండ , మే 02 ప్రభాతవార్త:** ఉరవకొండ నియోజకవర్గం పరిధిలోని కూడేరు మండలం అరవకూరు గ్రామం వద్ద అనంతపురం-బళ్ళారి 42వ నంబర్ జాతీయ రహదారిలో శనివారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో వజ్రకరూరు మండలం పందికుంట గ్రామానిక చెందిన ఆకాశ్(20), అజిత్ (19) అనే యువకులు సజీవ దహనమయ్యారు. వివరాల్లోకి వెలితే.. వజ్రకరూరు మండలం పందికుంటకు చెందని యువకులు ఆకాష్ ,అజిత్ అనంతపురంలో జరిగిన ఒక వివాహకార్యక్రమానికి హాజరై తిరిగి తమ స్వగ్రామానికి ద్విచక్రవాహనంలో బయలుదేరారు. ఈ క్రమంలోనే అరవకూరు గ్రామం వద్ద ద్విచక్ర వాహానాన్ని వేగంగా వచ్చిన బొలేరో వాహనం వెనుక వైపు నుండి బలంగా ఢీకొని కొద్ది దూరం లాక్కెల్లడంతో పెట్రోల్ ట్యాంకుకు నిప్పంటుకొని ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అప్పటికే తీవ్ర గాయాల పాలైన ఇద్దరు యువకులు తప్పించుకొనే మార్గంలేక అమంటల్లోనే చిక్కుకొని సజీవ దహనమయ్యారు.

## ఉద్యాన హబ్‌గా సీమ

>> తీర్చిదిద్దుతాం. 2047కు భారత్ నెంబర్ వన్ ఎకానమీగా ఉంటుంది. అందులో ఏపి అగ్రస్థానానికి చేరుతుంది. అత్యధిక తలసరి ఆదాయం, జీవన ప్రమాణాలు ఉండాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం. హెల్తీ, వెల్తీ హ్యాపీ ఏపి అనే విధానం మనదని సిఎం పునరుద్ఘాటించారు.2019 -24 మధ్య ఏం జరిగిందో అంతా చూశాం. ప్రతీ ఐదేళ్లకూ తలసరి ఆదాయం రెట్టింపు అయ్యేలా ప్రణాళికలు చేపడుతున్నాం అన్నారు.పాలసీలు కూడా నిరంతరం ఈ రెండేళ్లలో సాధించిన విజయాలు మననం చేసుకుంటూ మరింత ఉన్నత లక్ష్యా నిర్దేశించుకుందామన్నారు.

# నేడే నీట్ పరీక్ష

>> వ్యక్తం చేస్తున్నారు. పరీక్ష కేంద్రాల్లో సౌకర్యాల కొరత విద్యార్థుల ఏకాగ్రతపై ప్రతికూల ప్రభావం చూపుతుందని భయపడుతున్నారు. సంతకాల సేకరణ, ఫొటో ధ్రువీకరణ లాంటి ముందస్తు ప్రక్రియలను పరీక్ష 3 గంటల సమయంలోనే నిర్వహిస్తే విద్యార్థులకు సమయం వృథా అయి, ఏకాగ్రత దెబ్బతింటుందని వాపోతున్నారు. గదుల్లో గోడ గడియారాలు లేకపోతే సమయ పాలనలో ఇబ్బందులు ఎదురవుతాయని అంటున్నారు. కీలకమైన ఈ పరీక్షను విద్యార్థులు ఏకాగ్రతతో ప్రశాంతంగా రాసేలా అధికారులు సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.అయితే ఈ విషయంలో ఎటువంటి ఆందోళనకు గురికావొద్దని అధికారులు చెబుతున్నారు.ప్రతి కేంద్రంలో జనరేటర్ సౌకర్యం ఏర్పాటు చేసామని వారు వెల్లడించారు.దీంతో పాటుగా వేసవి దృష్ట్యా ఫ్యాన్లు, లైట్లు, చల్లని మంచినీరు, వైద్య సిబ్బంది, ఇతర వసతులు ఉంటాయి.ప్రతి గదిలో గోడ గడియారం, అభ్యర్థులను అప్రమత్తం చేసేలా అలారమ్ వ్యవస్థ ఉంటుంది.ప్రతి 12 మంది విద్యార్థులకు ఒక ఇన్విజిలేటర్ పర్యవేక్షణ.

**ప్రతి నిమిషమూ కీలకమే :**

నీట్ ఆదివారం మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తారు. పరీక్ష కేంద్రంలోకి అభ్యర్థులు అడ్మిట్ కార్డుతో ఉదయం 11 నుంచి 1.30 గంటలోపు చేరుకోవాలి. 1.30 గంటలకు పరీక్ష కేంద్రం గేట్లు మూసేస్తారు. ఈలోగా కేంద్రానికి చేరుకోకపోతే పరీక్ష రాసే వీలుండదు. ఉదయం 11 నుంచి 1.40 గంట వరకు అడ్మిట్ కార్డు, గుర్తింపు కార్డు పరిశీలన. మధ్యాహ్నం 1.40 గంటలకు పరీక్ష గదుల్లోకి ప్రవేశం.1.40 నుంచి 1.50 వరకు పరీక్ష గదిలో రెండోసారి ఇన్విజిలేటర్లు తనిఖీ. 1.50 గంటలకు పరీక్ష బుక్‌లెట్లు అభ్యర్థులకు అందజేత.1.50 నుంచి 1.55 గంటల వరకు బుక్‌లెట్ కవర్ పేజీ, ఓఎంఆర్ షీట్‌పై అభ్యర్థుల వివరాలు రాసుకునే అవకాశం కల్పించారు. పరీక్ష రాసే మూడు గంటల సమయంలో బయోమెట్రిక్ కోసం అభ్యర్థులను ఎలాంటి ఇబ్బందులకు గురి చేయవద్దని ఎన్టీఏ పరీక్షల డైరెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.అభ్యర్థి పరీక్ష గదిలోకి ప్రవేశించడానికి ముందే తప్పనిసరిగా బయోమెట్రిక్ ప్రక్రియ పూర్తి చేయాలి.ఒకవేళ పరికరాలు పని చేయకపోయినా, సర్వర్ మొరాయించినా, ఇతర సాంకేతిక ఇబ్బందులు ఎదురైె బయోమెట్రిక్ ప్రక్రియ పూర్తికాకపోయినా అభ్యర్థిని పరీక్ష గదిలోకి అనుమతించాలి. అభ్యర్థుల నుంచి హామీపత్రం తీసుకోవాలి. ఈ హామీపత్రం నమూనా కూడా పరీక్ష కేంద్రాల వద్ద ఉంచాలి. దేశవ్యాప్తంగా గతేడాది 21 లక్షల మంది నీట్ రాస్తే, ఈసారి 22.80 లక్షల మంది రాయనున్నారు. ఏపిలో 180 కేంద్రాల్లో 45వేల మంది వరకు పరీక్షకు హాజరుకానున్నారు. పరీక్షల నిర్వహణకు రాష్ట్ర కోఆర్డినేటర్లు, సిటీ కోఆర్డినేటర్లు, పరిశీలకులు, పరీక్ష కేంద్రాల సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లు, బయోమెట్రిక్, సీసీ కెమెరాలు, తనిఖీ సిబ్బంది, సహాయకులు, పోలీసు బందోబస్తు తదితర ఏర్పాట్లు ఇప్పటికే పూర్తయ్యాయి. వారికి శిక్షణలు, జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో అవగాహన సమావేశాలు నిర్వహించారు.

## విద్యుత్ కోతలు రానివ్వం

>> కరెంట్ కోతలు ఉండటానికి వీల్లేదని స్పష్టం చేశారు. సాంకేతిక సమస్యలు తలెత్తి విద్యుత్ కోతలు విధించాల్సి వస్తే ప్రజలకు ఆ సమాచారం చెప్పటంతో పాటు వెంటనే సమస్య పరిష్కరించేలా చూడాలని మంత్రి దిశానిర్దేశం చేశారు. వేసవి డిమాండ్‌కు తగ్గట్లుగా సరిపడా కరెంట్ అందుబాటులో ఉన్నా అక్కడక్కడా ఫిర్యాదులు ఎందుకు వస్తున్నాయని మంత్రి ఆరా తీశారు. అధిక ఉష్ణోగ్రతలతో పలుచోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవటం, అకాల వర్షాల వల్ల సమస్యలు తలెత్తుతున్నాయని అధికారులు వివరించారు. ప్రజలు ఇబ్బంది పడకుండా ఆయా సమస్యల పరిష్కారానికి సిబ్బంది అందుబాటులో ఉంటూ పూర్తి అప్రమత్తంగా ఉండాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు.

## పేపర్ మిల్లు లాకౌట్

>> పెంపు కోరుతూ సుమారు 850 మంది కాంట్రాక్ట్ కార్మికులు సమ్మె చేపట్టారు. ఈ సమ్మె కొనసాగుతున్న సమయంలోనే లాకౌట్ ప్రకటించడం కార్మికుల్లో తీవ్ర అసంతృప్తిని రేకెత్తించింది. లాకౌట్ ప్రభావంతో 850 మంది కాంట్రాక్ట్ కార్మికులతో పాటు సుమారు 390 మంది శాశ్వత ఉద్యోగులు కూడా ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించకుండా యాజమాన్యం లాకౌట్‌కు దిగడం అన్యాయం అని కార్మిక సంఘాలు విమర్శిస్తున్నాయి. విషయం తీవ్రతను గుర్తించిన జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కార్మిక శాఖ అధికారులు యాజమాన్యం, యూనియన్ ప్రతినిధులతో చర్చలు ప్రారంభించారు. ఇరుపక్షాల మధ్య సయోధ్య కుదిరేలా ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.ఇక ఈ అంశంపై రాజకీయ నాయకులు కూడా స్పందించారు.కార్మిక సంఘాలు, కార్మికులకు మద్దతుగా నిలిచాయి. కార్మికులకు న్యాయమైన వేతనాలు ఇవ్వాలని, లాకౌట్‌ను ఎత్తివేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యే నివాసంలో యూనియన్ నేతలు, యాజమాన్య ప్రతినిధులతో చర్చలు కొనసాగుతున్నాయి. లాకౌట్ ఎత్తివేతపై స్పష్టత రాకపోవడంతో కార్మికుల్లో ఆందోళన కొనసాగుతోంది. త్వరలోనే పరిష్కారం దొరుకుతుందా అన్నది ఆసక్తిగా మారింది.



శనివారం పశ్చిమ బెంగాల్ దక్షిణ 24 పరరగణాల జిల్లాలోని ఓ పోలింగ్ కేంద్ర వద్ద రీపోలింగ్ కోసం వేచి ఉన్న ఓటర్లు

## ఎండ దెబ్బకు దడదడ

>> మార్కాపురం 3, ప్రకాశం 15, నెల్లూరు 4, తిరుపతి 5 మొత్తంగా 124 మండలాల్లో వడగాల్పులు.. వీచే అవకాశం ఉందన్నారు.ఎండ తీవ్రత, ఉక్కపోత పట్ల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దీని ప్రభావంతో ..ఆదివారం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, పోలవరం, విశాఖ, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. రైతులు వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉరుములతో కూడిన వర్షం పడేటప్పుడు పొలాల్లో పని చేసే రైతులు, కూలీలు, పశు కాపరులు చెట్ల కింద నిలబడరాదని హెచ్చరించారు.

## చత్తీస్‌గఢ్‌లో పేలిన పాతర

>> మావోయిస్టులు అమర్చిన మందుపాతరను గుర్తించి వెలితీసే క్రమంలో ప్రమాదవశాత్తు పేలి ఒక ఇన్స్పెక్టర్ ముగ్గురు జవాన్లు మృతిచెందారు.మృతిచెందిన వారిలో సుఖరామ్ వట్టి (ఇన్‌స్పెక్టర్) కానిస్టేబుల్ కృష్ణ కోమ్రా సంజయ్ గఢ్ పాల్ ఘటనా ప్రాంతంలో మృతిచెందగా మరో జవాన్ పరమానంద్ కొర్రామ్ తీవ్రగాయాలు అవ్వడంతో హుటాహుటిన మొరగైన వైద్యం కోసం రాయపూర్ తరలించి చికిత్సలు అందిస్తుండగా మృతిచెందాడు.ఈ ఘటనపై ఐజీ సుందర్ రాజ్ మాట్లాడుతూ ఈ చాలా దురదృష్టమైన సంఘటన అని మృతుల కుటుంబాలకు తన సానుభూతిని వ్యక్తం చేసారు.వారికి పోలీస్ శాఖ ప్రభుత్వం తరుపున అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు.

## యుపిఐ లావాదేవీలు

>> జరిగినట్లు రికార్డులు వెల్లడించాయి. అదే సమయంలో, లావాదేవీల విలువ 2016-17 లో రూ.0.07 లక్షల కోట్ల నుండి 2025-26లో సుమారుగా రూ.314 లక్షల కోట్లకు గణనీయంగా పెరిగింది. ఇది లావాదేవీల విలువలో 4 వేల రెట్లకు పైగా పెరుగుదలకు దారితీసింది. ఇక యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ వృద్ధి పథంలో 2025 సంవత్సరం ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. 2025 ఆగస్టులో నెలవారీ లావాదేవీల పరిమాణం తొలిసారిగా 2,000 కోట్ల లావాదేవీలను దాటి, 2,001 కోట్ల లావాదేవీలకు చేరుకుంది. ఈ ఊపు సంవత్సరం మిగిలిన కాలమంతా కొనసాగింది. డిసెంబర్ 2025లో 2,163 కోట్ల లావాదేవీలు నమోదయ్యాయి, ఇది యుపీఐ దశాబ్ద కాల ప్రయాణంలో అత్యధిక నెలవారీ లావాదేవీల పరిమాణం. 2025 క్యాలెండర్ సంవత్సర కాలంలో, యూపీఐ మొత్తం మీద సుమారు 22 వేల కోట్ల లావాదేవీలను ప్రాసెస్ చేసింది, ఇది రోజుకు సగటున దాదాపు 60 కోట్ల లావాదేవీలకు సమానం. ఈ నేపథ్యంలో దేశ డిజిటల్ చెల్లింపుల్లో యూపీఐ వాటా 85 శాతంగా నమోదైంది. ఈ నిరంతర అధిక వినియోగం దేశవ్యాప్తంగా డిజిటల్ చెల్లింపుల విస్తృత వ్యాప్తిని, దేశ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థపై పౌరులు, వ్యాపారులు, వ్యాపార సంస్థలలో పెరుగుతున్న నమ్మకాన్ని ప్రతిబింబిస్తుందని ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

# ఇరాన్‌కు 500 కోట్ల డాలర్ల నష్టం!

>> వస్తువులను రవాణా చేస్తున్నాయనే అనుమానంతో 40కి పైగా నౌకలను దారి మళ్లించినట్లు పెంటగాన్ అధికారులు తెలిపారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా రెండు నౌకలను అమెరికా దళాలు స్వాధీనం చేసుకున్నాయి.

**సముద్రంలో చిక్కుకున్న 53 మిలియన్ బ్యారెళ్ల చమురు**

ప్రస్తుతం గల్ఫ్ జలాల్లో సుమారు 53 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురుతో ఉన్న 31 ఇరానియన్ ట్యాంకర్లు చిక్కుకుపోయాయని అధికారులు వెల్లడించారు. దీని విలువ దాదాపు 4.8 బిలియన్ డాలర్లు ఉంటుందని అంచనా. ఇప్పటికే భూమిపై ఉన్న నిల్వ కేంద్రాలు నిండిపోవడంతో ఇరాన్ పాతబడిన ట్యాంకర్లను తేలియాడే నిల్వ కేంద్రాలుగా (ఫ్లోటింగ్ స్టోరేజ్ యూనిట్లుగా) మార్చింది. అమెరికా నిఘాను తప్పించుకోవడానికి కొన్ని నౌకలు చైనాకు చేరడానికి సుదీర్ఘమైన, ఖర్చుతో కూడిన ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణిస్తున్నాయి. ట్యాంకర్‌ట్రాకర్స్.కామ్ సహ వ్యవస్థాపకుడు సమీర్ మదానీ ఈ పరిస్థితిని విశ్లేషించారు. హ్యూజ్ అనే పేరున్న ఒక ట్యాంకర్ పాకిస్థాన్, భారత తీరాలకు దగ్గరగా ప్రయాణించి, అనంతరం మలక్కా జలసంధి వైపు వెళ్లిందని, అక్కడి నుంచి చమురును చైనాకు వెళ్లే ఇతర నౌకలకు తరలిస్తున్నారని ఆయన తెలిపారు. ఒత్తిడి ఇలాగే కొనసాగితే, పాకిస్థాన్ సరిహద్దుకు సమీపంలో భారీగా నిల్వలను ఏర్పాటు చేసుకుని, ఏదో ఒకరోజు రాత్రికి రాత్రే ఒక్కసారిగా తప్పించుకోవడానికి (గ్రేట్ ఎస్కేప్) ఇరాన్ ప్రయత్నించవచ్చని నేను భావిస్తున్నాను" అని ఆయన యాక్సియోస్‌తో అన్నారు.

ఈ ప్రతిష్టంభన ఇరు దేశాల మధ్య భారీ ఆర్థిక ఘర్షణగా మారింది. హార్మూజ్ జలసంధిలో ఇరాన్ రాకపోకలను నియంత్రిస్తుంటే, అమెరికా దిగ్బంధనంతో ప్రతిఘటిస్తోంది. మరికొన్ని వారాల్లో ఇరాన్ వద్ద నిల్వ సామర్థ్యం పూర్తిగా అయిపోయి, చమురు ఉత్పత్తిని నిలిపివేయాల్సిన ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. "నిల్వ సామర్థ్యం పూర్తిగా అయిపోవడానికి వారికి కొన్ని వారాలు, లేదా బహుశా ఒక నెల సమయం పట్టవచ్చు" అని యూరేషియా గ్రూప్‌కు చెందిన విశ్లేషకుడు గ్రెగరీ బ్రూ పేర్కొన్నారు.

"ఉగ్రవాదానికి, ప్రాంతీయ అస్థిరతకు నిధులు సమకూర్చే ఇరాన్ ప్రభుత్వ సామర్థ్యంపై మేము విధ్వంసకరమైన దెబ్బ కొడుతున్నాం. ఈ ప్రాంతంలోని మా సాయుధ దళాలు ఈ నిరంతర ఒత్తిడిని కొనసాగిస్తాయని పెంటగాన్ ప్రెస్ సెక్రటరీ జోయెల్ వాల్డెజ్ స్పష్టం చేశారు.

## సూత్రధారులు ఏరీ?

>> టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్(ఇప్పటికే చర్యలకు గురై పోస్టింగ్‌కూడాలేని), అదనపు ఇఒ ఏవి ధర్మారెడ్డి(కీలకమైన డిఆర్‌డిఒ శాఖ పదవి నుండి తప్పుకుని,విశ్రాంతత)పాత్ర ఉందనేది సిబిఐ సిట్‌తోబాటు ఏకసభ్యకమిటీ నిగ్గుతేల్చింది. వీరితోబాటు కర్త,కర్మ,క్రియగా మారిన టిటిడి ముఖ్య గణాంకఅధికారి (ఎఫ్ఎసిఇఒ) ఓ.బాలాజీ(దీర్ఘకాల సెలవుపై వెళ్ళిపోయిన) వ్యవహరించి అక్రమాలకు వంతపాడారనేది ప్రధాన ఆరోపణలు. 2024లోనూ తిరుమల లడ్డూలకు కల్తీనెయ్యి సరఫరా అయ్యిందని, లడ్డూల పవిత్రతను దెబ్బతీశారని కూటమి ప్రభుత్వం, సిఎం చంద్రబాబు ప్రధాన ఆరోపణలతో సంచలనం రేపింది. వరుసగా సిబిఐ సిట్ అధికారులు నిష్పక్షపాత దర్యాప్తుతో అక్రమాలు,అవినీతిని కీలకంగా వెల్లడించింది. దేవుని లడ్డూ ప్రసాదంకు వినియోగించే నెయ్యిసరఫరా టెండర్లు నిబంధనల సడలింపులోనే సింఘాల్‌తో బాటు ధర్మారెడ్డి, బాలాజీలు ముఖ్యులనేది అప్పట్లోనే 'వార్త' పేర్కొంది. ఇందుకు ఇఒగా అప్పట్లో పనిచేసిన ఎకె సింఘాల్ పదవి కోసం వైసిపి బోర్డుకు తలూపారనేది ఇప్పుడు సంచలనమైన విషయం. ఆ తరువాత టిటిడిలో సర్వం తానై వ్యవహరించిన ఇఒ,అదనపు ఇఒ హోదాలో ఏవి ధర్మారెడ్డి చెప్పిందే వేదంగా గత టిటిడి బోర్డు పెద్దలు, టిటిడి అధికారులు పనిచేశారనేది సిట్ నివేదికల్లో సంచలనం కలిగించిన విషయం. ఇప్పుడు కల్తీ నెయ్యి దందాలో సింఘాల్‌తో సహా ధర్మారెడ్డి, ఎఫ్ఎసిఎఒ బాలాజీతో సహా చర్యలు తీసుకుని సస్పెన్షన్‌లో ఉన్న అప్పటి గోశాల డైరెక్టర్ డాక్టర్ హారనాథరెడ్డి, మార్కెటింగ్ విభాగం,కొనుగోళ్లకమిటీ, పోటు విభాగంకు చెందిన పాత్రధారులను 36మందిని గుర్తించిన సిట్ 11మంది టిటిడి అధికారులే ఉన్నారనేది తేల్చింది. ఆ తరువాత అసలైన సూత్రధారుల కోసం నిగ్గుతేల్చేందుకు ప్రభుత్వం రెండునెలల ముందు విశ్రాంత ఐఎఎస్ అధికారి, విశ్రాంత సిఎస్ దినేశ్‌కుమార్‌కు అవసరమైన సమాచారం అందించడానికి, సహాయసహకారాలకు టిటిడికి చెందిన ఎఇఒ ప్రాపర్టీస్‌సెల్ ఎన్.రవి,విశ్రాంత అటవీఅధికారి మునీంద్ర, విశ్రాంత అధికారి శివకుమార్,ఆర్టీజిఎస్ డిప్యూటీ సిఇఒ మాదురిలు గతంలో కొనుగోలు చేసిన నెయ్యి టెండర్ల రికార్డులు, వివరాలు సేకరించారు.లోతుగా అధ్యయనం చేసి 56రోజుల్లో సమగ్ర సమాచారంతో నెయ్యిలో కల్తీ జరగడానికి ప్రధాన కారణాలు, టెండర్లు దక్కించుకునేందుకు నిబంధనలు ఉల్లంఘన సరఫరా విషయాలపై నివేదికలతో ఆధారాలు రికార్డు చేశారు, నెయ్యిట్యాంకర్లను తనిఖీ చేసి నాణ్యత పరీక్షించకుండానే వినియోగించిన విధానం వంటి అంశాలను పరిగణనలోనికి తీసుకున్నారు. ఇప్పుడు ఏకసభ్యకమిటీ నివేదిక, సిట్ నివేదికలు ప్రభుత్వం చేతిలో ఉన్నాయి. కీలకంగా కల్తీనెయ్యి వ్యవహారంలో గత వైసిపి బోర్డులో పనిచేసిన కీలక అధికారులు దోషులేననేది తేల్చారు.

అంతేగాక టిటిడి కొనుగోలు విభాగం,మార్కెటింగ్ విభాగాలను ప్రక్షాళన చేయాలని, అనుబంధంగా ఉన్న పోటులో కూడా భారీగా సంస్కరణలు అమలు చేయాలని దినేశ్‌కుమార్ నివేదికలో పేర్కొనడం విశేషం. టిటిడి మార్కెటింగ్ కొనుగోలు విధానం అనుసరిస్తున్న పద్ధతులు బాగాలేదని, మొత్తంగానే ఆ వ్యవస్థను ప్రక్షాళన చేయాలని కమిటీ 54పేజీల నివేదికలో సూచించడం ఇప్పుడు హాట్‌టాపిక్‌గామారింది. నెయ్యి సరఫరాల నిబంధనలను సడలించడం ద్వారా కల్తీకి టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లకు భారీగా సహకరించారనేది సమాచారం. నెయ్యి కొనుగోలు ప్రక్రియలో తలెత్తిన వ్యవస్థాగత వైఫల్యాలే లడ్డూ ప్రసాద పవిత్రతను దెబ్బతీశాయనేది కమిటీ నివేదిక. ఆహార భద్రతా నియమాలను కూడా పూర్తిగా ఉల్లంఘించారని వెల్లడించారు. డెయిరీల అర్హత, నాణ్యమైన నెయ్యి సరఫరా తీరుపై నిఘా లేదనేది తేల్చారు. నెయ్యి కొనుగోలు టెండర్ ప్రక్రియలో అవకతవకల కారణంగా టిటిడికి కల్తీ నెయ్యి సరఫరా జరిగిందని కమిషన్ తేల్చిన అంశం. తక్కువ ధరకు సరఫరా చేసే కంపెనీలకు ప్రాధాన్యత ఇవ్వడంతోనే కల్తీని ప్రోత్సహించారనేది గుట్టురట్టుచేశారు. అసలు సూత్రధారులు ఎవరిపైనా చర్యలు తీసుకోలేదని కమిషన్ తన నివేదికలో తెలిపింది. నాణ్యత పరీక్షలు చేయకుండానే 70లక్షల కిలోలకు పైగా నెయ్యిని సేకరించారు. సింఘాల్‌తో పాటు టీటీడీ బోర్డు, కొనుగోలు కమిటీ, అదనపు ఈవో, ప్రొక్యూర్‌మెంట్ జిఎం సహా పలువురు సీనియర్ అధికారుల తప్పిదాలు ఉన్నాయనేది కమిటీ తేల్చడంతో ఇకపై అసలు దోషులెవరనేది అరెస్ట్‌లు జరుగుతాయా అనేది సంచలనంగా మారింది.టిటిడి బోర్డుకు ప్రత్యేక ఆహ్వానితులను నామినేట్ చేసే నిబంధనను తొలగిస్తూ చట్ట సవరణ చేయాలని,

బోర్డులో వృత్తి నిపుణులు, వివిధ రంగాల్లో నిపుణులైన వారిని నియమించాలని పేర్కొన్నారు. టిటిడిలో ఎవరినుండైనా అందే ఫిర్యాదుల నిజ నిర్ధాంఃణకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలనేది ఏకసభ్యకమిటీ సూచన. ఇప్పటికే 'వార్త' ప్రధానంగా కల్తీనెయ్యిపై పలు దఫాలుగా విచారణ విషయాలు వెల్లడించింది. ఏకసభ్యకమిటీ నివేదికలతో సంచలనాలు జరగనున్నాయని ముందే చెప్పింది. నెయ్యి "కల్తీ" లో గత అధికారుల మెడకు పాపం చుట్టుకుంటుందనేది వెల్లడించింది. ఏకసభ్య కమిటీ తుది నివేదికలతో ప్రభుత్వం పెద్దోళ్ళ పైన ఎలాంటి చర్యలు తీసుకుంటుందనేది ఇప్పుడు ఉత్కంఠగా మారుతోంది..ఈ కల్తీనెయ్యి వివాదం ఎవరి మెడకు చుట్టుకోనుందనే విషయం టిటిడి ఉద్యోగుల్లో ఆందోళన కలిగిస్తోంది.

### వారం - వర్జ్యం

03-05-2026, ఆదివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
వైశాఖమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, కృష్ణపక్షం, కృత్తిక కార్తె
విదియ రా.3.02
విశాఖ ఉ.7.10
వర్జ్యం : ఉ.11.38 -మ.1.25
దు.సా.4.40 - సా.5.31
శుభసమయం:ఉ.8.30-9.30
రాహుకాలం సా.4.30-6.00

### వార్తాఫలం

**మేషం:** శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది. కుటుంబ పురోభివృద్ధి సాంకేతిక విద్యావకాశాలు పొందుతారు.

**వృషభం:** మిత్రులతో ఏర్పడిన విభేదాలు పరిష్కార మవుతాయి. దూర ప్రాంతాల నుండి కీలక సమాచారం అందుకుంటారు.

**మిథునం:** కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ఏ పనిని చేపట్టిన విజయ వంతంగా పూర్తి చేస్తారు. వస్త్రలాభం.

**కర్కాటకం :** సహచరుల యొక్క అనుచర గణముల యొక్క కార్యకలాపములను గమనించుట జాగ్రత్త వహించుట మంచిది.

**సింహం:** గుడ్డిగా ఎదుటి వారి మాటలు నమ్మటం వలన మోసపోయే అవకాశాలు ఉన్నాయి.జాగ్రత్త. కోపాన్ని అదుపులో ఉంచుకోండి.

**కన్య :** దైవ కార్యక్రమాలలో, శుభకార్యాలలో చురుకుగా పాల్గొంటారు. స్పెక్యులేషన్‌కు దూరంగా ఉండండి. వాహన సౌలభ్యం.

**తుల :** వృత్తి, ఉద్యోగాలలో మీరు చేసే స్వయం కృతాపరాధ ముల వలన నష్టపోతారు. సేవాకార్యక్రమాలలో పాల్గొంటారు.

**వృశ్చికం:** దీర్ఘాలోచనలు చేయక పరిష్కారం లేని సమస్యలు కాలానికి వదిలి వేయండి. క్రయ విక్రయాలలో ప్రోత్సాహం.

**ధనుస్సు:** మీకు మిశ్రమ ఫలితాలు గోచరిస్తున్నాయి. ఆరోగ్య విషయంలో శ్రద్ధను వహించవలసి వస్తుంది.కొత్త పరిచయాలు.

**మకరం:** ప్రభుత్వం నుండి అందవలసి నటువంటి సహాయ సహకారాలలో జాప్యం చోటు చేసుకుంటుంది. బంధువుల కలయిక.

**కుంభం:** ప్రతి పని ఒక అడుగు ముందు నాలుగు అడుగులు వెనుకగా సాగుతుంది. విందు, వినోదాలలో పాల్గొంటారు.

**మీనం :** మీ ఆలోచనలు కార్యరూపం అయితే పురోభివృద్ధి మాత్రం నామ మాత్రంగా ఉంటుంది. వస్త్ర లాభం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# చేనేతల లోగిళ్లలో 'ఉచిత' కాంతులు

### మర మగ్గం నేతన్నలకు 500 యూనిట్లు ఉచితంగా అందజేత

### జీరో పేమెంట్‌తో మే నెల విద్యుత్ బిల్లుల రాక

### నేతన్నల కుటుంబాల్లో హర్షాతిరేకాలు

**విజయవాడ, మే2,ప్రభాతవార్తప్రతినిధి:** ఇచ్చిన మాటకు కట్టుబడుతూ కూటమి ప్రభుత్వం నెరవేర్చిన హామీ నేతన్నల కుటుంబాల్లో వెలుగులు నింపుతోంది. ఉచిత విద్యుత్ పథకం అమలులో భాగంగా తొలి నెలలో జీరో పేమెంట్ విద్యుత్ బిల్లు రావడంతో చేనేతలు ఉబ్బితబ్బిబ్బవుతున్నారు. మాట నిలబెట్టుకున్న సీఎం చంద్రబాబుకు, కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియ జేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేనేత రంగ అభివృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తోంది. ఒకవైపు చేనేత పరిశ్రమకు పూర్వవైభవం తీసుకొచ్చేలా చర్యలు చేపడుతూనే, నేతన్నలకు వ్యక్తిగత లబ్ధి కలిగేలా పథకాలు అమలు చేస్తోంది. దీనిలో భాగంగా, గత నెల ఒకటో తేదీ నుంచి చేనేతలకు మేలు కలిగేలా కూటమి ప్రభుత్వం ఉచిత విద్యుత్ పథకానికి శ్రీకారం చుట్టింది.

ఈ పథకం ద్వారా లక్షా నాలుగు వేల కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందజేసేలా చర్యలు చేపట్టింది. మగ్గంపై నేసే నేతన్నలకు నెలకు 200 యూనిట్లు, మర మగ్గంపై నేసే నేతన్నలకు 500 యూనిట్లు ఉచితంగా ఇవ్వాలని సీఎం చంద్రబాబునాయుడు నిర్ణయించారు. ఉచిత విద్యుత్ పథకం అమలుతో చేనేత కుటుంబాలకు ఆర్థిక వెసులుబాటు కలిగింది. ఒకవైపు చేనేత రంగ అభివృద్ధికి ప్రణాళికలు అమలుచేస్తూనే, నేతన్నలకు వ్యక్తిగత లబ్ధి కలిగించేలా పథకాలు అమలు చేస్తోంది. 50 ఏళ్లు నిండిన నేతన్నలకు రూ.4 వేల చొప్పున పెన్షన్ అందజేస్తోంది. ఏటా రూ.5 కోట్ల మేర త్రిఫ్ట్ ఫండ్ నిధులు కేటాయిస్తోంది. నూలుపై 15 శాతం సబ్సిడీ అందజేస్తోంది. ఆప్కో ద్వారా చేనేత ఉత్పత్తుల అమ్మకాలు పెంచేలా ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేస్తోంది. ఆన్ లైన్ ద్వారా నేరుగా వినియోగదారుల ఇళ్లకే చేనేత ఉత్పత్తులను డోర్ డెలివరీ చేస్తోంది. 2,640 మంది చేనేత కార్మికులకు ముద్ర పథకం కింద రూ.24.43 కోట్లు అందచేసింది. గత నెల ఒకటో తేదీ నుంచి ఉచిత విద్యుత్ పథకం అమల్లోకి రావడంతో, గడిచిన రెండ్రోజుల నుంచి గ్రామాల్లో చేనేతలకు విద్యుత్ బిల్లులను ట్రాన్స్ కో అధికారులు అందజేస్తూ వస్తున్నారు. జీరో పేమెంట్ విద్యుత్ బిల్లులు రావడంతో, చేనేతల ఆనందానికి



అవధుల్లేకుండాపోయింది. బిల్లులు చెల్లించాల్సిన అవసరంలేదని ట్రాన్స్ అధికారులు చెబుతుండడంతో వారంతా మురిసి పోతున్నారు. చేనేత, విద్యుత్ శాఖాధికారులు సమన్వయంతో పనిచేస్తూ నేతన్నల ఉచిత విద్యుత్ పథకం విజయవంతానికి తమ వంతు పాత్ర పోషించారు. రాష్ట్రంలో 50,252 మగ్గం నేతన్నల కుటుంబాలను, 6,995 మరమగ్గం మీద నేసే కుటుంబాలను ఉచిత విద్యుత్ పథకం కింద అర్హులుగా గుర్తించారు. వారికి ఉచిత విద్యుత్ సరాఫరా చేశారు. మిగిలిన అర్హులకూ ఉచిత విద్యుత్ పథకం వర్తించేలా కృషి చేస్తున్నారు.ఉచిత విద్యుత్‌తో మగ్గం నేతన్నలకు నెలకు రూ.720లు, సంవత్సరానికి రూ.8,640లు లబ్ధి కలుగనుంది. మరమగ్గం మీద నేసే కుటుంబానికి నెలకు రూ.1,800లు, ఏడాదికి రూ.21,600లు లబ్ధి కలుగనుంది. ఉచిత విద్యుత్ రూపంలో నెల నెలా ఆర్థిక భారం తప్పిందని, తమకు ఆర్థికంగా ఎంతో మేలు చేస్తోందని నేతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చినమాటకు కట్టుబడుతూ, ఉచిత విద్యుత్ హామీ నెరవేర్చిన సీఎం చంద్రబాబుకు, మంత్రి నారా లోకేశ్ కు, కూటమి ప్రభుత్వానికి చేనేతలు ధన్యవాదాలు తెలియజేస్తున్నారు.చేనేత కార్మికులకు గౌరవ జీవనం కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష ్యం. సగం ధరకే చీర, దోవతి నినాదంతో ఆనాడు అన్న ఎన్టీఆర్ చేనేత రంగానికి ఊపిరిపోస్తే, నేడు సీఎం చంద్రబాబు నేతన్నలకు ఆర్థిక మేలు కలుగజేసేలా పథకాలు రూపొందిస్తున్నారు. పెన్షన్లు, నూలుపై సబ్సిడీ, త్రిఫ్ట్ ఫండ్ నిధులు, ముద్ర రుణాలు, 90 శాతం సబ్సిడీ ఆధునిక పరికరాలు అందజేత వంటి కార్యక్రమాలను సీఎం చంద్రబాబు అమలు చేస్తున్నారన్నారు.

3-5pg4.qxd:3-5pg4.qxd 1/1/02 6:18 AM Page 1



# కొనుగోలు కేంద్రాల్లో అన్నదాతల పడిగాపులు

మల్లికార్జున

యాసంగిలో అన్నదాతలు పండించిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతోంది. అయితే వరి కోతలు సాగుతున్నంత వేగంగా ధాన్యం కొనుగోళ్లు కొనసాగడం లేదన్న అసంతృప్తి అన్నదాతల్లో నెలకొంది. ప్రస్తుతం రాష్ట్రంలో యాసంగి వరి, మొక్కజొన్న ధాన్యం సేకరణ కొనసాగుతోంది. ఈ ఏడాది దాదాపు 90లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకు దాదాపు 8221కు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 6వేల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ ఏడాది రబీలో తెలంగాణలో దాదాపు 53లక్షల ఎకరాలకు పైగా వరి సాగైంది. ప్రస్తుతం యాసంగి వరి కోతలు రాష్ట్ర వ్యాప్తంగా ముమ్మురంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే దాదాపు 60శాతం వరి కోతలు పూర్తి కాగా మరో 40శాతం మేర ఈ వారం, పది రోజుల్లో పూర్తి కానున్నాయి. ఈ నేపథ్యంలో వరి ధాన్యం క్రయ,విక్రయాలు ఇటు రైతులకు, అటు వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ, పౌరసరఫరాల శాఖ అధికారులకు సవాల్‌గా మారింది. యాసంగి పంట కాలం అంటేనే ధాన్యం సేకరణను అకాల వర్షాలు వెంటాడుతుంటాయి. ఈ విషయం ప్రతి ఏటా అనుభవంలోకొస్తున్నా అన్నదాతలకు తగినన్ని టార్పాలిన్ షీట్లు అందుబాటులో ఉంచడంలో పౌరసరఫరాలశాఖ విఫలమైందన్న ఆరోపణలు ఉన్నాయి. గత 2016 వరకు వ్యవసాయశాఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై అన్నదాతలకు టార్పాలిన్ షీట్లను అందజేసేది. అయితే గడిచిన కొద్ది సంవత్సరాలుగా తాటి పత్రులు పంపిణీ చేయకపోవడంతో కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన, కుప్పనూర్చిన ధాన్యాన్ని అకాల వర్షాల బారి నుండి కాపాడుకోలేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అకాల వర్షాలు కురిస్తే తమ వద్ద అందుబాటులో ఉన్న తాటిపత్రులు ధాన్యాన్ని కాపడలేకపోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో ఈ ఏడాది రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నా కొనుగోలు కేంద్రాల్లో అన్నదాతలకు నీడ కోసం టెంట్లు, తాగునీటి వసతి తదితర కనీస సౌకర్యాలు కరువయ్యాయి. ధాన్యాన్ని నిబంధనల మేరకు 17శాతం తేమ వచ్చేవరకు ఆరబోసి, మాయిశ్చర్ వచ్చాక కుప్ప నూర్చేందుకు రైతు కుటుంబంలోని పిల్లా జల్లా అంతా కష్టపడాల్సిందే. అయితే కొనుగోలు కేంద్రాల్లో నీడ, చల్లని తాగునీరు వంటి కనీస వసతులు లేకపోవడంతో సమీపంలోని చెట్ల కిందనే రైతులు సేదదీరాల్సి వస్తోంది. ఈ



పరిస్థితుల్లో అకాల వర్షాలు, గాలివానలు వస్తే రైతుల ప్రాణాలకు ప్రమాదమన్న ఆందోళన వ్యక్తమవుతోంది. మొత్తంగా ఓవైపు ఎండల తీవ్రత, మరోవైపు అకాల వర్షాల భయం, మరో వైపు కల్లాలు దాటని వడ్లను చూస్తూ రైతులు ఆవేదనతో కుమిలిపోతున్నారు. చేతికొచ్చిన పంటను అమ్ముకోలేక వర్షాల నుంచి కాపాడుకోలేక రైతులు సతమతమవుతున్నారు. యాసంగి ధాన్యం కొనుగోళ్లకు రవాణా ఇబ్బందులు పెద్ద ప్రతిబంధకంగా మారాయి. తూకం వేసిన ధాన్యాన్ని సకాలంలో రైస్ మిల్లులకు తరలించేందుకు లారీలు అందుబాటులో లేకపోవడంతో పలు జిల్లాల్లో ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు పేరుకుపోతున్నాయి. సకాలంలో లారీలు రాకపోవడంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో అకాల వర్షం కురిస్తే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ముంది. నిబంధనల మేరకు 17శాతం మేర తేమ వచ్చేంత వరకు ఆరబోసిన ధాన్యాన్ని రైతులు రాసిపోశారు. అందుబాటులో ఉన్న టార్పలిన్లతో తడవకుండా పట్టాలు కప్పారు. అయితే ధాన్యం రాసిని బస్తాకు 40కిలోల చొప్పున తూకంవేసి లోడింగ్ కోసం లారీల కోసం వేచి చూస్తుండడంతో ఆ ధాన్యాన్ని అకాల వర్షాల భారి నుండి కాపాడడం రైతులకు సవాల్‌గా మారింది. వర్షం బారి నుండి ధాన్యం బస్తాలన్నింటినీ రక్షించేలా కప్పి ఉంచడానికి తగినన్ని టార్పలిన్లు రైతులకు అందుబాటులో లేకుండాపోయాయి. దీంతో కొనుగోళ్లను వేగంగా చేపట్టాలని, తూకం వేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించేందుకు లారీలను సమకూర్చాలని డిమాండ్ చేస్తూ పలు జిల్లాల్లో అన్నదాతలు రోడ్డెక్కి నిరసన తెలుపుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రతీ ఏడాది ధాన్యం రవాణాలో ట్రాన్స్‌పోర్ట్ సమస్య వెంటాడుతోంది. తరుగు పేరుతో రైతులు నిలువు దోపిడీకి గురవుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను మద్దతు ధరకు అమ్ముకుందామని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు వస్తే మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల అక్రమాలు అన్నదాతలకు శాపంగా మారుతున్నాయి. వడ్లలో తేమ, తాలు, రాళ్లు ఉన్నాయనే సాకుతో క్వింటాల్‌కు 3నుంచి 5 కిలోల వరకు తరుగు తీస్తున్నారు. ఒక బస్తాకు 41 కేజీల వడ్లు తూకం వేయాల్సి ఉండగా, 44-45 కేజీల వరకు జోకుతుండడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతు పండించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి పక్షం రోజుల వరకు ఆరబెట్టి తేమ 17శాతం వరకు వచ్చాక తూకం వేసే క్రమంలో పాక్షిక నష్టం, గన్నీ బస్తాల బరువు పేరుతో అదనంగా 3నుంచి 5కిలోల మేర వడ్లను జోకుతుం డడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసంగానైనా క్వింటాల్‌కు అయిదు కేజీల వరకు తరుగు పేరిట తూకం అంటే ఎకరా ధాన్యం సాగుచేసిన రైతు 20 క్వింటాళ్లు పండించినా ఒక క్వింటా మేర తరుగు కిందనే నష్టపోతున్నాడు. అంటే ఎకరం ధాన్యం సాగు చేసిన రైతుకు క్వింటా ధాన్యం పైగా రూ.3000 వరకు తరుగు పేరిట నష్టపోతున్నాడు. ధాన్యం నాణ్యత లేదని, రంగు మారిందని సాకులు చూపిస్తూ క్వింటాల్‌కు 3కిలోల వరకు కోత పెడుతున్నారని రైతులు వాపోతున్నారు. ఒకబస్తా 41కిలోల వరకు తూకం వేయాల్సి ఉండగా నిర్వహకులు 44 కిలోలకు పైగా తూకం వేస్తున్నట్టు రైతులు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉంటే కొనుగోలు కేంద్రాల్లో ఆధునిక ప్యాడి క్లినర్లు అందుబాటులో లేకపోవడంతో అన్నదాతలు ప్రయివేటు ప్యాడిక్లీనర్లకు గంటకు రూ.900 నుంచి రూ.1000 దాకా చెల్లించి తూర్పార బడుతున్నారు. ఎకరా ధాన్యాన్ని తూకం పట్టాలంటే గంట సమయం పడుతోంది. దీంతో 17శాతం తేమ వచ్చేంత వరకు ఆరబోసిన ధాన్యాన్ని తూర్పార బట్టాలంటే రైతు ఎకరాకు మరో రూ.1000నుఅదనంగా భరించాల్సిందే. మరోవైపు ధాన్యం విక్రయంలో కీలకమైన తమే నిబంధనలను సంతృప్తి పరచటం రైతులకు కత్తిమీద సాములాగా మారింది. యాసంగి లో మాడు పగిలే ఎండలు,వానాకాలంలో వర్షాలను ఎదుర్కొని ధాన్యాన్ని ఆరబోయడం చాలా కష్టంతో కూడుకున్న పని. ఈ పరిస్థితిని అధిగమించేందుకు ఆధునిక ప్యాడి డ్రయర్ (వరి ఆరబోత) యంత్రాలను సమకూరుస్తామని మూడేళ్లుగా ప్రతీసీజన్‌లో ప్రభుత్వం ప్రకటిస్తున్నా అవి ఇంతవరకు అందు బాటులోకి రావడంలేదు. మరోవైపు కొనుగోళ్ల తాలూకు సుతిల్ దారం కూడా రైతులే కొనుగోలు చేయాల్సి వస్తోంది. అయిదు ఎకరాలు పండించిన రైతు సుతిల్ దారానికే రూ. 1000దాకా వెచ్చించాల్సి వస్తోంది. హామాలీ ఛార్జీలు కూడా రైతే భరించాల్సి వస్తోంది. క్వింటాకు రూ.70 నుండి రూ. 100 వరకు హామాలి ఛార్జిలు చెల్లించాల్సి రావడంతో ఎకరా ధాన్యాన్ని లారిలోకి ఎత్తేందుకు రైతు దాదాపు రూ.2వేల


ది చాలదన్నట్టు ఈ ఏడాది నుంచి ఇన్ని ఇవ్వయ ప్రయాసలకోర్చి ధాన్యాన్ని రైస్ మిల్లులకు పంపితే మిల్లర్లు కొర్రీలు పెడుతూ అన్‌లోడ్ చేసుకోవడం లేదని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు వాపోతున్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన దొడ్డు రకం వడ్ల లారీలను మిల్లులకు పంపితే వారు దింపుకోవడం లేదు. దీంతో రోజుల తరబడి లారీలు అక్కడే ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అయితే తాము విధించిన షరతులకు అంగీకరిస్తేనే దొడ్డు ధాన్యాన్ని అన్‌లోడ్ చేసుకుంటామని కండిషన్ పెడుతున్న మిల్లర్లు తాలు పేరిట, మట్టి పెళ్ల పేరుతో అన్‌లోడ్ చేసుకోకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. పెద్దఎత్తున కోతలు విధిస్తూ రైతులను నిలువునా ముంచుతున్నారు. మిల్లర్ల చేతులెత్తేయడం, అధికారులు స్పందించక పోవడం, లారీ కాంట్రాక్టర్లు సైతం ముందుకు రాకపోవడం తదితర సమస్యలతో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, అన్నదాతలు తల నొప్పిగా మారింది. ఇక మక్క రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. యాసంగిలో కష్టపడి పండించిన పంటను కొనుగోలు చేసేవారు కరువయ్యారు. ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో పీఏసీఎస్‌ల ద్వారా కొనుగోళ్లు ప్రారంభించింది. మద్దతు ధర క్వింటాలుకు రూ.2400 ప్రకటించినా పిఏసిఎస్ నిర్వాహకులు గన్నీ సంచులు ఇవ్వకపోవడం, సకాలంలో తూకం వేయకపోవడం, లోడింగ్ కాక రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే పడిగాపులుగాయాల్సి వస్తోంది. మాడు పగులగొడుతున్న 46 డిగ్రీల మండుటెండలో మక్కల రాశుల వద్ద రైతులు పడిగాపులు గాయాల్సి రావడం గమనార్హం. ఈ పరిస్థితుల్లో ప్రత్యేక చొరవ తీసుకుని వరి, మక్కల కొనుగోళ్లు వేగంగా కొనసాగేలా వ్యవసాయ, మార్కెటింగ్, పౌరసరఫరాలశాఖ అధికారులను పురమాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని రైతులు కోరుతున్నారు.

# 24 గంటల్లో..

పశ్చిమ బెంగాల్

ఎ.వి.వి ప్రసాద్

జడివాన వెలిసింది.. ఉత్కంఠ పతాకస్థాయికి చేరింది. ఆరోపణలు, ప్రత్యారోపణలు శ్రుతిమించినపుడు తీవ్రస్థాయి నిందలతో ఉద్రిక్త స్థితికి చేరిన ప్రచారం, ఆ తర్వాత అదే ఉద్రిక్త పరిస్థితిమధ్య జరిగిన పోలింగ్ ముగిసి ఇప్పుడు రాజకీయ నాయకుల జాతకాలు తేలే సమయం ఆసన్నమైంది. ఎవరికి వారే గెలుపు ధీమాతో కనిపిస్తున్నారు. కానీ గెలుపనేది ఒక్కరికే గనుక కొందరు ముందే డీలాపడుతున్నారు. నరాలుతెగే ఉత్కంఠ మరి కొన్ని గంటలే. కొందరి ఆశలపై నీళ్లు చల్లుతూ, బెంగాల్ తుది విడత పోలింగ్ గత బుధవారం ముగియగానే వెలువడిన ఎగ్జిట్ పోల్స్ బెట్టింగ్ జోరును మరింత పెంచాయి. ఎవరు గెలుస్తారనేది ఎవరూ కచ్చితంగా చెప్పలేక పోయినా, ఎవరి అంచనాలను వారు ప్రకటిస్తూనే ఉంటారు. ఎగ్జిట్ పోల్స్‌లో శాస్త్రీయత ఎంత అనే సందేహం అలా ఉంచితే, వాటి కోసం అందరూ ఎంతో ఆసక్తితో ఎదురు చూస్తూనే ఉంటారు. దాదాపు మూడున్నర దశాబ్దాల నుంచి, పోలింగ్ ముగియగానే ఎగ్జిట్ పోల్స్ అంచనాలను మనం చూస్తూనే ఉన్నాం. మొదట అధికార స్థాయిలో ప్రకటించిన ఎగ్జిట్ పోల్స్‌పట్ల మీడియాలో ఉత్సుకత పెరగడంతో, తర్వాత మీడియాకు చెందిన అనేక సంస్థలు ఈ ఎగ్జిట్ పోల్స్ నిర్వహించడం మొదలు పెట్టాయి. 1996 లోక్‌సభ ఎన్నికల సమయంలో దూరదర్శన్, సెంటర్ ఫర్ ది స్టడీస్ ఆఫ్ డెవలపింగ్ సొసైటీస్ కలిసి ఎగ్జిట్ పోల్స్ ప్రకటించడంతో అప్పటినుంచి వాటికి విశేషాదరణ మొదలయింది. నిజానికి 1957లోక్ సభఎన్నికల సమయంలోనే ఎగ్జిట్‌పోల్స్ శాస్త్రీయ పద్ధతిలో జరిపినా అప్పట్లో వాటిని ఎవరూ ఎక్కువ పట్టించుకోలేదు. తర్వాత రాజకీయాలను వ్యాపారంగా భావించేవారు వారి భవిష్యత్తును అంచనా వేసే నిపుణులు కూడా ఎక్కువై రకరకాల సర్వేల పేరుతో జోస్యాలు చెబుతున్నారు. ఈఅంచనాలు ఒక్కోసారి నిజమైతే, కొన్నిసార్లు తారుమారవుతూంటాయి. 2004 ఎన్నికల్లో ఎన్డీయేఅధికారంలోకి వస్తుందని మెజారిటీ సర్వేలు చెప్పగా, ఆ అంచనాలు తారుమారు చేస్తూ యుపిఎ అధికారం లోకి వచ్చింది. తర్వాత 2009లో యుపిఎకు స్వల్ప మెజారిటీ వస్తుందని ఎగ్జిట్‌పోల్స్ చెప్పగా, ఆ అంచనాలకు దగ్గరగా యుపిఎకు స్పష్టమైన మెజారిటీ లభించింది. ఇలా కొన్ని సందర్భాల్లో అంచనాలు సరిగానే సాగుతూంటాయి. అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి బెంగాల్‌లో తీవ్ర పోటీ మధ్య బిజెపికి స్వల్ప ఆధిక్యత లభించవచ్చని మెజారిటీ సర్వేలు అంచనా వేశాయి. అయితే తృణమూల్ కాంగ్రెస్ వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చింది. ఇక 2024 లోక్‌సభ ఎన్నికలు చూస్తే దాదాపు అన్ని ప్రధాన సర్వేలు ఎన్డీయేకు 350 నుంచి 400 సీట్లు లభిస్తాయనీ, ఇండియా కూటమికి 120 170 సీట్లు రాగలవనీ అంచనా వేశాయి. అయితే అసలు ఫలితాలు ఆ అంచనాలకు దగ్గరగానే వచ్చి ఎన్డీయే గెలిచినా, ఎగ్జిట్ పోల్స్‌లో



ఓటింగ్ మిషన్

చెప్పినంత భారీ మెజార్టీ రాకపోవడం గమనించవలసిన అంశం. ప్రభుత్వం ఏ కూటమిదో సర్వేలు చెప్పాయి కానీ సీట్ల సంఖ్యలో వ్యత్యాసం ఎక్కువే కనిపించింది. ఆ ఎన్ని కల్లో ఎన్డీయేకు 293 సీట్లు రాగా, ఇండియా కూటమికి 234 సీట్లు లభించాయి. అంటే ఎగ్జిట్ పోల్స్‌అంచనాలకు భిన్నంగా సీట్ల సంఖ్యలు కని పించాయి. తాజాగా ఐదు అసెంబ్లీలకు జరిగిన ఎన్నికలపై భారీ అంచనాలే ప్రకటించడం గమనించవలసిన మరో అంశం. ఐదు పోలింగ్‌లలోను, బెంగాల్‌లో అత్యధికంగా దాదాపు 93శాతం ఓట్లు నమోదవడంతో ఈసారి అక్కడ ఫలితాల అంకెలు మారుతాయని సర్వేసంస్థలు చెబుతున్నాయి. పశ్చిమ బెంగాల్ లో ఈసారి 'కమలం' విరబూయవచ్చని మెజారిటీ ఎగ్జిట్‌పోల్స్ చెబుతున్నాయి.అసోంలో అధికారం మళ్లీ బిజెపికే లభించవచ్చునీ, తమిళనాట స్టాలిన్ వరుసగా రెండోసారి అధికారంలోకి రావచ్చునీ సర్వేలు పేర్కొంటున్నాయి. అయితే కేరళలో అధికారం ఎల్డీఎఫ్ నుంచి యుడిఎఫ్‌కు మారే సూచనలున్నాయి. పుదుచ్చేరిలోను బిజెపి కూటమికే అధికారం లభించవచ్చని అంచనా. అంటే తమిళనాడు అసోంలో అధికార పార్టీల స్థానం పదిలంకాగా, బెంగాల్, కేరళలో విపక్షాలు విజయం సాధించగలవని తెలుస్తోంది. పుదుచ్చేరిలో తిరిగి ఎన్డీయే కూటమికే అధికారం లభిస్తుందని మెజారిటీ సర్వేలు సూచిస్తున్నాయి. బెంగాల్‌కు సంబంధించి ఐదు ప్రధాన సర్వే సంస్థలు బిజెపి వైపు మొగ్గుచూపుతూ 145175 సీట్లు రావచ్చని జోస్యం చెబుతుండడంతో ఆ పార్టీ నాయకులు ముందస్తు సంబరాలు కూడా జరుపుకొంటున్నారు. రెండుసంస్థలు మాత్రమే మమత నాయకత్వంలోని టిఎంసి పట్ల మొగ్గు చూపాయి. తమిళ నాడుకు సంబంధించి అన్ని ప్రధాన సంస్థలు డిఎంకె వైపే మొగ్గు చూపడం గమనించవలసిన మరో అంశం. రెండోస్థానంలో అన్నాడిఎంకె కూటమి, మూడోస్థానంలో విజయ్ నాయకత్వంలోని టివికె రావచ్చని అంచనా వేస్తున్నాయి. హంగ్ ఏర్పడవచ్చునీ, ఆ పరిస్థితిలో విజయ్ పార్టీ కీలకపాత్ర పోషించవచ్చునీ అంటున్నాయి. యాక్సిస్ మై ఇండియా అనే సంస్థ విజయ్ పార్టీకి 98120 సీట్లు అంచనా వేయడంతో ఆయన అభిమానులు కూడా ముందస్తు సంబురాలు జరుపుకొంటున్నారు. బెంగాల్‌కు సంబంధించి 4వ తేదీన ఫలితాలు వెలువడగానే అందరికీ తాము స్వీట్లు పంచుతామని ప్రధాని మోడీ స్వయంగా ప్రకటించడంతో, సర్వే సంస్థల అంచనాలు కూడా దానికి దగ్గరగా ఉండడంతో బెంగాల్‌లో లెక్కలు మారవచ్చనే పరిశీలకులు భావిస్తున్నారు. కేరళలో సిఎం పినరై విజయన్ కూడా ఇదే తరహా ఆశాభావంతో ఉన్నా, సర్వే సంస్థలు యుడిఎఫ్‌కు అనుకూలం గా అంచనాలను ప్రకటించాయి. కేరళలో అధికారం యుడిఎఫ్‌కు లభిస్తే కాంగ్రెస్‌కు కొంత ఊరట లభించినట్లవుతుంది. ఏది ఏమైనా తీవ్రస్థాయికి చేరిన ఉత్కంఠకు మరికొన్ని గంటల్లోనే తెర పడబోతోంది.

# నోబెల్ 'శాంతి'కి గృహనిర్బంధం!

మయన్మార్

గన్ని మోహన్

ప్రజాస్వామిక ప్రపంచంలో ఆమె ఒక హక్కుల నేత. తమ దేశ ప్రజలు అణిచివేతకు గురికాకూడదన్న తపన ఆమెలో నరనరానా పేరుకుని ఉండేది. సైనిక ప్రభుత్వం ఎన్నోసార్లు అణిచివేతకు గురిచేయాలని ఉక్కుపాదం వేయాలని విశ్వప్రయత్నాలు చేసినా ఆమె శాంతియుత దీక్ష ఆపలేదు. ఫలితంగా ఆమె గృహనిర్బంధంలో కూడా ఉన్నారు. ఆమె మరెవ్వరోకాదు ఒకప్పటి బర్మా నేటి మైన్మార్ దేశంలోని హక్కులనేత ఆంగ్‌సాంగ్ సూక్యీ. 33 ఏళ్ల జైలు శిక్షను పలుదఫాలుగా తగ్గిస్తూ చివరకు ఆమెను గృహనిర్బంధంలో ఉంచాలని సైనిక ప్రభుత్వం నిర్ణయించింది. అయినా కూడా ఆమె బతికి ఉన్నారోలేదోనన్న అనుమానం స్వయంగా ఆయన కుటుంబమే వ్యక్తంచేస్తున్నారు. ఆమెను చివరిసారిగాచూసింది 2021లోనేనని ఇప్పటికీ ఆమె బతికి ఉన్నట్లు ప్రభుత్వం స్వయంగా చూపించాల్సిన అవసరం ఉందని, అప్పటినుంచి నేటివరకూ తమను తమ తల్లిని కలిసేందుకు కూడా మైన్మార్ జుంటా అనుమతించలేదంటూ ఆమె కుమారుడు కిమ్ ఆరిస్ చెప్పుకొచ్చారు. ప్రస్తుతం 80వ పడిలో ఉన్న ఆమె ఎదుట ఇద్దరు మిలిటరీ దుస్తుల్లో కూర్చుని ఉన్నఫోటోను మాత్రమే సర్కారు విడుదల చేసింది. అయితే ప్రపంచ వ్యాప్తంగా తనపై వస్తున్న ఒత్తిళ్లను తగ్గించుకునే యోచనతోనే మిన్ ఆంగ్ హ్లైయింగ్ ఆంగ్‌సాంగ్ సూకీని 33 ఏళ్ల జైలుశిక్షను కుదించి గృహనిర్బంధానికి మార్చినట్లు తెలుస్తోంది. అయితే ఆమెను నిజంగా గృహ నిర్బంధానికి తరలించారా లేదా అన్నది ఇప్పటికీ నిర్ధారణ కాలేదు. సరికదా ఆమె న్యాయవాదులకు కూడా సమాచారం లేదు. 2021లో వివిధ ఆరోపణలపై ఆమెను అదుపులోకి తీసుకున్న సైనిక ప్రభుత్వం ఆమెను అధికార దుర్వినియోగం, దేశద్రోహం వంటి అభియోగాలపై జైలుపాలు చేసింది. అప్పటి నుంచి ఆమె బాహ్య ప్రపంచానికి కనిపించిన సందర్భాలు లేవు. గతంలో 2021మే 24వ తేదీ మాత్రం ఆమెను కోర్టులో ఉన్నట్లుగా ఉన్న ఒక ఫోటో మాత్రం ప్రపంచానికి విడుదల చేసారు. ఇందులో భాగంగానే ఈ ఏడాది 1519 మంది క్షమాభిక్షను ప్రసాదించడం మైన్మార్‌లో పరిపాటిగా వస్తోంది. ఇపుడు సూక్యీకి ప్రసాదించడంలో ప్రత్యేకత ఏమీ లేదు. సుదీర్ఘ కాలంగా శిక్ష అమలులో ఉన్నందున ఆమెకు సైతం ఇతర తోటి ఖైదీల తరహాలోనే శిక్షను తగ్గించినట్లు తెలుస్తోంది. అంతకు రెండువారాల ముందే సూక్యీ ప్రభుత్వంలో అధ్యక్షుడుగా పని చేసిన విన్ మ్యింట్‌కు క్షమాభిక్ష ప్రసాదించి ఆయనను విడుదల చేసారు. మిలిటరీ గ్రిప్‌లో ఉన్నమైన్మార్‌లో గతనెల 10వ తేదీ జరిగిన ఎన్నికల్లో తిరిగి మిన్ ఆంగ్ హ్లైయింగ్ అధ్యక్షునిగా ఎన్నికయి పాలన బాధ్యతలు స్వీకరించారు. పూర్తి నిర్బంధం మధ్య జరిగిన ఈ ఎన్నికల విజయాన్ని అంతర్జాతీయ సమాజం గుర్తించకపోయినా హ్లైయింగ్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. సామాజిక సమతుల్యత



ఆంగ్‌సాంగ్‌సూక్యీ

కోసం తమ ప్రభుత్వం రాజకీయ ఖైదీలకు క్షమాభిక్షలు ప్రవేశపెడుతుందని న్యాయం, శాంతి కార్యాచరణలు అమలుకు వస్తాయని అన్నారు. అందులో భాగంగానే సూక్యీ జైలుశిక్షను కాస్తా గృహనిర్బంధానికి మార్చినట్లు తెలుస్తోంది. మైన్మార్ రాజధానిలో ఉన్న కేంద్ర కారాగారం నాయ్‌పైథా నగరంలోని జైలు నుంచి ఆమెను గృహనిర్బంధానికి తరలించినట్లుగా చెపుతున్నారే కానీ ఎక్కడా ఆమె బయటకు కనిపించిన దాఖలాలులేవు. 2022లో అనేక నేరాలు ఆమెపై నమోదుచేసిన తర్వాత ఆమెను 33 ఏళ్లపాటు జైలు శిక్ష విధిస్తూ మిలిటరీ ప్రభుత్వం నిర్ణయించింది. ఆమెను ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన పదవుల నుంచి తొలగించి మొత్తం ప్రభుత్వాన్నే మిన్ ఆంగ్ హ్లైయింగ్ తిరుగుబాటుతో స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం ఆమెకిచ్చిన మినహాయింపుతో ఆమె జైలుశిక్ష గణనీయంగా తగ్గింది. మరో 13 ఏళ్లపాటు ఆమె శిక్షాకాలం గృహ నిర్బంధంలోనే కొనసాగుతుంది. అయితే ప్రభుత్వ పరంగా ప్రకటన వచ్చినా ఆమె ఎక్కడా బయటకు కనిపించలేదు. సైనిక ప్రభుత్వం అనుమతించలేదు. ఆమె ఆరోగ్యం క్షీణించిందని, లోబీపీ, మందకొడతనం, గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్న సూక్యీకి సరైన వైద్యం కూడా అందడం లేదని ఆమె తరపు న్యాయవాదులతోపాటు, ఆమె కుటుంబసభ్యులు స్వయంగా ఆమె తనయుడు సైతం ఆరోపించారు. ప్రస్తుతం లండన్‌లో ఉంటున్న ఆమె చిన్న కుమారుడు కిమ్ ఆరిస్ సైతం ఇదే అభిప్రాయం వ్యక్తం చేసారు. తమను ఇప్పటి వరకూ కలుసు కోనీయని సైనిక ప్రభుత్వం ఆమెకు సరైన వైద్యసాయం అందించడంలేదన్నది వాస్తవమే. జైలులో ఉన్న పరిస్థితులను బట్టి చూస్తుంటే ఆమె ఆరోగ్యం పూర్తిగా క్షీణించిందనే ఆందోళన అటు మైన్మార్ ప్రజల్లోను, ప్రజాస్వామ్యవాదుల్లోను వ్యక్తం అయింది. సాక్షాత్తూ ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గ్యుటరెస్ సైతం సూక్యీ ఆరోగ్యంపట్ల ఆందోళన వ్యక్తం చేసారు. సైనిక ప్రభుత్వం పగ్గాలు చేపట్టినప్పటి నుంచి న్యాయసాయం, కుటుంబ సభ్యులు కూడా కలుసుకోకుండా కఠిన ఆంక్షలు అమలు చేసారు. మైన్మార్ స్వాతంత్ర్యం కోసం పోరాడిన హీరో జనరల్ ఆంగ్‌సాన్ కుమార్తె అయిన సూక్యీ 1989 నుంచి 2010 వరకూ కూడా గృహనిర్బంధంలో కొనసాగారు. అహింసా మార్గంలో ఆందోళన నిర్వహించిన ఆమె చేసిన కృషికిగాను 1991లో ఆమెకు నోబెల్ పురస్కారం కూడా వరించింది. ఈ దశలో సూక్యీ జైలు శిక్షను గృహనిర్బంధానికి మార్పు చేయటాన్ని ఇప్పుడు ఆమె కుటుంబ సభ్యులు కూడా నమ్మలేకపోతున్నారు. ఎందుకంటే 2021నుంచి ఇప్పటివరకూ ఆమె బాహ్య ప్రపంచానికి కనిపించకుండా సైనిక సర్కారు చర్యలు తీసుకోవడమే. ఇప్పుడు ఆమె బతికి ఉన్నారని నిరూపించడానికి ఆమెను బాహ్య ప్రపంచానికి చూపించాల్సిన బాధ్యత కూడా మిన్ ఆంగ్ హ్లైయింగ్ సర్కారుపైనే ఉంది.

# కూలుతున్న భారతీయ అమెరికన్ల కలల సౌధం

డా. కావలి చెన్నయ్య

కష్టాల కన్నీళ్లను వేటితో కొలుస్తారో తెలియదు కానీ కొలమానముంటే అందరికంటే ఎక్కువ కష్టాల కన్నీళ్లు అమెరికాలోని భారతీయులకే. భారతీయుల అమెరికా ప్రయాణాన్ని పరిశీలించినట్లయితే,1635లో మన దేశం నుండి జేమ్స్ టౌన్, వర్జినియా, అమెరికాకు మొదట వలస పోయిన వ్యక్తి 'టామ్' (హెడ్ రైట్) అని నమోదు చేయబడింది. 1680లో భారత సంతతి వ్యక్తి పీటర్, ఐరిష్ మహిళలకు జన్మించిన మేరీ ఫిషర్ స్థిరనివాసం పొందినట్లు తెలుస్తుంది. 1790లో మద్రాస్‌కు చెందిన థామస్ మసాచూసెట్స్‌ను దర్శించాడాట.1910లో బొంబాయికి చెందిన బికాజి ఫ్రామ్జి బల్సారా అనే పార్శి తొలి సహజ పౌరసత్వం పొందిన భారతీయుడు. 17 ,18వ శతాబ్దాలలో చాలా మంది భారతీయులు నావికులుగా, బ్రిటిష్ అధికారులకి సేవకులుగా పనిచేసినప్పటికీ అధికారికంగా నమోదు చేయబడలేదు. మన దేశస్తులు ముఖ్యంగా వ్యక్తిగత స్వేచ్ఛ, అవినీతి రహిత సమాజం, మెరుగైన ఆర్థిక అవకాశాలు, ఉత్తమమైన జీవన ప్రమాణాలు, అధిక జీతాలు, ఉన్నత విద్య, టెక్నాలజీ,పరిశోధనలకు సంబంధించిన ఉన్నతమైన ప్రమాణాలు ఉన్న అమెరికా సంస్థలలో పని చేయడానికి వలస వెళుతున్నారు. అమెరికన్ డ్రీమ్, వృత్తిపరమైన నైపుణ్యాభివృద్ధి సాధించాలనే తపనతో, భారత్ లో ఉన్న విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాలలో ఉన్న అధిక పోటీ నుండి తప్పించుకొని, ఉత్తమ నైపుణ్యం కలిగిన ఐటీ, ఆరోగ్య సంరక్షణ, కార్మిక నిపుణులు విజయవంతమైన భవిష్యత్తును నిర్మించుకునేందుకు హెచ్1బి వీసాలను పయోగించుకొంటున్నారు. చదువు విషయానికొచ్చినప్పుడు భారతీయ విద్యార్థులు అమెరికా అగ్రశ్రేణి విశ్వవిద్యాలయంలో చదవాలని కోరికతో ఖర్చుకు వెనుదీయకుండా అష్ట కష్టాలు పడైనా సరే అమెరికా వెళ్లాలని ప్రయత్నాలు చేస్తూ కొందరు సఫలమైతే కొందరు విఫలమవుతున్నారు.అమెరికా వెళ్లి స్థిరపడిన భారతీయులు మన దేశంలోని వారి వారి కుటుంబాలకు చేయూతనిస్తూ, అమెరికా వెళ్లడానికి ప్రయత్నిస్తున్న మనవారికి సహాయ సహకారాలు అందిస్తున్నారు. కష్ట నష్టాలను భరించి అమెరికా వెళ్లి అక్కడి స్థానికులచే అవమానానికి గురైనప్పటికీ కష్టపడి కర్తవ్యపతంగా పనిచేస్తూ సముచిత స్థానాన్ని సంపాదించుకుంటు అమెరికాలో పారిశ్రామికవేత్తలుగా, వ్యవస్థాపకులుగా అత్యంత విజయవంతమైన వలస సమూహాలలో ముఖ్యమైనదిగా ఉంటూ ప్రధానంగా టెక్నాలజీ ఫైనాన్స్,తయారీ రంగాలకు నాయకత్వం వహిస్తున్నారు. 16 ఫార్చ్యున్500 కంపెనీలకు భారతీయ సీఈఓలు నాయకత్వం వహిస్తున్నారు. 72 యూనికార్న్ కంపెనీలకు భారతీయులు నేతృత్వం వహిస్తున్నారు. భారతీయ సంతతి కుటుంబాల సగటు ఆదాయం అత్యధికం 119000 అమెరికా డాలర్లు. రతన్ టాటా సహాయ సహకారాలతో శ్రీకాంత్ బోల్ల స్థాపించిన 'బోలాంట్ ఇండస్ట్రీ' పర్యావరణ అనుకూల ఉత్పత్తులను తయారుచేస్తుంది. షలబ్ కుమార్ వంటి వారు రాజకీయ, వ్యాపారాల రెండింటిలో ప్రావీణ్యమున్నది. 2026 నాటికి అమెరికాలో 54 లక్షల (అమెరికాలో జన్మించిన వలస వచ్చిన)కు పైగా భారత సంతతి ప్రజలు నివసిస్తున్నారు. ఇందులో భారతీయ సంతతి వలసదారులు 32 లక్షలకు పైగా,అమెరికా జనాభాలో 1.5 శాతం.సంఖ్యా, ఆర్థిక పరంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆసియా సమూహాలలో మనమొకరం. కాలిఫోర్నియా, టెక్సాస్, న్యూ జెర్సీ, న్యూయార్క్‌లలో భారత సంతతి ప్రజలెక్కువ. అమెరికాలో 10 శాతం భారతీయ వైద్యులే పనిచేస్తున్నారు. భారత సంతతికి చెందిన 11 శాతంయూనికార్న్ కంపెనీలకు భారతీ సంతతివారే వ్యవస్థాపకులు. అమెరికాలో మన వాళ్లు ఎంతగా రాణించినప్పటికీ వారు ఎన్నెన్నో సవాల్లెదుర్కొంటున్నారు. కార్నెగి నిర్వహించిన సర్వేలో అమెరికా వదలాలని అక్కడి భారత సంతతిలోని 40శాతం మంది కోరుకుంటున్నట్లు వెల్లడించింది. ఒకప్పుడు అమెరికాలో ఉద్యోగం సంపాదించడం, స్థిర నివాసం ఏర్పరచుకోవడం



భారతీయుల కల. కానీ ప్రస్తుతం ఆ కల నెమ్మదిగా చెదిరిపోతుంది. అగ్రరాజ్యంలో ఇక ఉండలేమని భారతీయ సంతతి వారి మనోవేదన, అక్కడి పరిస్థితులతో రోజురోజుకు వారిలో ఆందోళన, భయం పెరిగి, మేము తిరిగి భారత్‌కు వెళ్ళిపోవాలనుకుంటున్నారు. అక్కడి రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితులే దీనికి కారణమని భావిస్తున్నారు. యుగవ్, కార్నెగి ఎండోమెంట్స్ సంస్థ 1000 మంది భారతీయులను సర్వేచేసి అభిప్రాయం సేకరించగా40శాతం భారతీయ అమెరికన్లు మళ్లీ మేము భారత్ వెళ్లిపోతామని వెల్లడించగా,14 శాతం మంది వెళ్లిపోవాలని తరచుగా ఆలోచిస్తున్నామని, 28 శాతం మంది అప్పుడప్పుడు అలా అనిపిస్తుందని చెప్పారు. ప్రస్తుతం అమెరికాలో జరుగుతున్న రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వ విధానాలపై 58 శాతం మంది తీవ్ర అసంతృప్తి వెలబుచ్చారు. పెరిగిన జీవన వ్యయాన్ని భరించలేకపోతున్నామని 54 శాతంమంది వెల్లడించారు. రోజురోజుకు వ్యక్తిగత భద్రత కష్టంగాఉందని 41శాతం మంది చెప్పారు. మొదటిసారి ట్రంప్ అధ్యక్షుడైనప్పుడు భారత పక్షపాతిగా భావించారు కానీ 2వసారి అధ్యక్షుడయ్యాక ఆర్థిక వ్యవస్థ నిర్వహణ, వలస విధానాలు, అంతర్జాతీయ సంబంధాల్లో ప్రభుత్వ నిర్ణయాలు తమకు నచ్చడం లేదని 71 శాతం మంది ప్రకటించారు. ట్రంప్ జాత్యహంకార మాటలు మాట్లాడుతూ, అమెరికన్స్ ఫస్ట్ అంటు, మేక్ అమెరికా గ్రేట్ అగైన్( అమెరికాను మళ్ళీ గొప్పగా చేయండి) అని రకరకాలుగా ప్రకటనలు చేస్తూ అమెరికన్లనే కాకుండా అమెరికాలో స్థిరపడిన, పనిచేస్తున్న, చదువుకుంటున్న విదేశీయులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాడు. ట్రంపుకు అమెరికా ప్రజల్లో 38శాతంగా ఉన్న ఆదరణ 30కి పడిపోయిందని విశ్లేషకులు చెప్పగా, రాయిటర్స్ ఇప్సోస్35 , ఏపీఎన్‌ఓఆర్సి సెంటర్ ఫర్ పబ్లిక్ అఫైర్స్ రీసెర్చ్35 , స్ట్రెంత్ ఇన్ నంబర్స్ వెరా సైట్33 వరకు క్రమంగా ప్రజల మద్దతు తగ్గిపోయిందని ఈ సంస్థలు విడివిడిగా నిర్వహించిన సర్వేలలో తెలిపాయి.ఇరాన్‌తో యుద్ధం, పడిపోతున్న ఆర్థిక వ్యవస్థల నిర్వహణ, వలసలు వంటి విషయాలలో ట్రంప్‌తీసుకుంటున్న నిర్ణయాలకుప్రజామోదము లేదని పైన పేర్కొన్న 3సంస్థలు తెలిపాయి. ముఖ్యంగా ఆర్థిక విషయాలలో అమెరికన్లకు అసంతృప్తి అధికంగా ఉన్నట్లున్నది. అమెరికా ఆర్థిక వ్యవస్థ దారుణంగా ఉందని ఈ వారం ప్రారంభంలో తాను నిర్వహించిన సర్వేలో పాల్గొన్న 70 శాతం మంది ప్రజలు తెలిపినట్లు ఏపీ ఎన్నోఆర్ సి సంస్థ వెల్లడించింది. దేశం సరైన పంథాలో సాగడం లేదని 72 శాతంమంది అభిప్రాయపడినట్లు తెలియజేసింది. ఆర్థిక వ్యవహారాల నిర్వహణలో మార్చి నెలలో ట్రంప్ కున్న ప్రజాదరణ 38శాతం కానీ ఏప్రిల్ వచ్చేసరికి అది కాస్త 30శాతంపడిపోయింది. జీవనవ్యయం విషయంలో కేవలం 23శాతం మంది మాత్రమే ట్రంప్‌కు అనుకూలం, 76 శాతం మంది ట్రంప్ విధానాలను వ్యతిరేకిస్తున్నారు. వీటికి తోడు ఈ మధ్యనే జార్జియా, ఫ్లోరిడా రాష్ట్రాలలో కార్చిచ్చు కమ్మేసింది. భారత్ నుండి అమెరికా వెల్లే వారిని అన్ని మాఫియా గ్యాంగ్‌స్టర్ల కంటే ఎక్కువ నష్టంచేసి, మనల్ని ద్వితీయ శ్రేణిపౌరులుగా చేసి దోచుకొని అమెరికాకు నష్టం కలిగిస్తున్న 'గ్యాంగ్ స్టర్స్ విత్ లాప్టాప్' అని, మైకేల్ శావేజ్ అనే రాజకీయ విశ్లేషకుడు చేసిన పాడ్ కాస్ట్‌ను ట్రంప్ సొంత సామాజిక మాధ్యమమైన ట్రూత్ సోషల్‌లో రీపోస్ట్ చేశాడు. దాదాపు 10నిమిషాల నిడివిగల వీడియోలో జాత్యహంకారపూరిత వ్యాఖ్యలు చేశాడు. మన జెండాను కాలరాశారు. చైనా/ఇండియా నుండి తమ పిల్లలు అమెరికాలో పుట్టేలా 9నెలల గర్భంతో ఉన్న వారిని క్కడికి తీసుకొస్తున్నారు. ఫలితంగా ఇక్కడ పుట్టి అమెరికా జాతీయ పౌరులైపోతున్నారు.ఇక్కడ పుట్టిన బేబీకి చట్టబద్ధంగాపొందే పౌరసత్వాన్ని ఆధారంగా చేసుకుని తమ మొత్తం కుటుంబాన్ని భారత్/చైనా నుండో,భూగోళంపైనున్న మరోనరకప్రాయ దేశం నుండి ఇక్కడికి తెస్తారు. అందుకే 'అమెరికా బర్త్ రైట్ సిటిజన్షిప్' (జన్మతః పౌరసత్వచట్టం)లో మార్పు చేయాలని, ఈ అంశాన్ని కోర్టుకు వదిలేయకుండా జాతీయ స్థాయిలో రెఫరండం(ప్రజాభిప్రాయ సేకరణ) చేయాలని, ఇంటర్నెట్ టీవీ మొబైల్ ఫోన్ విమానాలు లేనప్పుడు ఆ పరిస్థితులకనుగుణంగా రాసిన అమెరికా రాజ్యాంగాన్ని సవరించాలని పేర్కొన్నాడు.ఎంతో కష్టపడి ఎన్నోకలలతో అమెరికా వెళ్ళిన భారతీయుల మేధావుల విజ్ఞానాన్ని మన దేశాభివృద్ధికి ఉపయోగించుకునేటట్లు అవకాశాలు కల్పించాలి.

3-5Pg5.qxd:3-5Pg5.qxd 1/1/02 7:47 AM Page 1



# ఇరాన్ అణ్వాస్త్ర తయారీని ఆపాం

## యుద్ధం చేయకపోతే ఇజ్రాయెల్, ఐరోపా దేశాలు పేలిపోయేవి

### సైనిక చర్యతో ఇరాన్ నాశనమైంది: ట్రంప్



**ఫ్లోరిడా, మే 2:** యుద్ధం తర్వాత ఇరాన్ నాయకత్వం బలహీనపడిందని, ఆ దేశ సైనిక సామర్థ్యం గణనీయంగా క్షీణించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఫ్లోరిడాలో ఆయన మాట్లాడుతూ, ఇరాన్‌పై దాడి చేసి ఆ దేశం అణ్వాయుధాలను తయారు చేయకుండా అడ్డుకున్నామని తెలిపారు. ఒకవేళ తాను అలా చేయకపోయి ఉంటే పశ్చిమాసియా, యూరప్ దేశాలు ముక్కలైపోయేవని అన్నారు. ఇరాన్ అనే అందమైన దేశంలోకి వెళ్లి వారి వద్ద అణ్వాయు ధాలు లేవని మనం నిర్ధారించుకోవాలని వ్యాఖ్యా నించారు. బీ2 బాంబర్లతో వారిని అడ్డుకున్నట్లు చెప్పారు. అమెరికా అలా చేయకపోయి ఉంటే వారి వద్ద అణ్వాయుధాలు ఉండేవని, అప్పుడు ఇజ్రాయెల్, పశ్చిమాసియాతో సహా యూరప్ దేశాలు ముక్కలుగా పేలిపోయి ఉండేవని వ్యాఖ్యానించారు. తమ సైనిక చర్యతో ఇరాన్ నాశనమైందని అన్నారు. వారి వైమానిక, నౌకాదళాలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయని అన్నారు.

శాంతిచర్చలు తాను ఆశించినవిధంగా జరగడం లేదని అన్నారు. యుద్ధం కారణంగా చమురు ధరలు పెరిగాయని, యుద్ధం ఆగిపోతే తగ్గుతాయని పేర్కొన్నారు. ఇరాన్ తమతో ఒప్పందం చేసుకోవాలనుకుంటోందని అయితే వారి ప్రతిపాదన సంతృప్తికరంగా లేదని అన్నారు. ఇరాన్‌లో నాయకత్వం విచ్ఛిన్నం అయిందని, అక్కడ నాలుగైదు గ్రూపులు ఉన్నాయని, అందుకే ఒప్పందం విషయంలో గందరగోళం నెలకొందని అన్నారు.

ఇరాన్ అనే అందమైన దేశంలోకి వెళ్లి వారి వద్ద అణ్వాయుధాలు లేదని మనం నిర్ధారించుకోవాలని ట్రంప్ చెప్పారు. బీ2 బాంబర్లతో వారిని అడ్డుకున్నామని, ఒకవేళ తాము అలా చేయకపోయిఉంటే వారి వద్ద అణ్వాయుధం ఉండేదని, ఇజ్రాయెల్, పశ్చిమాసియాతో సహా ఐరోపా దేశాలు ముక్కలు ముక్కలుగా పేలిపోయి ఉండేవని అన్నారు. ఇరాన్ నాయకత్వం బలహీనపడిందని, ఆ దేశ సైనిక సామర్థ్యం గణనీయంగా క్షీణించిందని తెలిపారు. తమ సైనిక చర్యతో ఇరాన్ నాశనమైందని, వారి వైమానిక, నౌకాదళాలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయని చెప్పారు. శాంతిచర్చలు తాను ఆశించినవిధంగా జరగక పోవడంపై ట్రంప్ అసహనం వ్యక్తంచేశారు. యుద్ధం కారణంగా అంతర్జాతీయంగా నెలకొన్న ఇంధన సంక్షోభంపై మాట్లాడారు. పెట్రోల్ ధరలు ఎక్కువగా ఉన్నాయని, యుద్ధం ముగిసిన వెంటనే పెట్రోల్ ధరలు తగ్గుతాయని అన్నారు. ఇరాన్ తమతో ఒప్పందం చేసుకోవాలను కుంటున్నా కానీ వారి ప్రతిపాదన సంతృప్తిగా లేదని చెప్పారు. హార్మూజ్ జలసంధి లో ఇరాన్ ఓడరేవులపై అమెరికా దిగ్బంధనం కొనసాగు తోంది. ఆ దేశానికి చెందిన నౌకలను యూఎస్ దళాలు స్వాధీనం చేసుకున్నాయని అన్నారు. ఇరాన్‌పై దిగ్బంధనాన్ని అమలు చేయడంలో యూఎస్ నౌకాదళాలు సముద్రపు దొంగల్లా పని చేస్తాయని అన్నారు. ఇరాన్‌పై కొనసాగుతున్న దిగ్బంధనం అమెరికాకు మంచి వ్యాపారమని ట్రంప్ అన్నారు. తాము నౌకలను సీజ్ చేశామని, సరకు, చమురును స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఇది అత్యంత లాభదాయకమైన వ్యాపారమని, తాము పైరేట్స్ లాంటి వాళ్లమని వ్యాఖ్యా నించారు. తాము ఇరాన్‌తో ఆటలు ఆడటం లేదని, ఈ విషయంలో చాలా సీరియస్‌గా ఉన్నామని అన్నారు. అమెరికా దిగ్బంధనంవల్ల ఇరాన్‌కు దాదాపు 4.8 బిలియన్ డాలర్ల (భారత కరెన్సీలో రూ.45 వేల కోట్లకుపైగా) నష్టం వాటిల్లినట్లు పెంటగాన్ అంచనావేసిందన్నారు. దిగ్బంధనం అమల్లోకి వచ్చినప్పటి నుంచి చమురుతో సహా ఇతర నిషేధిత సరకులను రవాణా చేసేందుకు ప్రయత్నించిన 40 కిపైగా నౌకలను యూఎస్ దళాలు దారి మళ్లించా యన్నారు. దాంతో సుమారు 53 మిలియన్ బ్యారెళ్ల ఇరాన్ ముడి చమురు తీసుకెళ్తున్న 31 ట్యాంకర్లు గల్ఫ్‌లోనే నిలిచిపోయాయని పేర్కొన్నది.

# మమతకు బిగ్ షాక్

## ఇసి సర్క్యులర్‌కు సుప్రీం కోర్టు గ్రీన్ సిగ్నల్



**న్యూఢిల్లీ, మే 2:** పశ్చిమ బెంగాల్‌లో ఓట్ల లెక్కింపు ప్రక్రియపై తలెత్తిన వివాదంలో టిఎంసి అధినేత్రి, ముఖ్య మంత్రి మమతా బెనర్జీకి సుప్రీం కోర్టులో ఎదురు దెబ్బ తగిలింది. ఓట్ల లెక్కింపునకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల (పిఎస్‌యు) ఉద్యోగులను మాత్రమే నియమిస్తూ ఎన్నికల సంఘం జారీచేసిన సర్క్యులర్ నిబంధ నలకు విరుద్ధం కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

లెక్కింపు సిబ్బందిని ఒకే వర్గం, అంటే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల నుంచే ఎంపిక చేసే స్వేచ్ఛ ఎన్నికల సంఘానికి ఉందని న్యాయస్థానం పేర్కొంది. అందువల్ల ఆ సర్క్యులర్‌ను తప్పు అని చెప్పలేమని తేల్చిచెప్పింది. అదే సమయంలో, ఏప్రిల్ 13న జారీ చేసిన సర్క్యులర్‌నే అమల్లో ఉంచాలని సుప్రీంకోర్టు వెల్లడించింది. ఓట్ల లెక్కింపు సమయంలో అక్కడ తృణమూల్ కాంగ్రెస్ ప్రతినిధులు కూడా ఉంటారని తెలిపింది. ఈ నేపథ్యంలో టిఎంసి దాఖలు చేసిన పిటిషన్‌పై ఇకపై అదనపు ఆదేశాలు అవసరం లేదని కోర్టు పేర్కొంది. ఓట్ల లెక్కింపులో కేవలం కేంద్ర ప్రభుత్వ సిబ్బందినే నియమించాలని ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ మమతా బెనర్జీ సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ తీర్పును ప్రతిపక్ష బిజెపి, అధికార టిఎంసి స్వాగతించింది. అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రతి అంశాన్ని రాజకీయం చేస్తూ, న్యాయస్థానాలకెక్కడం తృణమూల్ కాంగ్రెస్‌కు, ఆ పార్టీ అధినేత్రి మమతకు నిత్యకృత్యమైందని బిజెపి పశ్చిమబెంగాల్ అధ్యక్షుడు సమిక్ భట్టాచార్య దుయ్యబట్టారు. ప్రజాస్వామ్యంలో వ్యవస్థలపై నమ్మకం చాలా ముఖ్యమని అభిప్రాయపడ్డారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తారు తీర్పును భట్టాచార్య స్వాగతించారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను తృణమూల్ కాంగ్రెస్ స్వాగతిస్తూ, కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు ఎదురుదెబ్బ అని ఒక ప్రకటనలో పేర్కొంది. తమ వాదనను సుప్రీంకోర్టు సమర్థించిందని తెలిపింది.

# హత్యకేసు ఎమ్మెల్యేపై అనర్హత వేటు!




**బెంగళూరు, మే 2:** హత్య కేసులో దోషిగా నిర్ధారణ అయిన కాంగ్రెస్ ఎమ్మెల్యే వినయ్ కులకర్ణికి ఇటీవల బెంగళూరులోని ప్రజా ప్రతినిధుల కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. దాంతో కర్ణాటక అసెంబ్లీ సెక్రెటరీ వినయ్ కులకర్ణిపై అనర్హత వేటువేశారు. క్రిమినల్ కేసులో శిక్షపడినందుకు వినయ్ కులకర్ణి శాసన సభ సభ్యత్వాన్ని రద్దు చేస్తున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. శిక్ష ఖరారైన ఏప్రిల్ 15 నుంచి ఆరేళ్లపాటు ఆయనపై అనర్హత వేటు అమల్లో ఉంటుందని తెలిపారు. ఒకవేళ పైకోర్టు శిక్షపై స్టే విధించినా, లేదంటే శిక్షను రద్దుచేసినా అతనిపై ఆరేళ్ల తర్వాత నిషేధం తొలగిపోతుందని అసెంబ్లీ సెక్రెటరీ తన ప్రకటనలో స్పష్టంచేశారు. లేదంటే శిక్షాకాలం పూర్తయ్యేవరకు, ఆపైన ఆరేళ్లపాటు ఆయనపై అనర్హత వేటు కొనసాగుతుందని పేర్కొన్నారు. అంటే ఆయన శిక్ష పూర్తిచేసుకుని జైలు నుంచి విడుదలైన తర్వాత కూడా ఆరేళ్లపాటు ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి అనర్హుడని కోర్టు స్పష్టం చేసింది. ధార్వాడ్ అసెంబ్లీ నియోజక వర్గం నుంచి కర్ణాటక అసెంబ్లీ ప్రాతినిధ్యం వహిస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే వినయ్ కులకర్ణికి బీజేపీ నేత యోగేష్ గౌడ హత్య కేసులో యావజ్జీవ కారాగార శిక్షపడింది. యోగేష్ గౌడ 2016లో హత్యకు గురయ్యారు. ఈ హత్య కేసులో దోషులుగా తేలిన అందరికీ బెంగళూరు లోని ప్రజాప్రతినిధుల కోర్టు ఏప్రిల్ 15న శిక్షలు ఖరారు చేసింది. వినయ్ కులకర్ణికి యావజ్జీవ కారాగార శిక్ష విధించింది.

# కులం పేరుతో విభజన వద్దు

## కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సంచలన వ్యాఖ్యలు

**నాగ్‌పూర్, మే 2:** "ఎవరు కులం గురించి మాట్లాడినా తన్నులు పడతాయని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఘాటుగా స్పందించారు. నాగ్‌పూర్‌లో నిర్వహించిన అంతర్జాతీయ కార్మిక దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న గడ్కరీ, మరోసారి తనదైన శైలిలో కుల రాజకీయాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. సమాజాన్ని కుల, మతాల పేరుతో విభజించే నాయకులకు హెచ్చరిక జారీ చేస్తూ, ఇలాంటి వ్యాఖ్యలను సహించమని స్పష్టం చేశారు. అభివృద్ధికి కులమతాల అడ్డుగోడలు ఉండవని గడ్కరీ పేర్కొన్నారు. ప్రభుత్వం అందించే గ్యాస్, పెట్రోల్, డీజిల్ వంటి సౌకర్యాలు హిందువులకు ఏ ధరకు అందుతాయో, ముస్లిములకూ అదే ధరకు అందుతాయని గుర్తుచేశారు.



అభివృద్ధి ఫలాలు అందరికీ సమానంగా లభిస్తున్న వేళ కుల రాజకీయాలకు స్థానం లేదని తేల్చిచెప్పారు. ఈ సందర్భంగా రాజకీయాల్లో కనిపిస్తున్న ద్వంద్వ వైఖరిని కూడా ఆయన ఎండగట్టారు. బహిరంగ వేదికలపై కులాల గురించి మాట్లాడే కొందరు నేతలు, వ్యక్తిగతంగా తనను కలిసినప్పుడు మాత్రం తమ కుటుంబ సభ్యులకు టిక్కెట్లు ఇప్పించమని అడుగుతారని విమర్శించారు. ఇలాంటి ద్వంద్వ ప్రవర్తన గల నాయకులను ప్రజలు ఇప్పటికే గుర్తించారని వ్యాఖ్యానించారు. తాను ఎప్పుడూ నిజాయితీగా, నేరుగా మాట్లాడతానని గడ్కరీ తెలిపారు. తాను చెప్పిన పనిని చేయలేదని ప్రశ్నించే ధైర్యం ఎవరికీ లేదని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇక దేశ నిర్మాణంలో కార్మికుల పాత్రను కూడా ఆయన ప్రశంసించారు. దేశ ప్రగతి కేవలం యంత్రాల వల్ల కాకుండా, లక్షలాది కార్మికుల శ్రమ ఫలితమేనని అన్నారు. రహదారులు, భవనాలు, నీటిపారుదల ప్రాజెక్టులు కార్మికుల కష్టం వల్లే సాధ్యమయ్యాయని కొనియాడారు. దేశాభివృద్ధికి వెన్నెముకలైన కార్మికులకు తగిన గౌరవం, అవకాశాలు కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని గడ్కరీ స్పష్టం చేశారు.

# విద్రోహచర్యల అభియోగంపై ఇద్దరికి ఉరి శిక్ష అమలుచేసిన ఇరాన్

**టెహ్రాన్,మే 2:** యుద్ధ సమయంలోనూ ఇరాన్ తన దేశంలో విద్రోహచర్యలపై ఉక్కుపాదం మోపుతోంది. ఇజ్రాయెల్‌కు గూఢచర్యం చేస్తున్నా రనే ఆరోపణలపై ఇద్దరు వ్యక్తుల్ని ఇరాన్ ప్రభుత్వం ఉరితీసింది. శనివారం ఈ ఘటన జరిగింది. సెంట్రల్ ఇస్ఫాహాన్ ప్రావిన్స్ పరిధిలోని నటాంజ్ న్యూక్లియర్ సైట్ వద్ద యగౌబ్ కరింపోర్, నాజర్ బకర్జాదే అనే ఇద్దరు వ్యక్తుల్ని ఉరితీసినట్లు స్థానిక మీడియా తెలిపింది. ఈ ఇద్దరూ ఇజ్రాయెల్‌కు ఇరాన్‌కు సంబంధించిన రహస్య సమాచారం చేరవేశారని ఇరాన్ ఆరోపించింది. ఇజ్రాయెల్‌కు చెందిన గూఢచార సంస్థ మొసాద్. ఈ సంస్థకు ఈ ఇద్దరూ ఇరాన్ ప్రభుత్వానికి సంబంధించిన వివరాలు, కీలక ప్రదేశాలు, మత సంబంధమైన ప్రదేశాలతోపాటు న్యూక్లియర్ ప్లాంట్‌కు చెందిన సమాచారాన్ని చేరవేశారని ఇరాన్ ప్రభుత్వం ఆరోపించింది. ఈ సమాచారాన్ని వీరు సేకరించి, మొసాద్ అధికారులకు అందజేసినట్లు ప్రభుత్వం పేర్కొంది. ఈ నేరానికి గాను ఇరాన్ కోర్టు ఇద్దరికి మరణశిక్ష విధించింది. దీంతో శనివారం ఇరువురిని ఉరితీసింది. రెండు వారాల వ్యవధి లోనే ఇలా స్థానికుల్ని ఉరితీయడం ఇది రెండో సారి. గత ఏప్రిల్ 20న కూడా మొహమ్మద్ మాసౌమ్ షాహి, హమెద్ వాలిది అనే ఇద్దరు వ్యక్తుల్ని కూడా ఇదే గూఢచర్యం కింద ఇరాన్ ప్రభుత్వం ఉరితీసింది. వీరు ఇరాక్‌తోపాటు విదేశాల్లో శిక్షణ పొంది, ఇరాన్‌లో గూఢచర్యం చేస్తూ, మొసాద్‌కు సమాచారం అందిస్తున్నారని ఇరాన్ ఆరోపించింది. వీరిపై వచ్చిన ఆరోపణల్ని వీరు పని చేసే మొజాహెదిన్ సంస్థ ఖండించింది. మరోవైపు ఇరాన్‌లో అమలవుతున్న మరణ శిక్షలపై ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. గత ఫిబ్రవరి 28న యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు ఇరాన్ ప్రభుత్వం కనీసం 21 మందిని ఉరితీసిందని పేర్కొంది. అలాగే, భద్రతా కారణాలతో నాలుగు వేల మందికిపైగా అరెస్టు చేసినట్లు తెలిపింది. కానీ ఇరాన్ నుంచి అధికారిక ప్రకటన మాత్రం రాలేదు.

# బాంబులు తొలగిస్తుండగా పేలుడు 14 మంది ఐఆర్జీసి గార్డులు మృతి

**టెహ్రాన్,మే 2:** ఇరాన్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. దేశ వాయవ్య ప్రాంతంలోని జాంజన్ ప్రావిన్స్‌లో సంభవించిన ఓ పేలుడులో 14 మంది ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ సభ్యులు మరణించగా, మరో ఇద్దరు గాయపడ్డారు. ఇటీవలి యుద్ధంలో పేలకుండా మిగిలిపోయిన బాంబులను తొలగిస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది.

జాంజన్ నగర సమీపంలో ఐఆర్‌జీసీకి చెందిన బాంబు నిర్వీర్య బృందాలు క్లియరెన్స్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ ఏడాది జరిగిన యుద్ధంలో అమెరికా, ఇజ్రాయెల్ దళాలు జారవిడిచిన క్లస్టర్ బాంబులు, ఇతర పేలుడు పదార్థాలను గుర్తించి, నిర్వీర్యం చేసే పనిలో ఉండగా ప్రమాదవశాత్తు ఓ బాంబు పేలింది. మరణించిన వారిలో అత్యంత అనుభవజ్ఞులైన, ప్రత్యేక శిక్షణ పొందిన సిబ్బంది ఉన్నారని ఐఆర్‌జీసీ అన్సార్ అల్‌మహదీ యూనిట్ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ యేడాది ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా ఇరాన్‌పై వైమానిక దాడులు ప్రారంభించడంతో యుద్ధం మొదలైంది. దీనికి ప్రతిగా ఇరాన్ కూడా ఇజ్రాయెల్, ఇతర ప్రాంతాల్లోని అమెరికా స్థావరాలపై దాడులు చేసింది. అనంతరం ఏప్రిల్ 8న కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చింది.

యుద్ధం ముగిసినప్పటికీ, పేలని బాంబుల ముప్పు ఇంకా తొలగిపోలేదని ఈ ఘటన స్పష్టం చేస్తోంది. కాల్పుల విరమణ తర్వాత ఐఆర్‌జీసీకి ఇదే అతిపెద్ద నష్టం. ఇప్పటివరకు దాదాపు 15,000కు పైగా పేలని బాంబులను నిర్వీర్యం చేసినట్లు ఐఆర్‌జీసీ తెలిపింది. జాంజన్ ప్రావిన్స్‌లోనే సుమారు 1,200 హెక్టార్ల వ్యవసాయ భూములు ఈ బాంబుల కారణంగా ప్రమాదకరంగా మారాయని అధికారులు వెల్లడించారు.

# తమిళనాట నిలిచిన చిత్రాల షూటింగ్

## రెవెన్యూ షేరింగ్ అస్త్రం తెచ్చిన నిర్మాతల సంఘం

### అబ్బెబ్బే.. వీలుకాదంటున్న నడిగర్ సంఘం



**చెన్నై,మే 2:** కోలీవుడ్‌లో మొదలైన ఈ రెవెన్యూ షేరింగ్ చిచ్చు ఇప్పుడు టాలీవుడ్‌లో కూడా హాట్ టాపిక్ అయ్యేలా ఉంది. సినిమా హిట్ అయినా, ఫ్లాప్ అయినా నిర్మాత మాత్రం నష్టపోకూడదనే ఉద్దేశంతో తమిళ నిర్మాతలు తీసుకున్న ఈ నిర్ణయం నిజంగా సాహసోపేతమే. తమిళ చిత్ర పరిశ్రమలో (కోలీవుడ్) షూటింగ్స్ నిలిచిపోయాయి. నిర్మాతలు ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో తమిళ ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ (టిఎఫ్‌పిఎ) సంచలన నిర్ణయం తీసుకుంది. భారీ పారితోషికాల భారం నుంచి నిర్మాతలను గట్టెక్కించేందుకు "రెవెన్యూ షేరింగ్" అనే కొత్త అస్త్రాన్ని తెచ్చారు. ప్రస్తుతం ఉన్న పద్ధతి ప్రకారం సినిమా ఫలితంతో సంబంధం లేకుండా నటులు, దర్శకులు కోట్లలో పారితోషికం తీసుకుంటున్నారు. సినిమా ఫ్లాప్ అయితే నిర్మాత నిండా మునిగిపోతున్నాడు. దీనికి చెక్ పెట్టేందుకు నిర్మాతలు కొత్త డిమాండ్ చేస్తున్నారు. నటులు, దర్శకులకు ముందుగా పారితోషికం ఇవ్వకుండా, సినిమా విడుదలయ్యాక వచ్చిన లాభాల్లో వాటాలు మాత్రమే ఇవ్వాలనేది వాళ్ల డిమాండ్. సినిమా విజయం సాధిస్తే అందరికీ లాభాలు వస్తాయి, ఒకవేళ పరాజయం పాలైతే కేవలం నిర్మాత మాత్రమే కాకుండా అందరూ ఆ నష్టాన్ని పంచుకోవాలి. నిర్మాతల ఈ నిర్ణయంతో సుమారు 30కి పైగా చిత్రాల షూటింగ్స్ నిలిచిపోయాయి. పారితోషికాల నియంత్రణ ఉంటేనే కోలీవుడ్ మనుగడ సాధ్యమని టిఎఫ్‌పిఎ బలంగా నమ్ముతోంది. అయితే, ఈ ప్రతిపాదనపై నటుల సంఘం (నడిగర్ సంగం) అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. పారితోషికం కాకుండా కేవలం లాభాల్లో వాటా అంటే నటులపై ఒత్తిడి పెరుగుతుందని వారు వాదిస్తున్నారు.

ఒకవేళ తమిళనాట ఈ రెవెన్యూ షేరింగ్ మోడల్ సక్సెస్ అయితే, ఇది కేవలం కోలీవుడ్‌కే పరిమితం కాకపోవచ్చు. మన టాలీవుడ్ మరియు బాలీవుడ్‌లో కూడా నిర్మాతలు ఇదే బాటలో నడిచే అవకాశం ఉందని చిత్రరంగ నిపుణులుభావిస్తున్నారు. పారితోషికం రూపంలో కాకుండా వాటా రూపంలో ఆదాయం తీసుకోవడం అనేది ఇండియన్ సినిమా భవిష్యత్తును మార్చే అంశంగా కనిపిస్తోంది.

# పశ్చిమాసియా దేశాలతో అమెరికా ఆయుధ వ్యాపారం

## రూ.81 వేల కోట్లకుపైగా ఆయుధాల సరఫరా



**వాషింగ్టన్, మే 2:** అమెరికా, ఇజ్రాయెల్ దేశాలకు ఇరాన్‌తో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ అమెరికా ఆయుధ వ్యాపారం ముమ్మరం చేసింది. ఇజ్రాయెల్ సహా పశ్చిమాసియా దేశాలకు భారీగా ఆయుధాలను విక్రయించేం దుకు అమెరికా సిద్ధమైంది. ఒకవైపు కాల్పుల విరమణ ఒప్పందం అమలవుతుండగానే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. ఇజ్రాయెల్, కువైట్, ఖతార్, యుఎఇ లాంటి మిత్ర దేశాలకు దాదాపు 8.6 బిలియన్ డాలర్లకుపైగా (భారత కరెన్సీలో రూ.81 వేల కోట్లకుపైగా) విలువైన ఆయుధాల విక్రయానికి యూఎస్ విదేశాంగశాఖ ఆమోదం తెలిపింది. ఈ ప్యాకేజీలో అనేక అధునాతన సైనిక పరికరాలు ఉన్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ ప్యాకేజీ నుంచి ఖతార్ నాలుగు బిలియన్ డాలర్ల విలువైన పేట్రియాట్ వాయు, క్షిపణి రక్షణ వ్యవస్థలతో పాటు అత్యంత కచ్చితత్వంతో కూడిన లక్ష్యాలను ఛేదించగల ఆయుధ వ్యవస్థలను అందుకో నుంది. కువైట్‌కు సుమారు 2.5 బిలియన్ డాలర్ల ఆయుధాలు వెళ్లనున్నాయి. ఈ క్రమంలోనే ఇజ్రాయెల్, యూఏఈలకు గైడెడ్ రాకెట్ లాంఛర్లనుయూఎస్ విక్రయించనుంది. సాధారణంగా ఆయుధ విక్రయాలను అమెరికా కాంగ్రెస్ రివ్యూ చేస్తుంది. అయితే ట్రంప్ యంత్రాంగం అత్యవసర అధికారాలను ఉపయోగించి త్వరగా ఈ విక్రయాలు జరపాలని నిర్ణయించింది. ఈ చర్యను యూఎస్ విదేశాంగ మంత్రి మార్కో రూబియో సమర్థించుకున్నారు.

# మా అధినేత విజయ్‌దే తమిళనాడు సిఎం పీఠం!

## పార్టీ చీఫ్ కోఆర్డినేటర్ సెంగొట్టియన్



**చెన్నై, మే 2:** తమిళనాడు రాష్ట్రానికి కాబోయే ముఖ్యమంత్రి టివికే అధ్యక్షుడు విజయేనని ఆ పార్టీ ఎగ్జిక్యూటివ్ చీఫ్ కోఆర్డినేటర్ కెఎ సెంగొట్టయ్యన్ చెప్పారు. ఈ ఎన్నికల్లో విజయ్ నేతృత్వంలోని తమ టివికె పార్టీ 234 స్థానాలకుగాను 180 నుంచి 200 నియోజకవర్గాల్లో గెలువబోతున్నదని ఆయన ధీమా వ్యక్తంచేశారు. రాష్ట్రంలో ఏ పార్టీ కూడా మెజారిటీ సాధించదనే పరిస్థితి ఉండదని, తాము మెజారిటీ స్థానాలు గెలిచి సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నామని చెప్పారు. ఎన్నికల ఫలితాల అనంతరం కూడా ఏ పార్టీతోనూ పొత్తులు ఉండవని ఆయన అన్నారు. తమ నాయకుడు విజయ్ దూరదృష్టితో పాలన అందిస్తారని సెంగొట్టయ్యన్ చెప్పారు. 2026 ఎన్నికల విజయం తమకు చారిత్రాత్మకమైనదని అన్నారు. విజయ్ రాత్రనక, పగలనక కష్టపడ్డారని, ఎన్నో పరీక్షలను ఎదుర్కొన్నారని, మే 4న విడుదలయ్యే ఎన్నికల ఫలితాల్లో విజయ్ శ్రమకు ఫలితం దక్కబోతోందని వ్యాఖ్యానించారు. ఎన్నికల అనంతరం పొత్తు వార్తలను ఆయన కొట్టిపారేశారు. తమకు స్పష్టమైన మెజారిటీ వస్తుందని, ఏ పార్టీతో పొత్తు పెట్టుకోబోమని అన్నారు. ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే పార్టీ తిరిగి అధికారంలోకి వస్తుందని మెజారిటీ ఎగ్జిట్ పోల్ సర్వేలు తెలిపాయి. అయితే విజయ్ ఈ ఫలితాల అనంతరం కింగ్ మేకర్‌గా నిలుస్తారని టుడేస్ చాణక్య, యాక్సిస్ మై ఇండియా అంచనా వేశాయి. అన్నాడీఎంకే నేతృత్వంలోని ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చే అవకాశం లేదని దాదాపు అన్ని ఎగ్జిట్ పోల్స్ తెలిపాయి. ఈ క్రమంలో సెంగొట్టయన్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# బెంగాల్ ఫలితాలు దుర్గామాత కూడా అంచనా వేయలేరు!

## ఎన్నికల ఫలితాలపై సౌరభ్ గంగూలీ




**కోల్‌కత్తా, మే 2:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, చివరికి బెంగాల్ ఆరాధ్య దైవం దుర్గామాత కూడా అంచనా వేయలేరని భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఎన్నికల ఫలితాలపై నెలకొన్న తీవ్ర ఉత్కంఠను గంగూలీ తనదైన శైలిలో అభివర్ణించాడు. గంగూలీ విలేకరులతో మాట్లాడుతూ 2026 బెంగాల్ ఎన్నికల్లో ఎవరు గెలుస్తారని అడిగిన ప్రశ్నకు స్పందించాడు. ఇంతటి క్లిష్టమైన ప్రశ్నకు నేను ఎలా సమాధానం చెప్పగలను సోమవారం బ్యాలెట్ బాక్సులు తెరిచినప్పుడే మనందరికీ సమాధానం తెలుస్తుందని అన్నాడు. ఎన్నికల ఫలితాలు ఎంత అనూహ్యంగా ఉంటాయో చెబుతూ, మమతా దీదీ, మోడీజీ, చివరికి దుర్గామాత కూడా ఫలితాలను అంచనా వేయలేరని చమత్కరించాడు. పశ్చిమ బెంగాల్‌లోని 294 అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు విడతల్లో పోలింగ్ జరిగిన విషయం తెలిసిందే. కాగా, దక్షిణ 24 పరగణాల జిల్లాలోని రెండు నియోజకవర్గాల పరిధిలో 15 పోలింగ్ బూత్‌లలో ఎన్నికల సంఘం నేడు రీ పోలింగ్ నిర్వహిస్తోంది. ఎల్లుండి ఓట్ల లెక్కింపు జరగనుంది.

# అమెరికా మళ్లీ యుద్ధానికి రావొచ్చు...

## మేం అన్నింటికీ సిద్ధమే: ఇరాన్





**టెహ్రాన్, మే 2:** అమెరికా, ఇజ్రాయెల్ తమ దేశంపై మరోసారి దాడులకు దిగే అవకాశం ఉందని ఇరాన్ సైనిక ప్రధాన కార్యాలయ డిప్యూటీ అధికారి మహమ్మద్ జాఫర్ అసదీ ఆరోపించారు. అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు ఏమాత్రం తగ్గడంలేదు. శాంతి ఒప్పందం కోసం ఇరాన్ తాజాగా పంపిన ప్రతిపాదనపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో అసదీ వ్యాఖ్యలు ప్రాముఖ్యత సంతరించు కున్నాయి. అమెరికాతో మళ్లీ యుద్ధం జరిగే అవకాశం ఉందని అన్నారు. అమెరికా మాట మీద నిలబడటం లేదని విమర్శించారు. ఏ ఒప్పందాలకు, వాగ్దానాలకు కట్టుబడి ఉండటం లేదని అన్నారు. చమురు ధరలు తగ్గించడం, తాము సృష్టించుకున్న గందరగోళం నుంచి బయటపడేలా అమెరికా అధికారుల ప్రకటనలు ఉన్నాయని విమర్శించారు. ఈ క్రమంలో తమ దేశంపై మరోసారి దాడులకుదిగే అవకాశం ఉందని ఆయన ఆరోపించారు. శత్రుదేశాలు చేసే ఎలాంటి దాడినైనా తాము ఎదుర్కొంటామని స్పష్టం చేశారు.

**షిప్పింగ్ సంస్థలకు అమెరికా హెచ్చరిక**

హార్మూజ్ జలసంధి వద్ద ఇరాన్ టోల్ ఫీజు వసూలు చేస్తున్నట్లు వార్తలు రావడంతో అమెరికా స్పందించింది. ఇరాన్ విధించే టోల్ చెల్లిస్తే ఆయా షిప్పింగ్ సంస్థలు తమ ఆంక్షలను ఎదుర్కోవాల్సి వస్తుందని యూఎస్ ట్రెజరీ శాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. ఇరాన్–అమెరికా మధ్య కాల్పులు విరమణ ఒప్పందం కూడా రద్దు కావొచ్చు. ఇదే జరిగితే, ఇరాన్–అమెరికా మధ్య మళ్లీ యుద్ధం ప్రారంభం కావొచ్చన్నారు. ఇరు దేశాల మధ్య ఒప్పందం విషయంలో అమెరికా అంత ఆసక్తిగా లేదని, దీంతో యుద్ధం తప్పక పోవచ్చని ఆయన అన్నారు. అమెరికా ఇటీవల తీసుకుంటున్న చర్యలు, ప్రకటనలు చూస్తే ద్వైపాక్షిక అంశాలపై అమెరికాకు చిత్తశుద్ధి లేదనే విషయం స్పష్టమవుతోందన్నారు. అమెరికా చేసిన ప్రకటనలు ముందుగా చమురు ధరలు తగ్గించేందుకేనని, అలాగే వాళ్లు సృష్టించిన గందరగోళాన్ని తగ్గించేందుకే అని అసాది అన్నారు. చర్చల విషయంలో అమెరికాకు చిత్తశుద్ధి లేకపోవడంతో అమెరికాతో తమ దేశానికి మళ్లీ యుద్ధం తప్పకపోవచ్చని వ్యాఖ్యానించారు. అందుకే యుద్ధం వచ్చినా ఎదుర్కొనేందుకు తమ సైనిక దళాలు పూర్తి సిద్ధంగా, హై అలర్ట్‌తో ఉన్నాయని తెలిపారు.

3-5Pg6exHMNWJQE.qxd:3-5Pg6exHMNWJQE.qxd 1/1/02 6:21 AM Page 1





# నెల్లూరులో చెన్నై దొంగ అరెస్ట్

● రూ. 2.10 లక్షల విలువైన వెండి వస్తువులు స్వాధీనం

**నెల్లూరు క్రైమ్, మే 2 ప్రభాతవార్త:** నగరంలోని తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న ఒక అంతర్రాష్ట్ర నేరస్థుడిని నవాబ్‌పేట పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి 850 గ్రాముల బరువు కలిగిన రూ. 2.10 లక్షల విలువైన వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. శనివారం నవాబ్‌పేట పోలీస్ స్టేషన్‌లో మీడియా సమావేశంలో సీఐ వేణుగోపాల్ రెడ్డి ఈ కేసు వివరాలను వెల్లడించారు. నవాబ్‌పేట పరిధిలోని విదర్స్ కాలనీకి చెందిన గుండాల వెంకటేశ్వర్లు గత నెల 27వ తేదీన తన ఇంటికి తాళం వేసి భార్యతో కలిసి హైదరాబాద్‌లోని కుమార్తె వద్దకు వెళ్లారు. అదే రోజు రాత్రి తాళం వేసి ఉన్న ఇంటిని గమనించిన నిందితుడు, తలుపులు పగులగొట్టి లోపలికి ప్రవేశించాడు. బీరువాలో ఉన్న వెండి గిన్నెలు, దీపారాధన కుందెలు, హారతి పళ్లెం, విగ్రహాలతో సహా మొత్తం ఒక కేజీ వెండి వస్తువులను అపహరించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడు బాన డేవిడ్ (39) అసలు నివాసం చెన్నై అయినప్పటికీ, ప్రస్తుతం ముత్తుకూరు మండలం కృష్ణపట్నంపోర్టు గ్రామంలో ఉంటున్నాడు. ఇతను రాత్రి సమయాల్లో తిరుగుతూ తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి చోరీలకు పాల్పడేవాడు. దొంగిలించిన వెండి వస్తువులను ఎవరికీ అనుమానం రాకుండా కరిగించి, కడ్డీలుగా మార్చి విక్రయించేవాడు. విలాసాలకు, చెడు అలవాట్లకు బానిసైన డేవిడ్, సులభంగా డబ్బు సంపాదించేందుకే ఈ నేరాలకు పాల్పడు తున్నట్లు విచారణలో తేలింది. జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ సౌజన్య, టౌన్ ఏఎస్పీ దీక్ష పర్యవేక్షణలో నవాబ్‌పేట సీఐ జి.వేణుగోపాల్ రెడ్డి, ఎస్ఐ భోజ్యా నాయక్ తన సిబ్బందితో కలిసి నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. శనివారం ఉదయం పాత చెక్ పోస్ట్ వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. వేగంగా స్పందించి కేసును ఛేదించిన సీఐ వేణుగోపాల్ రెడ్డి, ఎస్ఐ భోజ్యా నాయక్, కానిస్టేబుళ్లు రత్నం, వేణు, చంద్ర, మస్తానయ్య, గౌస్‌లను ఏఎస్పీ దీక్ష ప్రత్యేకంగా అభినందించారు.

# కాశీబుగ్గ జ్యుయెలరీ షాప్ డెకాయిటీ గ్యాంగ్ అరెస్టు

● నాలుగు క్రైమ్ బృందాలతో చాకచక్యంగా కేసు ఛేదన ● ఐదుగురు నిందితుల అరెస్ట్, కేసు సొత్తు రికవరీ ● శ్రీకాకుళం జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి

**శ్రీకాకుళం, మే 2 ప్రభాతవార్త :** కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాశీబుగ్గ పట్టణం నిత్యానంద నగర్‌లో ఉన్న శ్రీ వెంకటేశ్వర జువెలరీ షాప్‌లో జరిగిన డెకాయిటీ కేసును కాశీబుగ్గ పోలీసులు విజయవంతంగా ఛేదించి, నిందితులను అరెస్ట్ చేసి, కేసుకు సంబంధించిన ముఖ్యమైన సొత్తును స్వాధీనం చేసినట్లు శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పత్రిక సమావేశంలో కేసు వివరాలను జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి వెల్లడించారు. ఈ కేసులో దోపిడి అయిన సొత్తు సుమారు 800 గ్రాముల బంగారు ఆభరణాలు, రికవరీ చేసిన సొత్తు 243 గ్రాముల బంగారు ఆభరణాలతో పాటుగా 9ఎంఎం పిస్టల్, 5 కార్ట్రిడ్జులు, 7.65 ఎంఎం పిస్టల్, 2 మ్యాగజైన్లు 11 కార్ట్రిడ్జులు, నగదు రూ.3,41,000తో పాటుగా దోపిడి చేయబడిన సొత్తుతో కొనుగోలు చేసిన రెండు కార్లును, నేరం చేయడానికి ముందుగా కొనుగోలు చేసిన రెండు కార్లు,మొబైల్ ఫోన్లు 12, మొత్తం రికవరీ విలువ 49 లక్షల రూపాయలు ఉంటుందని తెలిపారు. ఈ కేసులో ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన డెకాయిటీ గ్యాంగ్ నిందితులను అరెస్టు కావల్సింది అని, వారి వద్ద నుంచి కేసు ప్రాపర్టీ కూడా స్వాధీనం చేయవలసిందని తెలిపారు. రామచంద్ర సాహు బాబు (43) కునా బరిక్ (36) బనోజ్ బిహారి పట్నాయక్ (32)తపన్ మహారాణా (41) పొట్నూరు తిరుమల పాత్రో (56) లను అరెస్ట్ చేశారు. పొట్నూరు తిరుమల పాత్రో అనే వ్యక్తి దొంగ బంగారాన్ని కొనుగోలు చేసి పలు నగదు దుకాణాలకు విక్రయిస్తాడు. ఈ క్రమంలో కాశీబుగ్గలో పలుమార్లు రెక్కి చేసి దోపిడికి అనుకూలమైన నగదు దుకాణాన్ని ఎంచుకొని పైన తెలిపిన నిందితులతో దోపిడీ చేయడం జరిగింది. కేసు దర్యాప్తులో,



నిందితులు ఒడిశా రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో ఇదే తరహా దోపిడి మరియు డెకాయిటీ నేరాలకు పాల్పడిన అనుభవం కలిగినవారని వెల్లడైంది. వీరి మీద ఇప్పటివరకు ఒడిషా రాష్ట్రంలో 32 కేసులు నమోదైనట్లు గుర్తించారు. కొంతమంది నిందితులు ఇప్పటికే అరెస్ట్ అయ్యి జైలు శిక్ష అనుభవించినట్లు కూడా తేలింది.

ఫిర్యాది కిల్లంసెట్టి రామకృష్ణారావు నిత్యానంద నగర్‌లో శ్రీ వెంకటేశ్వర జువెలరీ పేరిట బంగారం దుకాణం నిర్వహిస్తున్నారు. ఆయన సాధారణంగా షాప్‌లో ఒక్కడే ఉంటారు. ఏప్రిల్ 7వ తేదీ మధ్యాహ్నం సుమారు 12 గంటల సమయంలో, సుమారు ఏడు మంది వ్యక్తులు, నెంబర్ ప్లేట్లు లేని మూడు మోటార్ సైకిళ్లపై షాప్ వద్దకు వచ్చారు. వారు తమను జీఎస్టి అధికారులుగా చెప్పుకుని షాప్ తనిఖీ చేయాలంటూ లోపలికి ప్రవేశించారు. షాప్‌లోకి వెళ్లిన తరువాత, వారు చేతులకు గ్లౌజులు, ముఖాలకు మాస్కులు ధరించి, అక్కడ ఉన్న సీసీ కెమెరాలపై నల్ల స్ప్రే పిచికారీ చేసి పని చేయకుండా చేశారు. అనంతరం ఫిర్యాదిదారుడి చేతులకు హ్యాండ్‌కఫ్స్ వేయడంతో పాటు పిస్టల్‌తో బెదిరించి, షాప్‌లో ఉన్న బంగారు ఆభరణాలను దోచుకుని అక్కడి నుండి పరారయ్యారు. ఈ కేసును ప్రత్యేక నాలుగు పోలీసు బృందాలు సాంకేతిక ఆధారాల సహాయంతో ఛేదించారు.

ఓ బ్యాంకు వద్ద సీసీ కెమెరాల ద్వారా వాహనాలను గుర్తించారు. అనంతరం వాహనాల కొనుగోలు వివరాలు, ఫైనాన్స్ సంస్థలు ఇచ్చిన సమాచారం సేకరించారు. ఆధార్, మొబైల్ నంబర్ల ఆధారంగా నిందితులను గుర్తించారు. తద్వారా గ్యాంగ్ యొక్క మొత్తం నెట్వర్క్‌ను వెలికితీసి నిందితులను అరెస్ట్ చేశారు.

అదనపు ఎస్పీ (క్రైమ్స్) పి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో కాశీబుగ్గ సబ్ డివిజనల్ అధికారి టి.భవాని సూచనల మేరకు, ఈ కేసును ఛేదించి నిందితులను పట్టుకోవడంలో క్రియాశీలంగా పని చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. వై. రామకృష్ణ, ఇన్‌స్పెక్టర్, ఎం.చిన్నన్నాయుడు, ఇన్‌స్పెక్టర్, ఇచ్ఛాపురం, ఆర్.నరసింహామూర్తి, ఎస్ఐ సునీల్ ఎస్ఐ, కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ కే. మధుసూదన రావు, ఎస్ఐ, పాతపట్నం పోలీస్ స్టేషన్, రాజేష్ ఎస్ఐ సీసీఎస్ పోలీస్ స్టేషన్, పి.పారినాయుడు, కంచిలి ఎస్ఐ, సి.హెచ్ గంగరాజ, ఎస్ఐ, హెచ్‌సీ గవరయ్య, పీసీలు ఉషాకిరణ్, ఎం.నీలకంఠం, మాధవ్, అలీ, షణ్ముఖరావు, భాసీర్, లోకనాథం, రాధాకృష్ణ, హరీష్. ఐటి కోరే సిబ్బంది హెచ్‌సీ యం. శ్రీధర్ కుమార్, పీసీలు డి.కె.జె భరత్ రెడ్డి, యస్. నరేష్ ఈ కేసు ఛేదనలో క్రియాశీలంగా వ్యవహరించి, సమన్వయం, సాంకేతిక వినియోగం ప్రశంసనీయమని జిల్లా ఎస్పీ మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.

# వాణిజ్య గ్యాస్ సిలిండర్ 19 కేజీలపై పెంచిన అదనపు చార్జీని తక్షణం ఉపసంహారించుకోవాలి

**విజయవాడ, మే 2 ప్రభాతవార్త ప్రతినిధి:** వాణిజ్య గ్యాస్ సిలిండర్ 19 కేజీలపై పెంచిన రూ. 993.50 అదనపు ఛార్జీని తక్షణం ఉపసంహరించుకోవాలని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు పత్రికా ప్రకటనను విడుదల చేశారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దురాక్రమణ దాడి నేపథ్యంలో ఇప్పటికే ఒకసారి గ్యాస్ ధరలు పెంచి కేంద్ర ప్రభుత్వం వినియోగదారుల నడ్డి విరగ్గొట్టిందని పేర్కొన్నారు. ఇపుడు మరలా అమాంతం దాదాపు మరో వెయ్యి రూపాయలు పెంచి చిన్న వ్యాపారస్తులను, టిఫిన్ సెంటర్లు, చిన్న హోటళ్లను కోలుకోలేని దెబ్బతీస్తుందన్నారు. గ్యాస్ కొరత వలన ఇప్పటికే అనేక హోటళ్లు, టిఫిన్ సెంటర్లు మూతపడ్డాయి లేదా పాక్షి కంగా నడుస్తున్నాయని తెలిపారు. ఫలితంగా రాష్ట్రంలో వందలాది మంది ఉపాధి కోల్పోయారని పేర్కొన్నారు. 5 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల కోసం ఇప్పటివరకు ఆగిన కేంద్ర ప్రభుత్వం మరలా గ్యాస్ రేటు పెంచి వెన్నుపోటు పొడిచిందన్నారు. గ్యాస్ రేట్ల పెంపుదలపై ఎక్కడికక్కడ నిరసనలు తెలియజేయాలని ప్రజలకు సిపిఐ(యం) పిలుపునిచ్చింది. ఈ క్రింది డిమాండ్లపై ప్రజలంతా ఏకమై పోరాడాలని విజ్ఞప్తి చేసింది.





# పోలీస్ 'సింధు' కన్నుమూత

**తిరుపతి, మే 2 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి జిల్లా పోలీస్‌విభాగం శునక దళంలో విశిష్ట సేవలు అందించిన ఎక్స్‌ప్లోజివ్ డిటెక్షన్ శునకం "సింధు" సహజ కారణంతో మృతి చెందింది. లాబ్రడార్ రిట్రీవర్ జాతికి చెందిన ఆడ శునకం "సింధు" 2013న జన్మించింది. 2014 సంవత్సరంలో హైదరాబాద్‌లోని ఐఐటీఏ, మొయినాబాద్‌లో ప్రత్యేక శిక్షణ పొందిన అనంతరం తిరుమల–తిరుపతి ప్రాంతాల్లో శునక దళంలో సేవలందించింది. ఎక్స్‌ప్లోజివ్ డిటెక్షన్ విభాగంలో పనిచేసిన "సింధు" తిరుమల తిరుపతి దేవస్థానం, తిరుపతి పోలీస్ శాఖ సంయుక్త భద్రతా విధుల్లో కీలక పాత్ర పోషించింది. తిరుమలలో జరిగే విఐపి, వివిఐపి పర్యటనలు, యాంటీ సబోటాజ్ తనిఖీలు, భద్రతాపరమైన సున్నిత ఆపరేషన్లలో "సింధు" అత్యంత అప్రమత్తతతో విధులు నిర్వహించి శాఖకు విశేష సేవలు అందించింది. తన సేవా కాలంలో శిక్షణా కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచి ప్రశంసలు అందుకుంది. 2021లో మంగళగిరిలో నిర్వహించిన రిఫ్రెషర్ కోర్సులో మూడో బహుమతి సాధించడం ద్వారా తన సామర్థ్యాన్ని మరోసారి నిరూపించింది. వయస్సు మీరడంతో శనివారం సహజ కారణాలతో మృతి చెందింది. తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, ఏఆర్ డిఎస్పీ ఎం.రామకృష్ణ, తిరుపతి శ్రీనివాసరావు నివాళి అలర్పించారు.

# గుడికల్ ఉరుసు ఉత్సవ వేడుకల్లో తీవ్ర విషాదం

● కళ్లముందే బిడ్డ నీటిలో మునిగిపోయింది

● గజ ఈతగాళ్ల గాలింపు చర్యలు ● భక్తుల్లో తీవ్ర దిగ్భ్రాంతి







**ఎమ్మిగనూరు క్రైం, మే 2 ప్రభాతవార్త:** కర్నూలు జిల్లా గుడికల్ గ్రామంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ప్రసిద్ధ గుడికల్ దర్గా ఉరుసు ఉత్సవాల వేళ, సంతోషంగా వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చిన ఒక కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లాకు చెందిన రజియా బేగం, తన ఏడేళ్ల కుమార్తె అఫ్రిన్ సహా ఇతర కుటుంబ సభ్యులతో కలిసి ఉరుసు వేడుకల కోసం గుడికల్ చేరుకున్నారు. దర్గా దర్శనానికి వెళ్లే ముందు, కాలకృత్యాలు తీర్చుకుని కాళ్లు చేతులు కడుక్కునేందుకు వారు సమీపంలోని చెరువు వద్దకు వెళ్లారు. అయితే, చెరువులోకి దిగిన క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి తల్లి రజియా బేగం, చిన్నారి అఫ్రిన్ ఒక్కసారిగా లోతైన నీటిలోకి వెళ్లిపోయారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు తక్షణమే స్పందించి నీటిలోకి దూకారు. తల్లి రజియా బేగంను క్షేమంగా ఒడ్డుకు చేర్చి ప్రాణాలతో కాపాడ గలిగారు. కానీ, చిన్నారి అఫ్రిన్ మాత్రం నీటి ప్రవాహంలో చిక్కుకుని గల్లంతయ్యింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని, గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. కళ్లముందే బిడ్డ నీటిలో మునిగిపోవడంతో తల్లిదండ్రుల ఆక్రందనలు మిన్నంటాయి. భక్తులతో కళకళలాడాల్సిన ఉరుసు ప్రాంగణం, ఈ ప్రమాదంతో ఒక్కసారిగా మూగబోయింది. ఈ ఘటన స్థానికంగానూ, ఉత్సవాలకు వచ్చిన భక్తుల్లోనూ తీవ్ర దిగ్భ్రాంతిని నింపింది. ఇందుకు సంబంధించి సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని సహాయకచర్యలు చేపట్టారు. ఈ ఘటపై కేసు నమోదు చేసిని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రధానమంత్రి సూర్య ఘర్, పిఎం కుసుమ ప్రయోజనాలపై అవగాహన




**తిరుపతి, మే 2 ప్రభాతవార్త ప్రతినిధి:** పునరుద్ధరించబడిన పంపిణీ రంగ పథకం (ఆర్‌డిఎస్ఎస్) ప్రధానమంత్రి సూర్య ఘర్,పిఎం కుసుమ పథకాల ప్రయోజనాలు గురించి ప్రజలలో మరింత అవగాహన పెంచాలని తిరుపతి ఎంపి డాక్టర్ గురుమూర్తి, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్ తెలిపారు. అర్హులైన వారందరికీ విద్యుత్ సబ్సిడీ చేరేలా చర్యలు తీసుకోవాలని తిరుపతి ఎంపి డాక్టర్ ఎం గురుమూర్తి చెప్పారు. ఆర్‌డిఎస్ఎస్, పిఎం సూర్యఘర్, కుసుమ పథకాలు కింద జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో గృహ, వ్యవసాయ అవసరాల కోసం వేర్వేరు విద్యుత్ లైన్ల ఏర్పాటు లక్ష్యంగా చేపట్టిన పథకం అని అన్నారు. ఈ పథకం ద్వారా గృహాలకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా అందుబాటులోకి వచ్చి, కుటీర పరిశ్రమలు, చిన్నవ్యాపారాల అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. మొత్తం రూ.643 కోట్ల వ్యయంలో, ఇప్పటివరకు 140 కోట్ల రూపాయలు పనులు పూర్తయ్యాయనీ, లక్ష్యంగా పెట్టుకున్న 450 ఫీడర్లలో, 211 ఫీడర్లు పూర్తి చేయడం జరిగిందన్నారు. శనివారం ఉదయం తిరుపతి పార్లమెంట్ పరిధిలోని ఎస్‌పిడిసిఎల్ అధికారులతో కలసి ఎంపి డాక్టర్ గురుమూర్తి, జిల్లా విద్యుత్ కమిటీ మెంబర్ సెక్రెటరీ, జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ సమీక్షించారు. పిఎం సూర్య ఘర్ పథకం కింద సాధారణ వర్గం ఒకటి,రెండు మూడుకిలోవాట్ల సోలార్ యూనిట్లపై సబ్సిడీ అందిస్తోందన్నారు. సాధారణ వర్గం కింద జిల్లాలో 4,500 కనెక్షన్లు ఇవ్వడం జరిగిందన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు నెలకు 200 యూనిట్ల లోపు వినియోగం ఉన్న లబ్ధిదారులకు ఉచితంగా సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. యులా మోడల్ కింద జిల్లాకు లక్ష్యంగా ఉన్న 36 వేల కనెక్షన్లలో, ఇప్పటివరకు 2,600 కనెక్షన్లు పూర్తి అయ్యాయని, మిగిలిన పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. పిఎం కుసుమకింద వ్యవసాయ పంప్ సెట్లకు సోలార్ విద్యుత్ అందించేందుకు ఈ పథకం అమలులో ఉందనీ,ప్రభుత్వ , ప్రైవేట్ భూముల్లో సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసి, రైతులకు పగటిపూట నిరంతర విద్యుత్ అందించడం ప్రధాన లక్ష్యంగా ఈ పథకం అమలు చేయడం జరిగిందన్నారు. పై పథకాల గురించి విపులంగా తెలిసేలా గ్రామ సభలు నిర్వహించి ఈ పథకాల యొక్క ఉపయోగాలు అందరికీ తెలియజేయాలని తెలిపారు. ప్రతి గ్రామం కూడా ఈ పథకంలో కవర్ అయ్యేలా చూడాలన్నారు. తిరుపతి జిల్లాలో సత్యవేడు నియోజకవర్గంలోని నారాయణవనం పవర్ లూమ్స్ సమస్య, చిట్టమూరు మండలంలోని ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ సరైన విధంగా అందకపోవడం వంటి అంశాల గురించి పార్లమెంట్ సభ్యుడు వివరాలను కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సబ్సిడీ అందేలా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా కొన్ని ప్రాంతాలు సబ్సిడీ పరిధిలోకి రాకపోవడం వల్ల రైతులు, చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి ఆ లోపాలను వెంటనే సరిదిద్దాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం సూర్య ఘర్ పథకంపై పట్టణ ప్రాంతాల్లో సరైన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని, ప్రజలకు ఈ పథకం ప్రయోజనాలు చేరేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. అలాగే వ్యవసాయ అవసరాల కోసం పీఎం కుసుమ్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసి రైతులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. తీర, మెట్ట ప్రాంతాలలో విద్యుత్ సౌకర్యం అందుబాటులో లేని ప్రాంతాల్లో సోలార్ ఎనర్జీపై ఆధారపడి వ్యవసాయం సాగిస్తున్న ప్రజలను దృష్టిలో ఉంచుకుని అవగాహనా కార్యక్రమాలు చేపట్టి ఈ పథకాలు వారికి చేరువయ్యేలా చేయాలని ఎంపి సూచించారు. గ్రామాలలోని చెరువు కట్టల వద్ద సౌర విద్యుత్ ప్రాజెక్టులను ఏర్పాటు చేసే అవకాశాలపై అవకాశాలను సాధ్యాసాధ్యాలను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో విద్యుత్‌సంస్థ ఆ శాఖ ఎస్ఇ వి.చంద్రశేఖర రావు, కన్స్ట్రక్షన్ పిఇఇ బాలాజీ, తిరుపతి, అర్బన్ రూరల్, పుత్తూరు, నాయుడుపేట, ఇఇ లు, డిప్యూటీ ఇఇలు, కన్స్ట్రక్షన్ డిప్యూటీ ఇఇలు పాల్గొన్నారు.

# చెరువులో ఈతకు వెళ్లి ఇద్దరు బాలురు మృతి

● సైదాపురంలో అలుముకున్న విషాద ఛాయలు



**సైదాపురం (నెల్లూరు), మే 2, ప్రభాతవార్త:** సరదాగా చెరువులోకి ఈతకు వెళ్లి అనధికారికంగా తవ్విఉన్న గుంతలో ప్రమాదవ శాత్తు మునిగిపోయి ఇద్దరు చిన్నారులు మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన సైదాపురంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు సైదాపురంకు చెందిన చల్లా ఉష కుమారుడు 8వ తరగతి చదువుతున్న చల్లా చందు(14), అదే విధంగా వాకాటి మరియదాసు కుమారుడు 7వ తరగతి చదువుతున్న వాకాటి లక్కీ(12) ఇద్దరు కలిసి సైదాపురంలో ఉన్న పెద్ద చెరువు దగ్గరకు సుమారు 1గంటల ప్రాంతంలో సరదాగా ఈతకు వెళ్లారు. ఈ క్రమంలో చిన్నారులు చెరువులోకి దిగుతుండగా ఆ ప్రాంతంలో అనధికారికంగా మట్టి తీసిన గుంతలు లోతుగా ఉండడంతో ఈ చిన్నారులు గమనించకపోవడంతో నీటిలో మునిగిపోయారు. విషయం తెలుసుకున్న స్థానికులు, గ్రామస్తులు ప్రమాద స్థలానికి చేరుకుని వారిని చెరువులో నుంచి బయటకు తీయగా అప్పటికే వారు మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో ఆ ప్రాంతమంతా విషాధ ఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న ఇన్‌చార్జి ఎస్ఐ లక్ష్మీభవాని, తహాసీల్దార్ సుభద్ర సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతి చెందిన చిన్నారుల కుటుంబాల్లో విషాధ ఛాయలు అలుముకున్నాయి. గతంలో అనధికారికంగా చెరువులో మట్టి కోసం తవ్విన గుంతల వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ లక్ష్మీ భవాని మాట్లాడుతూ మృతి చెందిన చిన్నారులను పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి పంపించడం జరిగిందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.



## అభివృద్ధి పనులకు మంత్రి ఆనం శ్రీకారం

**సంగం (నెల్లూరు), మే 2 ప్రభాతవార్త:** సంగం మండలం తరుణవాయి గ్రామంలో దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. తరుణవాయి గ్రామం వద్ద మంత్రి ఆనంకి స్దానిక నాయకులు,ప్రజా ప్రతినిదులు ఘనస్వాగతం పలికారు. మంత్రి మొదట హనుమాన్ జంక్షన్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. తరుణవాయి గ్రామంలో 72.90 లక్షలతో ఐటిఐ కాలేజి సిమెంట్‌రోడ్డును ప్రారంభించారు. గ్రామ ఆయకట్టు పరిధిలో 57.75 లక్షలతో నీటిపారుదల కాలువల మరమ్మత్తుల పనులను మంత్రి ప్రారంబించారు. అలాగే 31.60 లక్షలతో ఇంటింటికి కొళాయి రక్షిత మంచినీటి పథకం, పంపుషెడ్‌ను ప్రారంభించారు. అలాగే తరుణవాయి గ్రామంలో 1.62 కోట్లతో అభివృద్ధి పనులకు మంత్రి శ్రీకారం చుట్టారు. అనంతరం రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీదర్‌రెడ్డి స్వగ్రామమైన పడమటిపాళెంలో మంత్రికి ఘనస్వాగతం పలికారు. పడమటి పాళెం గ్రామంలో 1.71 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్బంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతు గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపబుతున్నామని అన్నారు. కోట్లాది రూపాయాలతో మౌళిక వసతులు కల్పిస్తు సిమెంట్ రోడ్లు, త్రాగునీటి సాకర్యం, సాగునీటి కాలువల అభివృద్దికి ప్రాధన్యత ఇస్తున్నట్లు తెలిపారు.

# నెల్లూరులో 5 లక్షల మందితో బహిరంగ సభ

● సమిష్టి కృషితో మహానాడును విజయవంతం చేస్తాం ● వేదిక కోసం మంత్రి నారాయణ బృందం అన్వేషణ

**నెల్లూరు, మే 2 ప్రభాతవార్త-వైద్యం:** తెలుగుదేశం పార్టీ ఏడాదికోసారి ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించుకునే మహానాడుకు తొలిసారి నెల్లూరు జిల్లా వేదిక కాబోతోంది. ఈ నెల 27 నుంచి 3 రోజుల పాటు జరగనున్న మహానాడు వేదిక ఎంపిక కోసం మంత్రి నారాయణ, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర, సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణరాజు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, టీడీపీరాష్ట్ర స్థాయి నేత జయరామిరెడ్డి, ముఖ్య నేతలతో కూడిన టీడీపీ బృందం శనివారం కోవూరు, నెల్లూరు రూరల్ నియోజకవర్గాల్లో సుడిగాలి పర్యటన చేసింది. కోవూరులో 2, నెల్లూరు రూరల్ ప్రాంతంలో 2 కలిపి మొత్తం 4 కీలక ప్రదేశాలను వారు క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం మంత్రి నారాయణ మాట్లాడుతూ పరిశీలించిన ప్రాంతాల నివేదికను సెంట్రల్ పార్టీ ఆఫీసుకు పంపుతామన్నారు. మరో 2 రోజుల్లో వేదికపై పూర్తి క్లారిటీ ఇస్తామని తెలిపారు. మహానాడుకు సుమారు 5 లక్షల మంది ప్రతినిధులు, కార్యకర్తలు వస్తారని అంచనా వేస్తున్నామన్నారు. సమన్వయం చేసుకొంటూ సమిష్టి కృషితో మహానాబును దిగ్విజయం చేస్తామన్నారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ మహానాడును తెలుగుదేబూతి పండుగగా అభివర్ణించారు. జిల్లా చరిత్రలో నిలిచిపోయేలా చేస్తామన్నారు. రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ మహానాడును నెల్లూరులో నిర్వహించాలని నిర్ణయం తీసుకున్న సీఎం చంద్రబాబు, యువనేత నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో మొదటిసారిగా మహానాడు జరుగుతుండడం తమ అదృష్టమని వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజీజ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు బీదా రవిచంద్ర, సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ రాజు, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



**ఏర్పాట్లపై మంత్రులు ఆనం, ఫరూక్, నారాయణ కీలక సమీక్ష**

రాష్ట్రం గర్వించేలా మహానాడు విజయవంతానికి మంత్రులు, ఎమ్మెల్యేల మాస్టర్ ప్లాన్ మంత్రుల హైలెవల్ మీటింగ్ పక్కా ప్లాన్‌తో సిద్ధమైన నేతలు నెల్లూరులో నిర్వహించనున్న మహానాడు పై మంత్రులు, ఎమ్మెల్యేలు శనివారం ఆర్ అండ్ బిగెస్ట్‌హౌస్‌లో విస్తృత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, జిల్లా ఇన్చార్జి మంత్రి ఫరూక్, సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ సత్యనారాయణ రాజు, శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, కాకర్ల సురేష్, కావ్య కృష్ణారెడ్డి, రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్, జిల్లా అధ్యక్షుడు,ఎమ్మెల్సీ బీద రవిచంద్ర తదితరులు పాల్గొని మహానాడు వేదిక ఖరారు, బహిరంగ సభ స్థలం, వాహనాల పార్కింగ్ మరియు రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చే అతిథులకు, కార్యకర్తలకు కల్పించాల్సిన వసతి సౌకర్యాలపై సుదీర్ఘంగా చర్చించారు. నెల్లూరు జిల్లా ఇచ్చే ఆతిథ్యం రాష్ట్రస్థాయిలో ఒక మైలురాయిగా నిలిచిపోయేలా, మహానాడును కళ్లుమిరుమిట్లు గొలిపే రీతిలో విజయవంతం చేసేందుకు నేతలందరూ సమన్వయంతో భారీ ప్రణాళికను సిద్ధం చేశారు.

# 5నుండి తిరుపతి తాతయ్యగుంట గంగమ్మజాతర

## అన్నిశాఖలు విస్తృత ఏర్పాట్లు

**తిరుపతి, మే 2 ప్రభాతవార్త ప్రతినిధి:** రాయలసీమ జిల్లాల్లోనే ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే తిరుపతి తాతయ్యగుంట గంగమ్మజాతర వారం రోజులు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ఇందుకు ప్రభుత్వశాఖలన్నీ సిద్ధమయ్యాయి. ఈనెల 5వతేదీ మంగళవారం రాత్రి చాటింపుతో మొదలయ్యే జాతర వేడుకలు వరుసగా, బైరాగి వేషం, బండ వేషం, తోటి వేషం, దొర వేషం, మాతంగి వేషం, సున్నపుకుండలు వేషం, చివరగా 12వ తేదీ గంగజాతర వేడుకలు జరుగుతాయి. 13వ తేదీ వేకువజామున పేరం టాలు అమ్మవారి ప్రతిమను చంప నరకడంతో ముగుస్తాయి. శనివారం గంగమ్మ ఆలయంలో ఏర్పాట్లు, క్యూలైన్లు, భక్తుల అనుమతి, వైద్య శిబిరాలు, తాగునీరు, పారిశుద్ధ్యం పై నగర పాలక సంస్థ ఇన్‌ఛార్జి కమిషనర్ శారదాదేవి, గంగమ్మఆలయ ఛైర్మన్ నైనార్ మహేశ్‌యాదవ్, ఆలయ ఇఒ జయకుమార్, నగరపాలక సంస్థ ఆర్ఒ సేతుమాధవ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. తాతయ్యగుంట గంగమ్మ జాతర భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వ శాఖలను సమన్వయం చేసుకుని పనిచేయనున్నట్లు ఛైర్మన్ మహేశ్‌యాదవ్ తెలిపారు. గంగజాతరకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా వ్యవహరిస్తామని తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు తెలిపారు.

సామాన్య భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా దర్శనాలు కల్పిస్తామని, విఐపిలకు సమయం కేటాయించామన్నారు.



ఆయా రోజుల్లో విఐపిలు ఆ సమయంలోనే గంగమ్మ ఆలయానికి చేరుకుని విఐపిలు దర్శనం చేసుకోవాలని, భక్తులు ఆధ్యాత్మిక వాతావరణంలో అమ్మవారిని దర్శించుకునే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

# లేఅవుట్ క్రమబద్ధీకరణ దరఖాస్తుల..

7వ పేజీ తరువాయి ..

స్కీం 2025 ప్రధాన లక్ష్యం అనధికార లేఅవుట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరించి చట్టబద్ధ పరిధిలోకి తీసుకురావడమేనని తెలి పారు. గడువు ముగిసే నాటికి సుమారు ఐదు వేలకుపైగా దరఖాస్తులు వచ్చినట్లు వెల్లడించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు సిబ్బంది, సాంకేతిక నిపుణుల మధ్య సమన్వయం కీలకమని, ప్రభుత్వం నిర్దేశించిన గడువులను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. నిపుణులకు పూర్తి సహకారం అందిస్తామని, అనుమతుల ప్రక్రియను వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు. యాక్సెస్ రహదారులు, సంబంధిత విభాగాల నుంచి అవసరమైన అనుమతి పత్రాలు తదితర అంశాలపై స్పష్టత కల్పించినట్లు తెలిపారు. సాంకేతిక సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు కమిషనర్ స్థాయిలో వాట్సాప్ సమూహాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నిపుణులు నేటి నుంచి పదిహేను రోజుల్లోపు ప్రాథమిక లేఅవుట్ నమూనాలను సిద్ధం చేసి సమర్పించాలని ఆదేశించారు. అవసరమైన పత్రాలను త్వరగా సమర్పించేందుకు సంస్థలోని సింగిల్ డెస్క్ విధానాన్ని వినియోగించాలని సూచించారు. అన్ని దరఖాస్తులను ఒక నెలలోపు పరిష్కరించాలని ప్లానింగ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. తిరస్కరణకు గురైన దరఖాస్తులను పునఃపరిశీలించాలని కూడా ఆదేశించారు. ఈ సమావేశంలో ప్లానింగ్ అధికారులు, సిబ్బంది, విజయనగరం, విశాఖపట్నం ప్రాంతాలకు చెందిన సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు.

# విశాఖ ఉక్కుకు కేంద్రం మద్దతు

7వ పేజీ తరువాయి ..

బలపరచడం, ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయడం లక్ష్యంగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. అలాగే ఉద్యోగులకు ప్రతి నెలా జీతాలు సమయానికి చెల్లించే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే కేంద్రంతో జరిగిన చర్చల ఫలితంగా 11,440 కోట్ల ప్యాకేజీ మంజూరైందని ఆయన వివరించారు. ఇందులో 10,300 కోట్లు ఈక్విటీగా, 1,140 కోట్లు వర్కింగ్ క్యాపిటల్‌గా అందించారని తెలిపారు. కోక్ ఓవెన్స్ పునర్నిర్మాణం ద్వారా ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించి, ప్లాంట్‌ను లాభదాయక మార్గంలో నడిపేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. వాలం టరీ రిటైర్మెంట్ తీసుకున్న ఉద్యోగుల బకాయిల చెల్లింపులను వేగవంతం చేయాలని శ్రీరామమూర్తి ఉక్కు యాజమాన్యానికి సూచించారు. కాగా, విశాఖ ఉక్కుకు రెండవ విడత ఆర్థిక సహాయానికి సిద్ధమవుతున్న నేపథ్యంలో, ప్రధాని నరేంద్రమోదీ,కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, ఉక్కు మంత్రులు కుమారస్వామి, శ్రీనివాస వర్మ, రాష్ట్ర అధ్యక్షులు పీవీయన్ మాధవ్ కు విశాఖ స్టీల్ ప్లాంట్ ఉద్యోగుల తరుపున శ్రీరామమూర్తి ధన్యవాదాలు తెలిపారు

# చెరువు ఆక్రమణలపై హైకోర్టు ఆగ్రహం

7వ పేజీ తరువాయి ..

జరిగినట్లు వెల్లడైంది. అయినప్పటికీ సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహించడంపై కోర్టు ప్రశ్నలు లేవనెత్తింది. చెరువును పునరుద్ధరించేందుకు 'అమృతే' పథకం కింద 2023లో రూ.33 కోట్లతో ప్రాజెక్టు చేపట్టినప్పటికీ, అదే చెరువు గర్భంలో భారీగా నిర్మాణాలు కొనసాగడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. ఈ పరిస్థితు ల్లో పునరుద్ధరణ ఎలా సాధ్యమవుతుందో వివరించాలని అధికారులను ఆదేశించింది. జీడీఎంసీ పరిధిలో ఉన్న ఈ చెరువు సంరక్షణకు శాశ్వత చర్యలు తీసుకోవాలని కోర్టు స్పష్టం చేసింది. చెరువు భూమి విలువ సుమారు రూ.175 కోట్లుగా అంచనా వేస్తుండగా, ప్రజా ఆస్తి రక్షణలో అధికారుల వైఫల్యాన్ని కోర్టు గమనిం చింది. స్థానికుల ప్రకారం, చెరువు మాయం వెనుక అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వర్షపు నీరు నిల్వ ఉండే ప్రాంతం పూర్తిగా తగ్గిపోవడంతో పర్యావరణానికి నష్టం కలుగుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆక్రమణలపై చర్యలు తీసుకుని చెరువును పునరుద్ధరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ప్రజా సమస్యలకు ప్రాధాన్యం...

7వ పేజీ తరువాయి ..

వాటిపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. గంగవరం పోర్ట్ నుంచి షీలానగర్ వరకు ప్రతిపాదిత రహదారి నిర్మాణంపై చర్యలు వేగవంతం చేయాలని, యారాడ-గంగవరం ప్రాంతాల్లో బ్రేక్ వాటర్ జెట్టి ఏర్పాటు వంటి మత్స్యకారుల సమస్యలను ప్రాధాన్యతగా తీసుకోవాలని సూచించారు. జల్ జీవన్ మిషన్ కింద మంజూరైన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, చిలకపేట సరస్సు పార్క్ అభివృద్ధి, కోస్తా కారిడార్ ప్రాజెక్ట్‌పై సమన్వయంతో ముందుకు సాగాలని నిర్దేశించారు. హార్బర్ ఆధునికీకరణ, ద్వారకా బస్టాండ్ అభివృద్ధి, మౌలిక వసతుల మెరుగుదల వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. డ్రైనేజ్ సమస్యను పరిష్కరించాలని, కొత్త యూపీహెచ్సీల ఏర్పాటు కోసం స్థలాల ఎంపిక వంటి విషయాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. తగరపువలస వద్ద ఆర్టీసీ డిపో ఏర్పాటు, మధురవాడ, భీమిలి పరిధిలో పీహెచ్‌సీల ఉన్నతీకరణ, కింగ్ జార్జ్ హాస్పిటల్‌లో ఓపీ బ్లాక్ ఆధునికీకరణ, ఎంసీహెచ్ బ్లాక్ పునరుద్ధరణ, మౌలిక వసతుల విస్తరణ, తీరం పొడువునా అవసరమైన చోట్ల బీచ్ రోడ్డు రక్షణ గోడ నిర్మాణం వంటి అంశాలపై సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఏపీఐఐసీ పరిధిలో ఉన్న ఆక్రమిత భూముల రెగ్యులరైజేషన్, మార్కెట్ విలువల ప్రకారం పరిష్కార చర్యలు తీసుకోవా లని పేర్కొన్నారు. తోటగరువు జూనియర్ కళాశాల ఏర్పాటులో సాంకేతిక అంశాలను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. సమావేశంలో చర్చించిన ప్రతి అంశంపై సంబంధిత అధికారులు నిర్దిష్ట కాలపరిమితిలో చర్యలు తీసుకుని పురోగతిని నివేదించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రాధాన్యమని, సమన్వయంతో పని చేసి వేగవంతమైన ఫలితాలు సాధించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్ భరత్, డీఆర్వో ఎం.విశ్వేశ్వరనాయుడు, ఆర్డీవోలు శేషశైలజ, సంగీత్ మాధుర్, అన్ని విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# అందరి సహకారంతో శతాబ్ధి ఉత్సవాలు విజయవంతం

7వ పేజీ తరువాయి ..

పాటు, సమాజానికి ఉపయోగపడే పరిశోధనలను ప్రోత్సహించేందుకు విశ్వవిద్యాలయం కట్టుబడి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖ, జిల్లా కలెక్టర్ సారథ్యంలో జిల్లా యంత్రాంగం కార్యక్రమం విజయవంతం కావడంలో కీలకంగా వ్యవహరించాయన్నారు. కార్యక్రమంలో భాగంగా ఏయూకు సహకారం అందించిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటి జనరల్ మేనేజర్ రాహుల్ సాంకృత్య, ఆర్.బి.ఓ ఈస్ట్ రీజినల్ మేనేజర్ సంజీత్ దేబ్‌నాథ్, ఆర్.బి.ఓ ఈస్ట్ ఎల్.అశోక్, ఏ.ఓ పర్సనల్ రిలేషన్స్ మేనేజర్ కె.ఉమామహేశ్వర రావు, ఏయూక్యాంపస్ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ వై.నిర్మల, ఏయూ ఇంజనీరింగ్ కళాశాల బ్రాంచ్ మేనేజర్ ఎం.రాజేష్ తదితరులను వేదికపైసత్కరించి జ్ఞాపికలను బహూకరించారు. శతాబ్ధి ఉత్సవాల లో విద్యార్థులకు ఉపయుక్తంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా టీ షర్టులను తయారుచేసి అందించింది. వేదికపై ఏయూ చిత్రకళా విభాగం విద్యార్థుల శిల్ప, చిత్రకళా ప్రదర్శనకు సంబంధించిన క్యాటలాగ్‌ను ఆవిష్కరించారు. శతాబ్ధి ఉత్సవాలలో సేవలు అందించిన శతాబ్ధి సేవా వలంటీర్లకు సర్టిఫికేట్లను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య పి.కింగ్, రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, ప్రిన్సిపాల్స్, పాలక మండలి సభ్యులు, డీన్‌లు, ఆచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# టెన్త్ ఫలితాలపై జిల్లా విద్యా శాఖ అధికారులతో జిల్లా స్థాయి సమీక్ష

7వ పేజీ తరువాయి ..

నివేదికలతో ప్రణాళికలను రూపొందించుకొని, పిల్లలకు అవసరమైన విద్యను అర్థమయ్యే రీతిలో బోధించే విధంగా రూపొందించుకున్నట్లయితే ఫలితాల ప్రగతిలో ఉంటుందని కలెక్టర్ తెలిపారు. స్కూల్ ప్రధానోపా ధ్యాయులు ముందస్తు యాక్షన్ ప్లాన్ రూపొందించుకొవాలన్నారు. ఏటిడబ్ల్యుఒ, ఎంఈవోలు, స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు సమర్థవంతమైన పర్యవేక్షణ నిర్వ హించాలన్నారు. జిల్లా అధికారులు నిరంతరం పర్యవేక్షణ నిర్వహిస్తూ, ప్రతివారం సమీక్ష సమావేశాలు చేపట్టాలన్నారు. సప్లమెంటరీలో పరీక్షలలో తప్పనిసరిగా నూటికి నూరు శాతం ఫలితాలు ఉండాలని అలా లేని స్కూల్ పరిధిలో గల ఏటి డబ్ల్యుఒలు, ఎంఈఓస్, ప్రధానోపా ధ్యాయులకు, సంబంధిత సబ్జెక్టు ఉపాధ్యాయులకు చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశం లో జిల్లా విద్యాశాఖ అధికారి కృష్ణారావు, డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారి పి.బి.కె,పరిమళ, గురుకులం ప్రిన్సిపల్, ఓఎస్డిపి ఎస్ఎన్ మూర్తి, ఏటిడబ్ల్యూ, వివిధ మండలాల నుండి వచ్చిన ఎంఈఓ, ప్రధానోపాధ్యా యులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలో మరో 5 రోజులు మిశ్రమ వాతావరణం

(ప్రభాతవార్త-విశాఖపట్నం)

ఏపీలో రానున్న ఐదు రోజుల పాటు మిశ్రమ వాతావరణ పరిస్థితులు కొనసాగనున్నట్లు ఇండియా మెటీరోలాజికల్ డిపార్ట్మెంట్ (ఐఎండి)కు చెందిన విశాఖ వాతావరణ కేంద్రం తెలిపింది. ప్రస్తుతం ఒడిశా నుంచి ఆంధ్రప్రదేశ్ మీదుగా గల్ఫ్ ఆఫ్ మన్నార్ వరకు విస్తరించిన ట్రాఫ్ (ఉపరితల ద్రోణి) ప్రభావంతో రాష్ట్రంలో వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది.

## ఉత్తరాంధ్రలో ఈదురుగాలులతో వర్షాలు..

ఉత్తరాంధ్ర ప్రాంతంలో ఈదురుగాలులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని అధికారులు తెలిపారు. ముఖ్యంగా విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో కొన్ని చోట్ల గాలి వేగం అధికంగా ఉండవచ్చని అంచనా వేశారు. ఇక కోస్తా జిల్లాల్లో కూడా వచ్చే ఐదు రోజుల పాటు వర్షాలు కొనసాగే అవకాశముంది. తీర ప్రాంతాల్లో గాలులు గంటకు గరిష్టంగా 65 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉండటంతో సముద్రం అల్లకల్లోలంగా మారే పరిస్థితి ఉందని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మొత్తానికి రాష్ట్రంలో ఎండలు, వర్షాలు కలిసిన మిశ్రమ వాతావరణం నెలకొననుండగా, ప్రజలు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ సూచించింది.

# కెనరా బ్యాంక్ అధికారుల సంఘం..

విశాఖపట్నం, మే 02,ప్రభాతవార్త

ప్రస్తుతం నెలకొన్న వేసవి తాప పరిస్థితులలో ప్రజలకు తాగునీరు అందించి, ఉపశమనం కలిగించేందుకు, కెనరా బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్, అమరావతి రీజియన్ ఆధ్వర్యంలో కెనరా బ్యాంక్ మంగళగిరి బ్రాంచ్ వద్ద "చలివేంద్రం" ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని కెనరా బ్యాంక్ అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి, ముఖ్య అతిథి కె.రవికుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అమరావతి రీజియన్ ఏ.జి.ఎమ్ శ్రీహరిఫణి పాల్గొన్నారు. సమావేశాన్ని ఉద్దేశించి ముఖ్య అతిథి మాట్లాడుతూ, ఈ తీవ్రమైన వాతావరణ పరిస్థితులలో ప్రజాప్రయోజనార్థం ఈ అర్థవంతమైన సామాజిక సేవా కార్యక్రమాన్ని చేపట్టిన సిబ్బంది, సభ్యుల కృషిని అభినందించారు. సమాజం పట్ల అధికారులు కనబరిచిన సేవా స్ఫూర్తిని, నిబద్ధతను ఆయన కొనియాడారు. ఈ అవకాశాన్ని ప్రజలు, బాటసారులు వినియోగించుకోవాలన్నారు. అధికారులు, సభ్యులు, ఖాతాదారులు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు.

# హిందుస్తాన్ షిప్‌యార్డ్‌లో వ్యూహాత్మక ప్రాజెక్టుల డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన జస్వీందర్ సింగ్



విశాఖపట్నం, మే 2, ప్రభాతవార్త :

హిందూస్థాన్ షిప్ యార్డ్ లిమిటెడ్ లో వ్యూహాత్మక ప్రాజెక్టుల డైరెక్టర్‌గా కమోడోర్ జస్విందర్ సింగ్ (రిటైర్డ్ ) శుక్రవారం(మే 1న)బాధ్యతలు స్వీకరించారు. భారత నౌకాదళంలో మూడు దశాబ్దాలకు పైగా విశిష్ట సేవలందించిన అనంతరం ఆయన ఈ పదవిని చేపట్టారు. జస్విందర్ సింగ్ జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ నుంచి యాంత్రిక ఇంజినీరింగ్‌లో బి.టెక్, యూనివర్సిటీ ఆఫ్ పూణే నుంచి మెరైన్ ఇంజినీరింగ్‌లో ఎం.ఇ., యూనివర్సిటీ ఆఫ్ ముంబై నుంచి రక్షణ మరియు వ్యూహాత్మక అధ్యయనాల్లో ఎం.ఫిల్ పూర్తి చేశారు. అదనంగా జామ్నలాల బజాజ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ స్టడీస్ నుంచి నిర్వహణలో పీజీ డిప్లొమా పొందారు. భారత నౌకాదళంలో ఆయన నౌకలు, సబ్‌మరైన్లు, నౌకాదళ స్థావరాలు, డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్, త్రిసేవా సంస్థల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. మెరైన్ ఇంజినీరింగ్, నౌకాదళ నిర్వహణ, వ్యూహాత్మక నౌకల నిర్మాణంలో ఆయన విశేషంగా సేవలందించారు. హిందుస్తాన్ షిప్‌యార్డ్‌లో డైరెక్టర్ (వ్యూహాత్మక ప్రాజెక్టులు)గా ఆయన సబ్‌మరైన్ ప్రాజెక్టులు సహా కీలక వ్యూహాత్మక కార్యక్రమాల అమలు బాధ్యతలను నిర్వహించనున్నారు.

# వందే భారత్ రైలు తయారీలో కొత్త మైలురాయి

## మోడర్న్ కోచ్ ఫ్యాక్టరీ నుంచి తొలి రైలు విడుదల

(ప్రభాతవార్త -విశాఖపట్నం)



దేశంలో ఆధునిక రైలు తయారీలో మరో ముందడుగు పడింది. మోడరన్ కోచ్ ఫ్యాక్టరీ నుంచి తొలి వందే భారత్ రైలు సెట్ శనివారం విజయవంతంగా తయారు చేసి పరీక్షల కోసం పంపించారు. దీంతో వందే భారత్ రైళ్ల తయారీ సంస్థల జాబితాలో ఈ ఫ్యాక్టరీ కూడా చేరింది. 2018లో కేవలం రెండు రైళ్లతో ప్రారంభమైన వందే భారత్ ఎక్స్ ప్రెస్ ప్రయాణం ప్రస్తుతం 100వ రైలు సెట్కు చేరువలో ఉంది. ఇది దేశ రైల్వే ఆధునీకరణలో కీలక ఘట్టంగా భావిస్తున్నారు. ఈ కొత్త రైలు 16 బోగీలతో కూడిన చెయిర్ కార్ రేక్‌గా రూపొందించబడింది. అత్యాధునిక సాంకేతికతతో కూడిన సీమెన్స్ ప్రొపల్షన్ వ్యవస్థను ఇందులో ఏర్పాటు చేశారు. ప్రయాణికుల సేవల్లో ప్రవేశపెట్టే ముందు రైలు భద్రత, ప్రయాణ నాణ్యత, పనితీరును అంచనా వేయడానికి ప్రత్యేక పరీక్షలు నిర్వహించనున్నారు. వేగం, సమర్థత, ప్రయాణికుల సౌకర్యం అనే వందే భారత్ ప్రధాన లక్షణాలను కొనసాగిస్తూ ఈ రైలులో మరిన్ని సాంకేతిక మెరుగుదలలు చేర్చారు. సౌకర్యవంతమైన సీట్లు, జర్క్ లేని ప్రయాణం, పూర్తిగా మూసివేసిన గ్యాంగ్‌వేలు, ఆటోమేటిక్ తలుపులు వంటి సదుపాయాలు ఉన్నాయి. అదనంగా స్వదేశీ 'కవచ్' ఆటోమేటిక్ రక్షణ వ్యవస్థ, ఆధునిక అగ్ని నిరోధక సాంకేతికత, వరదల నుంచి రక్షణ వంటి భద్రతా ఏర్పాట్లు కల్పించారు. వాక్యూమ్ ఇన్స్యూషన్ టెక్నాలజీతో లోపలి భాగం నాణ్యతను మెరుగుపరిచారు. ప్రత్యేకంగా దివ్యాంగులకు అనుకూలంగా ర్యాంపులు, ప్రత్యేక స్థలాలు, అవసరమైన సదుపాయాలను ఏర్పాటు చేశారు. ఈ రైలు దేశంలో వేగవంతమైన, సురక్షితమైన, సౌకర్యవంతమైన రైల్వే ప్రయాణానికి కొత్త దిశగా నిలుస్తుందని అధికారులు తెలిపారు. ఇటువంటి రైలు విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్ కు వేసే అవకాశం ఉందని పలువురు వివరించారు.

# వేసవి దృష్ట్యా వాల్తేరు డివిజన్ ప్రత్యేక చర్యలు

విశాఖపట్నం, మే 2, ప్రభాతవార్త




వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు పెరగడం, ప్రయాణికుల రద్దీ అధికం కావడం నేపథ్యంలో ఈస్ట్ కోస్ట్ రైల్వే కు చెందిన వాల్తేరు డివిజన్ ప్రయాణికుల సౌకర్యం, భద్రత కోసం పలు చర్యలు చేపట్టింది. డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా ఆదేశాల మేరకు అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది అవసరమైన ఏర్పాట్లు చేపడుతున్నారు. ప్రధాన స్టేషన్లలో తాగునీటి సరఫరాను సమృద్ధిగా అందుబాటులో ఉంచుతూ, వాటర్ బూత్‌లను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. జనరల్ బోగీలలో ప్రయాణించే ప్రయాణికుల కోసం ప్లాట్‌ఫామ్ చివరల్లో ఉచిత తాగునీటి సదుపాయాలు ఏర్పాటు చేయబడుతున్నాయి. స్వచ్ఛంద సంస్థల సహకారంతో నీటి పంపిణీ కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు. స్టేషన్‌లలోని మరుగుదొడ్లు, వేచిచోట్లలో నిరంతర నీటి సరఫరా, రైళ్ల రాకపోకలపై సమయానుకూల ప్రకటనలు కొనసాగుతున్నాయి. రద్దీ సమయాల్లో ప్రయాణికుల రాకపోకలను సులభతరం చేయడానికి క్యూలైన్ నిర్వహణ, ప్రత్యేక హోల్డింగ్ ఏరియాలు ఏర్పాటు చేశారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు మరియు కాంకోర్స్ ప్రాంతాల్లో ప్రయాణికుల కదలికపై ప్రత్యేక దృష్టి పెట్టి, సురక్షిత రవాణా కోసం చర్యలు తీసుకుంటున్నారు.

# ప్రశాంతంగా ఏపీ ఐసెట్ 2026 ప్రవేశ పరీక్ష

## - 88.46 శాతం హాజరు నమోదు

విశాఖపట్నం, మే 2, ప్రభాతవార్త



రాష్ట్ర వ్యాప్తంగా ఎంబిఏ, ఎంసిఏ కోర్సులలో ప్రవేశాలకు నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌ను శనివారం విజయ వంతంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లోని 48 నగరాల్లో గల 91 పరీక్షా కేంద్రాలతో పాటు హైదరాబాదులోని ఒక కేంద్రంలో రెండు సెషన్లలో ఈ పరీక్ష జరిగింది. మొత్తం 26,219 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. రెండు సెషన్లలో నిర్వహించిన ఈ పరీక్షకు 88.46 శాతం హాజరు నమోదయింది. ఉదయం సెషన్ ఉదయం 9:00 నుండి 11:30 గంటల వరకు, మధ్యాహ్నం సెషన్ మధ్యాహ్నం 2:00 నుండి 4:30 గంటల వరకు నిర్వహించబడింది. ఉదయం సెషన్ పరీక్ష సెట్ కోడ్‌ను ఏయూ వీసీ ఆచార్య జి.పి రాజశేఖర్, మధ్యాహ్నం సెట్ కోడ్‌ను ఏయూ రెక్టార్ ఆచార్య పి.కింగ్ ఎంపిక చేశారు. పరీక్ష నిర్వహణను కన్వీనర్ ఆచార్య ఎం.శశి ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ఉదయం సెషన్‌కు మొత్తం 12,767 మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా, 11,231 మంది హాజరయ్యారు. హాజరు శాతం 87.97%గా నమోదైంది. మధ్యాహ్నం సెషన్ కి 13,452 దరఖాస్తు చేయగా హాజరు శాతం 88.96% గా నమోదైంది. పరీక్షా ప్రక్రియలో పారదర్శకతను, నిష్పాక్షికతను పాటిస్తూ, అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణలో పరీక్షను సజావుగా నిర్వహించారు.

# నీట్ (యూజీ) పరీక్షకు పూర్తి ఏర్పాట్లు

పీఎం పాలెం, మే 1, ప్రభాతవార్త

నగరంలో ఆదివారం నిర్వహించనున్న నీట్ (యూజీ) పరీక్షకు సంబంధించి విశాఖపట్నంలోని గవర్నమెంట్ పాలిటెక్నిక్ విశాఖపట్నం, గవర్నమెంట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ ఇంజనీరింగ్ కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపాల్ డా. కె.వి. రమణ తెలిపారు. పరీక్షను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టామని, అభ్యర్థుల కోసం మౌలిక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు, పర్యవేక్షణ చర్యలు సమకూర్చినట్లు ఆయన వెల్లడించారు. ఇన్విజిలేటర్లకు సంబంధించిన బ్రీఫింగ్ సెషన్ విజయవంతంగా నిర్వహించామని, పరీక్ష నిర్వహణకు సంబంధించిన అన్ని సూచనలు వారికి అంద జేసినట్లు తెలిపారు. అభ్యర్థులు నిర్ణీత సమయానికి పరీక్ష కేంద్రాలకు హాజరు కావాలని, పరీక్ష నియమావళిని ఖచ్చితంగా పాటించాలని సూచించారు. ఈ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహిస్తున్నదని, ఈ రెండు కేంద్రాల్లో ప్రతి ఒక్కదానికి 360 మంది చొప్పున అభ్యర్థులను కేటాయించినట్లు తెలిపారు.

# ముస్లింల సంక్షేమానికి టీడీపీ పెద్ద పేట

విశాఖపట్నం మే 1, ప్రభాతవార్త



ముస్లింల సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ పెద్దపీట వేస్తోందని పార్టీ కోసం కష్టపడి పని చేసే ప్రతీ ఒక్కరికీ తగిన గుర్తింపు ఇస్తోందని శాసనమం డలి మాజీ చైర్మన్, రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ వ్యవహారాల సలహా దారు ఎంఏ షరీఫ్ పేర్కొన్నారు. విశాఖ ముస్లిం కమ్యూనిటీ శనివారం కోటవీధిలోని డీన్ షాదీఖానాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ మైనారిటీ వ్యవహారాల సలహాదారునిగా క్యాబినెట్ హోదాలో నియమితులైన ఎంఏ షరీఫ్, తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులుగా నియమితులైన మహ్మద్ నజీర్, ఇటీవల నామినేటెడ్ పోస్టులు, పార్టీ పదవులు పొందిన వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ లు ముస్లింల ప్రయోజనాల పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లోనే ఎన్డీఏతో స్నేహం కొనసాగిస్తున్నప్పటికీ ముస్లింల హక్కుల విషయంలో రాజీ పడడం లేదని అన్నారు. పార్టీ కోసం కష్టపడి పని చేసే వారికి తగిన గుర్తింపు, ప్రాధాన్యత ఉంటుందని మతసామరస్యం కాపాడ్డం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని అన్నారు. రాష్ట్రంలో గత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజల జీవితాలతో ఏ విధంగా ఆడుకుందో తెలిసిందేనని అన్నారు. జామియా మసీదు ఆస్తుల విషయమై ప్రభుత్వంతో చర్చించనున్నట్లు చెప్పారు తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు మహమ్మద్ నజీర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో రాజకీయంగా ఎదగడం అత్యంత క్లిష్టమైన విషయమని అన్ని రంగాల్లోనూ వెనుకబడి ముస్లింలకు తెలుగుదేశం పార్టీ మాత్రమే సముచితమైన ప్రాధాన్యత ఇస్తోందని ముస్లింలకు స్వేచ్ఛ ఎక్కువగా కల్పిస్తోందని అన్నారు. వుడా మాజీ చైర్మన్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్.ఏ.రహమాన్ మాట్లాడుతూ విశాఖపట్నం జిల్లాలో ముస్లిములకు కేటాయించిన ఆస్తులు, వక్ఫ్ ఆస్తులను గాడిలో పెట్టినట్లయితే వాటి ద్వారా వచ్చిన ఫలాలు ముస్లిం కమ్యూనిటీకి ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు ముస్లింలు రాజకీయంగా వెనుకబడి ఉన్నారని నియోజకవర్గాల వర్గీకరణ నేపథ్యంలో విశాఖపట్నం లోని ఒక నియోజకవర్గం ముస్లిం మైనార్టీలకు కేటాయించాలని కోరారు. ఎస్సీ ఎస్టీ తరహాలో ముస్లింలకు కూడా రాజకీయ రిజర్వేషన్లు ఉండాలని అన్నారు. ముస్లింల కోసం నిరంతరం శ్రమిస్తున్న షరీఫ్ ను రాజ్యసభకు పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సాదిక్, రహమతుల్లా బేగ్,మహమ్మద్ రఫీ, హమీద్, గౌస్ ఖలీషా, అబ్దుల్ చిన్న రహమాన్, నర్గీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరో వార్డులో అభివృద్ధి పనులకు శ్రీకారం

## సుమారు రూ.63.9 లక్షల వ్యయంతో సిసి రోడ్డు, డ్రెయిన్లు నిర్మాణం పనులు ప్రారంభం

## -భూమి పూజ చేసి పనులు ప్రారంభించిన ఆరో వార్డు అధ్యక్షుడు గరే గురునాథ్



పీఎం పాలెం, మే 1, ప్రభాతవార్త

జీవీఎంసీ పరిధిలోని 6వ వార్డులో సుమారు 63.9లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న అభి వృద్ధి పనులకు బుధవారం ఆరో వార్డు అధ్యక్షుడు గరే గురునాథ్ భూమిపూజ చేసి పనులు ప్రారంభిం చారు. అభివృద్ధి పనులలో భాగంగా సాయి ప్రియ రోడ్డు సమీపంలో ఉన్న భాస్కర్ నగర్, డి-మార్ట్ వెనుక ప్రాంతాలలో ఉన్న సిసి రోడ్డులు, డ్రెయిన్లు నిర్మాణాలు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా గురునాథ్ మాట్లాడుతూ వార్డులో నెలకొన్న సమస్యలపై మాజీ మంత్రివర్యులు భీమిలి నియోజకవర్గం ఎమ్మెల్యే గంట శ్రీనివాసరావు ఆదేశాలతో ప్రతి సమస్య పరిష్కార మార్గంలో సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని, ఇందులో భాగంగానే ఈ 63.9లక్షల వ్యయంతో కూడిన సిసి రోడ్లు,డ్రెయిన్లు నిర్మాణాలను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ఆయన హామీ ఇచ్చారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి శ్రీనివాస్, యార్ల గడ్డ జీవన్ కుమార్, ఆరో వార్డు కార్యదర్శి లొడగల జానకి రామ్, ఆరో వార్డు బిసి సెల్ అధ్యక్షులు రెడ్డి సత్యనారాయణ,మహిళా అధ్యక్షురాలు పి బబ్బేలు, భారత్, ఉమ, నక్క రమణ, పోతిన నాయుడు, నాగోతి వెంకటరావు, పిల్లా అప్పలరాజు, ఎం.రమణ, నూకరాజు, పాల్గొన్నారు.

# హెచ్ఐవి-ఎయిడ్స్ నియంత్రణపై జిల్లా సమీక్ష సమావేశం

పీఎం పాలెం, మే 1, ప్రభాతవార్త



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంఘం ప్రాజెక్ట్ డైరెక్టర్ రోణంకి గోపాలకృష్ణ ఆదేశాల మేరకు జిల్లాలో హెచ్ఐవి-ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాలపై నెలవారీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జగదీశ్వరరావు, జిల్లా కుష్ఠు, ఎయిడ్స్, క్షయ వ్యాధి అధికారి డాక్టర్ రోణంకి రమేష్ సమక్షంలో నిర్వహించారు. సమావేశంలో జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంఘం నిర్దేశించిన లక్ష్యాలను 2026 డిసెంబర్ 1 నాటికి సాధించాలని జిల్లా అధికారులు ఆదేశించారు. ఈ లక్ష్య సాధనలో భాగంగా జిల్లాలోని అన్ని ప్రైవేట్ వైద్య సంస్థలు తమ వద్ద నమోదైన హెచ్ఐవి కేసుల వివరాలను నిరంతరం జిల్లా ఎయిడ్స్ నోడల్ అధికారికి అందించాలని కోరారు. అలాగే హెచ్ఐవి సోకిన రోగులకు ఎలాంటి వివక్ష లేకుండా తగిన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ సమావేశంలో హెచ్ఐవి-ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాల్లో పాల్గొంటున్న వివిధ సంస్థల ప్రతినిధులు, ఏఆర్టీ కేంద్ర సిబ్బంది, దిశా సిబ్బంది, జిల్లా పాజిటివ్ నెట్‌వర్క్ అధ్యక్షుడు కనకరాజు, ఐసీటీసీ, డీఎస్ఆర్‌సీ, క్షయ వ్యాధి సిబ్బంది, వైద్యాధికారులు పాల్గొన్నారు.

# శిల్పారామంలో కోలాటం, జానపద నృత్యాల సందడి

పీఎం పాలెం, మే 1, ప్రభాతవార్త

విశాఖపట్నం శిల్పారామంలో నిర్వహించే వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా రేపు (02-05-2026, ఆదివారం) సాయంత్రం 6:00 గంటల నుండి రాత్రి 8:00 గంటల వరకు కోలాటం మరియు జానపద నృత్యాల ప్రదర్శనలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ లక్ష్మీ నరసింహ కోలాటం గ్రూప్ కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించనున్నారు. సంప్రదాయ కళలకు ప్రాధాన్యతనిస్తూ ప్రేక్షకులను అలరించే విధంగా ఈ ప్రదర్శనలు ఉండనున్నాయి. ఈ మేరకు శిల్పారామం పరిపాలన అధికారి రమేష్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

# ఎండల తీవ్రత దృష్ట్యా ప్రయాణికులకు మజ్జిగ, మంచినీటి సదుపాయం

విశాఖపట్నం, మే 1, ప్రభాతవార్త

ఎండలు అధికంగా ఉండటంతో ఏపీఎస్ఆర్టీసీ విశాఖపట్నం జిల్లాలో ప్రయాణికుల కోసం ప్రత్యేక చర్యలు చేపట్టింది. బస్ స్టేషన్లతో పాటు ప్రధాన కూడళ్ల వద్ద కూడా మజ్జిగ మరియు శుద్ధమైన తాగునీటి సదుపాయాలను ఏర్పాటు చేసింది. ప్రత్యేకంగా పాత గాజువాక కూడలి, ఓల్డ్ గోశాల కూడలి, మధురవాడ కార్ షెడ్ ఆవరణ వంటి ప్రాంతాల్లో ఈ సదుపాయాలు కల్పించినట్లు అధికారులు తెలిపారు. జిల్లాలోని ముఖ్య కూడళ్ల మధ్య కూడా ఈ సరఫరా కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని డిపో మేనేజర్లు, సూపర్వైజర్లు పర్యవేక్షిస్తున్నారని, ప్రయాణికులకు ఎండల నుంచి ఉపశమనం కలిగించేలా చర్యలు తీసుకుంటున్నామని రీజియన్ మేనేజర్ బి. అప్పలనాయుడు తెలిపారు.



# తృటిలో తప్పిన పెను ప్రమాదం..

## డ్రైనేజీ కాలువను ఢీకొట్టి సర్వీస్ రోడ్డులోకి దూసుకెళ్లిన కారు



ఆనందపురం, మే 2, ప్రభాతవార్త:

ఆనందపురం జాతీయ రహదారిపై శనివారం మధ్యాహ్నం కారు అదుపుతప్పి ప్రమాదానికి గురైన ఘటన కలకలం రేపింది. మిందివానిపాలెం దాటి ఆనందపురం వైపు వస్తున్న కారు ఒక్కసారిగా నియంత్రణ కోల్పోయి రోడ్డు పక్కన ఉన్న డ్రైనేజీ కాలువను బలంగా ఢీకొట్టి సర్వీస్ రోడ్డులోకి దూసుకెళ్లింది. పెందుర్తి వైపు నుంచి వేగంగా వస్తున్న ఈ కారు ప్రమాదంలో పూర్తిగా ధ్వంసమైంది. అయితే కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు స్వల్ప ప్రమాదంతోనే సురక్షితంగా బయటపడటంతో పెను ప్రమాదం తృటిలో తప్పింది. ప్రమాదం కారణంగా సర్వీస్ రోడ్డుపై కొంతసేపు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని దెబ్బతిన్న వాహనాన్ని తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీ కరించారు. ఈ ఘటనతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అధిక వేగం, నిర్లక్ష్య డ్రైవింగ్ కారణంగానే ప్రమాదం జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటనపై ఆనందపురం పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# నాలుగు నుండి అనంతవరంలో పైడితల్లిమ్మ అమ్మవారి ఉత్సవాలు

పద్మనాభం, మే 2, ప్రభాతవార్త



మండలంలో అనంతవరం గ్రామంలో కొలువు దీరిన పైడితల్లిమ్మ అమ్మవారి ఉత్సవాలు ఈ నెల నాలుగు నుండి ఆరు వరకు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ తెలిపింది. 11 సంవత్సరాల తతువాత నిర్వహిస్తున్న ఈ ఉత్సవానికి బారీ సంఖ్యలో రానున్న బందువులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లును సిద్దం చేసినట్లు చెప్పారు. అయితే నియోజకవర్గంలో ఎక్కడా లేని విధంగా సుమారు 45 అడుగుల ఎత్తైన ప్రభ ఊరేగింపు ఈ ఉత్సవం ప్రత్యేకతని చెప్పారు. ఈ ప్రభను చూడడానికి రానున్న ప్రజలకు అనుగుణంగా బారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారన్నారు. ఇప్పటికే రథాలు, ప్రభను సిద్దం చేసారు. అలాగే గ్రామంలో ఉన్న అన్ని గ్రామదేవతల గుడిలకి రంగులు వేసి ముస్తాబు చేసారు. అలాగే నాలుగున తొలేలు, ఐదున అనుపోత్సవం, అరున కుంకుమ పూజలు జరుగు తాయని అన్నారు. ఈ ఉత్సవంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. అలాగే తాగునీటి కొరత రాకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఉత్సవంను విజయవంతం చేయాలని కోరారు.

# ఘనంగా మాధవ యువజన సమాజం 80వ వార్షికోత్సవం

మాధవధార, మే 2, ప్రభాతవార్త



మాధవధారలో గల మాధవ యువజన సమాజం ఆవరణలో శుక్రవారం మాధవ యువజన సమాజం 80వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వార్డు మాజీ కార్పొరేటర్ వావిలిపల్లి ప్రసాద్, 51 వ వార్డు టిడిపి అధ్యక్షులు సనపల కీర్తి,బిజెపి విశాఖ జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు బగాది శ్యామల పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వ్యక్తలు మాట్లాడుతూ మాధవధార గ్రామంలో పూర్వీకులు ఎంతో ఆలోచనతో మాధవ యువజన సమాజ వ్యవస్థని ఏర్పాటు చేశారని, వారి ఆలోచనలను ఆచరణలో పెట్టి వ్యవస్థను నేటితరం గ్రామస్తులు ముందుకు తీసుకువెళ్లాలన్నారు. గ్రామంలో ప్రజలందరూ కలిసికట్టుగా ఉండి గ్రామ ఐక్యతకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన పలు క్రీడా పోటీలలో గెలుపొందిన వారికి ముఖ్య అతిథులు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. వార్షికోత్సవ సందర్భంగా సమాజ భవనానికి విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు. కార్యక్రమంలో కన్వీనర్ సనపల రాంగోపాల్, పప్పుల రామచంద్రరావు, సనపల నరసింహస్వామి, కంచరాన రమేష్, నంబాళ్ల అశోక్ బాబు,అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.



# పద్మనాభం మండలంలో ఈదురు గాలలతో కురిసిన వర్షం

పద్మనాభం, మే 1, ప్రభాతవార్త

మండలంలో పలు గ్రామాలలో శుక్రవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో ఉదయం నుంచి మండే ఎండలకు ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. పిల్లలు, వృద్దులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఈదురు గాలులతో కురిసిన వర్షానికి అనంతపద్మనాభస్వామి ఘాట్ రోడ్డు ప్రారంభంలో ఉన్న ముఖద్వారం కటౌట్, అలాగే పలు జంక్షనులలో ఉన్న కటౌట్లు నేలకొరిగాయి. సంక్రాంతి పండగ నుండి వర్షాలు లేకపోవడంతో రైతులు వేసవి దుక్కులు కూడా దున్నుకోలేకపోయారు. అయితే ఈ వర్షం తొలకరి పనులకు బాగా ఉపయోగపడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే పద్మనాభం గోస్తనీనది బ్రిడ్జి గోతుల పడడంతో ఈ వర్షానికి చెరువులా మారింది.

# లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో బైక్ ప్రమాదం..యువకుడు మృతి

ఆనందపురం, మే 2, ప్రభాతవార్త



ఆనందపురం జాతీయ రహదారిపై శనివారం మధ్యాహ్నం విషాదకర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుని ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. లారీని ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి లారీని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా గుర్ల మండలం పల్లిగంట్రేడు గ్రామానికి చెందిన డి. ఈశ్వరరావు (35) ఏపీ 40 డీజే 2530 నంబర్ గల ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్నాడు. ఈ క్రమంలో ఆనందపురం మండలం మిందివానిపాలెం సమీప జాతీయ రహదారిపై ముందుగా వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేయడానికి ప్రయత్నించగా ప్రమాదానికి గురయ్యాడు. ప్రమాదం తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఈశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనతో ఆ ప్రాంతంలో ఒక్కసారిగా విషాద వాతావరణం నెలకొంది. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించగా, ఆనందపురం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

# అన్నమాచార్య సంకీర్తనతో శ్రీనివాసుని కటాక్షం



విశాఖపట్నం మే 2 ప్రభాతవార్త

ద్వారకానగర్ శంకరమఠంలో శ్రీమన్నారాయణ అన్నమయ్య పదకోలాటం వ్యవస్థాపకురాలు పి నాగలక్ష్మి ఆధ్వర్యంలో అన్నమాచార్యుల వారి జయంతి ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీనియర్ న్యాయవాది శంకరమఠం కోశాధికారి కె నరసింహమూర్తి జ్యోతిని వెలిగించి ప్రారంభించారు . ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్న ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం వి రాజశేఖర్ సభికులను భక్తులను ఉద్దేశించి ప్రసంగిస్తూ అన్నమాచార్య సంకీర్తనలు ఎవరైతే భక్తిశ్రద్ధలతో గానం చేస్తారో వారికి శ్రీనివాసుని ( శ్రీహరి ) కటాక్షం కలుగుతుందన్నారు . పరమాత్ముని చేత అనుగ్రహించబడిన ఈ మానవజన్మను ఆధ్యాత్మిక చింతనతో సార్ధకత చేసుకోవాలన్నారు . క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం అన్నమాచార్య జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నప నిర్వాహకులను అభినందించారు . సంస్థ మహిళా సభ్యులు ఆలపించిన అన్నమాచార్య సంకీర్తనలు ప్రదర్శించిన కోలాటం అందరినీ ఆకట్టుకున్నాయి . వేడుకగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఎన్ రాజు , ఎం రూపవాణి , ఎల్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు . సంస్థ తరపున నిర్వహించిన సాంస్కృతిక పోటీలలో విజేతలుగా నిలిచిన వారందరికీ కె నరసింహమూర్తి గారి చేతుల మీదుగా బహుమతులను అందజేయడం జరిగింది .









# ముస్లింల సంక్షేమానికి టీడీపీ పెద్ద పేట

విశాఖపట్నం, మే 2, ప్రభాతవార్త






ముస్లింల సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ పెద్దపీట వేస్తోందని పార్టీ కోసం కష్టపడి పని చేసే ప్రతీ ఒక్కరికీ తగిన గుర్తింపు ఇస్తోందని శాసనమండలి మాజీ చైర్మన్, రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ వ్యవహారాల సలహాదారు ఎం ఏ షరీఫ్ పేర్కొన్నారు. విశాఖ ముస్లిం కమ్యూనిటీ శనివారం కోటవీధిలోని డీన్ షాదీఖానాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ మైనారిటీ వ్యవహారాల సలహాదారునిగా క్యాబినెట్ హోదాలో నియమితులైన ఎంఏ షరీఫ్, తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులుగా నియమితులైన మహ్మద్ నజీర్, ఇటీవల నామినేటెడ్ పోస్టులు, పార్టీ పదవులు పొందిన వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ లు ముస్లింల ప్రయోజనాల పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లోనే ఎన్డీఏతో స్నేహం కొనసాగిస్తున్నప్పటికీ ముస్లింల హక్కుల విషయంలో రాజీ పడడం లేదని అన్నారు. పార్టీ కోసం కష్టపడి పని చేసే వారికి తగిన గుర్తింపు, ప్రాధాన్యత ఉంటుందని మతసామరస్యం కాపాడ్డం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని అన్నారు. రాష్ట్రంలో గత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజల జీవితాలతో ఏ విధంగా ఆడుకుందో తెలిసిందేనని అన్నారు. జామియా మసీదు ఆస్తుల విషయమై ప్రభుత్వంతో చర్చించనున్నట్లు చెప్పారు తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు మహమ్మద్ నజీర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో రాజకీయంగా ఎదగడం అత్యంత క్లిష్టమైన విషయమని అన్ని రంగాల్లోనూ వెనుకబడి ముస్లింలకు తెలుగుదేశం పార్టీ మాత్రమే సముచితమైన ప్రాధాన్యత ఇస్తోందని ముస్లింలకు స్వేచ్ఛ ఎక్కువగా కల్పిస్తోందని అన్నారు. వుడా మాజీ చైర్మన్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్. ఏ.రహమాన్ మాట్లాడుతూ విశాఖపట్నం జిల్లాలో ముస్లిములకు కేటాయించిన ఆస్తులు, వక్ఫ్ ఆస్తులను గాడిలో పెట్టినట్లయితే వాటి ద్వారా వచ్చిన ఫలాలు ముస్లిం కమ్యూనిటీకి ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు ముస్లింలు రాజకీయంగా వెనుకబడి ఉన్నారని నియోజకవర్గాల వర్గీకరణ నేపథ్యంలో విశాఖపట్నంలోని ఒక నియోజకవర్గం ముస్లిం మైనార్టీలకు కేటాయించాలని కోరారు. ఎస్సీ ఎస్టీ తరహాలో ముస్లింలకు కూడా రాజకీయ రిజర్వేషన్లు ఉండాలని అన్నారు. ముస్లింల కోసం నిరంతరం శ్రమిస్తున్న షరీఫ్ ను రాజ్యసభకు పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సాదిక్, రహమతుల్లా బేగ్,మహమ్మద్ రఫీ, హమీద్, గౌస్ ఖలీషా, అబ్దుల్ చిన్న రహమాన్, , నర్గీష్ తదితరులు పాల్గొన్నారు.




# నిర్మాత సత్యనారాయణరాజుకి దక్కిన దాసరి లెజండరీ ఫిల్మ్ అవార్డు

పద్మనాభం, మే 2, ప్రభాతవార్త

మండలంలో కుర్రపల్లి గ్రామానికి చెందిన సినీ నిర్మాత రాజాసాగి సత్యనారాయణ రాజుకు దాసరి లెజండరీ ఫిల్మ్ అవార్డును శుక్రవారం హైదరాబాదు ప్రసాదు ల్యాబ్ లో జరిగిన ఫిల్మ్ అవార్డు కార్య క్రమంలో ప్రముఖ దర్శకుడు బోయపాటి శ్రీనివాస రావు ప్రధాన చేసారు. భీమవరం టాకీస్ అధినేత, తెలుగు ఫిల్మ్ కౌన్సిల్ ప్రంఉఖ సభ్యులు తుమ్మలపల్లి రామ సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఈ అవార్డుల ప్రధాన కార్యక్రమం జరిగింది. అయితే ఒక్కడే వీరుడు అల్లూరి సీతారామరాజు చిత్రంను వాస్తవానికి దగ్గరగా తీయడంతో ఈ అవార్డును నిర్మాత సత్యనారాయణ రాజుకు అందజేసారు.







## వార్త VAARTHA CLASSIFIEDS

### CHANGE OF NAME

★ I, NADIMPALLI NANDA KISHORE BABU S/O NADIMPALLI RAMA KRISHNAM RAJU previously called NADIMPALLI KISHORE BABU R/O 55-8-33/8, KRM COLONY,SEETHAM-MADHARA, VISAKHAPATNAM, now changed my name from NADIMPALLI KISHORE BABU to NADIMPALLI NANDA KISHORE BABU. Henceforth I will be called as NADIMPALLI NANDA KISHORE BABU for all purposes. (Ro.No.4235)

★ I, VALLENTYNE HEMA NALINI D/o MICHALE VIJAY RAJ VALLENTYNE W/o GANJI GURUNADHA RAO, R/o 411, Sri Rama Heights, Gajuwaka Road, Ramannapalem, Chodapalle, PO: Chodapalle, DIST: Anakapalli, Andhra Pradesh-531011, have changed my name and shall hereafter be known as GANJI HEMA NALINI. (Ro.No.4294)

★ I, NARAVA DEVI USHA JAMA W/O NARAVA GOPALA KRISHNA previously called DEVI USHA NARAVA R/O 1-6-79/2, RAMALAYAM STREET, AKKIREDDY PALEM, VISAKHAPATNAM, now changed my name from DEVI USHA NARAVA to NARAVA DEVI USHA JAMA. Henceforth I will be called as NARAVA DEVI USHA JAMA for all purposes. (Ro.No.4237)

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

3vzm15:3vzm15.qxd 03-05-2026 00:25 Page 1



విజయనగరం పార్వతీపురం మన్యం 25 వార్త

## క్యాన్సర్ వైద్యశిబిరానికి విశేష స్పందన



బొబ్బిలి, మే 2, ప్రభాతవార్త; గొంగాడవలసలో గ్రామ సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరంకు విశేష స్పందన లభించింది. మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ విశాఖపట్నం వారి సహకారంతో ఉచిత క్యాన్సర్ శిబిరం వైద్యులు డాక్టర్ యు వై రజిని ప్రియ మెడికల్ ఆంకాలజిస్ట్ వందమంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. 15 మందికి తదుపరి పరీక్షల కోసం విశాఖ మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పటల్ కి రిఫర్ చేశారు ఈ శిబిరంలో రొమ్ము క్యాన్సర్ గద్వాల్ క్యాన్సర్ నోటి క్యాన్సర్ నిర్ధారణ కొరకు మామోగ్రామ్. పాప్ స్మెర్ వెల్లో స్కోప్ పరీక్షలు నిర్వహించారు. మండల పరిధిలో అనేక గ్రామాలు బొంగడవలస గ్రామ సేవా సమితి ప్రతినిధి గొంగాడు శంకర్రావు ను అభినందించారు. డాక్టర్ భవాని చాందిని పిఆర్ఓ సుమన్ గ్రామ యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## చౌదంతివలసలో రామమందిరం ప్రతిష్ట



దత్తిరాజేరు , మే 2, ప్రభాతవార్త : మండల పరిధిలో గల చౌదంతివలస గ్రామంలో నూతనంగా నిర్మించిన రామ మందిరం ప్రతిష్ట కార్యక్రమాన్ని భక్తులు శనివారం అంగరంగ వైభవంగా పూజలు చేశారు. ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు దంపతులు గ్రామంలో ఉన్న భక్తులు మరియు దంపతులు అందరూ పూజలో పాల్గొన్నారు. వీరికి వేద పండితులు మంత్రోచ్చారణ జరిపిఅభిషేకాలు పూజలు చేశారు. రామ మందిరంప్రతిష్ట కార్యక్రమానికి చేయవలసిన పూజలన్నీ పురోహితులు చేశారన్నారు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేస్తున్నారు. విగ్నేశ్వర పూజలు మండపాల వద్ద హోమం పూజలు రుద్రాభిషేకాలు వంటి పూజలు పురోహితులు జరిపిస్తున్నారు. ప్రతిష్ట కార్యక్రమానికి పలు రాజకీయ నాయకులు హాజరవుతారని ఎంపీపీ తెలిపారు.

## జనసేన బలోపేతం కోసం నాదెండ్లతో భేటీ



సాలూరు , మే 2 ప్రభాతవార్త : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం నాదెండ్ల భాస్కరరావు మృతికి సంతాపం తెలియజేయడానికి ఇంతకు ముందు హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో నివాసం ఉంటున్న నాదెండ్ల మనోహర్ ను మన్యం జిల్లా జనసేన పార్టీ ఇన్చార్జ్ ఆదాడ.మోహన్,జనసేన నేత గుమ్మా నాగర్జున కలసి తమ ప్రగాఢ సానుభూతిని తెలియ జేసారు. అంతేకాకుండా శుక్రవారం సాయంకాలం మళ్లీ మనోహర్‌తో భేటీ అయ్యి తమ జిల్లాలో ఇంకా నియోజకవర్గంలో జనసేన పార్టీ బలోపేత భవిష్యత్ కార్యాచరణ గురించి చర్చించారు. అందులో భాగంగ ఈనెలాఖరు సాలూరు పట్టణ ఐదో వార్డులో జనసేన పార్టీ ఎమ్మెల్యేలు,ముఖ్య అధినేతలు అతిధులుగా బహిరంగ సభ అలాగే కొన్ని కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని ఆయనకు తెలిపారు.దీనికి సానుకూలంగా స్పందించి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినందుకు మంత్రి నాదెండ్ల మనోహరకు పత్రికా ముఖంగా కృతజ్ఞతలు తెలియ జేస్తున్నామని స్థానిక విలేకరులకు గుమ్మా. నాగర్జున తెలియజేసారు.

## పెదపెంకిని సందర్శించిన సబ్‌కలెక్టర్



బలిజిపేట , మే 2 ప్రభాతవార్త : మండలంలో అధిక జనాభా గల గ్రామం కావడంతో అక్కడ సరైన డ్రైనేజీ సిస్టం పని చేయకపోవడంతో అనారోగ్య పాలో అవుతుంటే మరియు అధిక సంఖ్యలో బోదకాలు (ఫిలేరియా) తో బాధపడుతున్న వ్యాధిగ్రస్తులు గ్రామంలో నివసిస్తున్నారు దీన్ని దృష్టిలో ఉంచుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ సీఎం ఈ గ్రామానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో అభివృద్ధికై గ్రామ అభివృద్ధికి జాతీయ ఉపాధి హామీ పథకం క్రింద ప్రత్యేక నిధులు ఐదు కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగింది. అభివృద్ధికి తోడ్పడే విధంగా నిధులు ఏ విధంగా జరుగుతున్నాయా లేదా పరిశీలించడానికి పార్వతిపురం మన్యం జిల్లా సబ్ కలెక్టర్ ఆర్ వైశాలి మరియు జాయింట్ కలెక్టర్ యశ్వంత్ కుమార్ రెడ్డి కలిసి వివిధ శాఖల వారీగా ఆరా తీసి అభివృద్ధి కార్యక్రమం ఏ విధంగా అమలు చేస్తున్నారు. ప్రతి శాఖను అడిగి తెలుసుకున్నారు. స్వయంగా గ్రామంలో ఏ విధమైనటువంటి లోటుపాట్లు లేకుండా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు హెచ్చరించారు. కార్యక్రమంలో మండల పరిషత్తు అధికారిని వాణిశ్రీ మండల తాసిల్దార్ బాలమురళీకృష్ణ డిప్యూటీ ఎంపీడీవో పుష్పారావు జాతీయ ఉపాధి హామీ అధికారి కె కేశవరావు నీటిపారుదల ఏయ్ శ్రావణ్ కుమార్ ఎలక్ట్రికల్ సిబ్బంది రెవెన్యూ గ్రామ సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు.

## స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ సర్టిఫికెట్స్ పంపిణీ




సాలూరు, మే2, ప్రభాత వార్త: సాలూరు పట్టణ పెద్దకుమ్మర పేటలో ఉన్న భాగ్యలక్ష్మి సేవా సమితి డెవలప్మెంట్ (బిఎల్ఎస్) వారి ఆఫీస్‌లో యువతకు ఔత్సహిక పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దే ప్రోగ్రాంలో భాగంగ బ్రిడ్జ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ప్రోత్సాహంతో కె.భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో 30 మంది మహిళలకు శిక్షణ ఇవ్వడం జరిగింది.అందులో భాగంగా శుక్రవారం సాయంత్రం భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో శిక్షణ సర్టిఫికెట్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించగా ముఖ్య అతిధి వెటర్నరీ డాక్టర్ వెంకటరమణ చేతుల మీదుగా స్కిల్ డెవలప్మెంట్ సర్టిఫికెట్స్ శిక్షణపొందిన మహిళలకు అందజేశారు.అనంతరం ఆయన మాట్లాడుతు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా బ్యాంకు రుణాలు పొంది వ్యాపార అభివృద్ధిచెందాలన్నారు. వెటర్నరీ అసిస్టెంట్ ప్రభాకర్ మహిళలు పాల్గొన్నారు.

## ధ్యానంతో మానసిక ప్రశాంతత




గరివిడి, మే2, ప్రభాత వార్త: ధ్యానంతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని ప్రతీ ఒక్కరూ ధ్యానం అలవర్చుకోవాలని బ్రహ్మ కుమారి హేమ లత అన్నారు. గరివిడి అవంతీస్ సెయింట్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో వారం రోజులు పాటు బ్రహ్మ కుమారి కేంద్రం ఆధ్వర్యంలో కళాశాల అధ్యాపకులకు నిర్వహించిన మెడిటేషన్ తరగతులు శనివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో హేమ లత మాట్లాడుతూ మెడిటేషన్ ప్రతీ ఒక్కరు జీవితంలో బాగమవ్వాలని పేర్కొన్నారు. కాగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.బాల భాస్కర రావు వారం రోజుల శిక్షణలో తాము పొందిన అనుభవాలను పంచుకుంటూ ఆత్మ పరమాత్మ, సృష్టి,జీవితం వంటి అంశాలను తరగతుల్లో అవగతం చేసుకున్నామన్నారు. అలాగే అధ్యాపకులు కేవలం తరగతి గదికి పరిమితం కాకూడదని విలువలు, జీవన నైపుణ్యాల అంశాలపై దృష్టి కేంద్రీకరించాలని అన్నారు. ఏకాగ్రత, ఒత్తిడి నియంత్రణ, మానసిక ప్రశాంతత కు ధ్యానం అనివార్యమని పేర్కొన్నారు. వారం రోజులు శిక్షణ అధ్యాపకుల్లో కొత్త అనుభూతి ని,సరికొత్త ఆలోచనలకు రూపకల్పనగా నిలిచిందని ప్రిన్సిపాల్ స్పష్టం చేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.వెంకట రమణ, పరిపాలనా ధికారి గరికపాటి అనీల్ కుమార్, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

## పేదవాడికి అండగా సీఎం సహాయ నిధి పథకం : ప్రభుత్వ విప్



కురుపాం, మే 2, ప్రభాతవార్త: సీఎం సహాయ నిధి పేదవానికి అండగా నిలుస్తుందని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. శనివారం తన క్యాంప్ హౌస్ లో సీఎం సహాయ నిధి చెక్కును అందజేశారు. నియోజకవర్గం, కురుపాం గ్రామానికి చెందిన కోట పద్మ అనారోగ్యానికి గురైన విషయం ఎమ్మెల్యే దృష్టికి రాగా, వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో కోట పద్మ కు రూ.32,756/ విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలు అనారోగ్యం వంటి ఆపద్బాంధవ పరిస్థితుల్లో ఉన్నప్పుడు ప్రభుత్వం అండగా నిలవడం తమ బాధ్యత అని అన్నారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని, అవసరమైన వారికి సహాయం అందేలా నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి విజయనగరం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డొంకాడ రామకృష్ణ, మండల కన్వీనర్ కె.వి.కొండయ్య, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్ , తదితరులు పాల్గొన్నారు.

## లక్కవరపుకోట మండలంలో జనగణన ప్రారంభం



లక్కవరపుకోట, మే 2, ప్రభాత వార్త : భారత ప్రభుత్వం దేశవ్యాప్తంగా జనాభా గణన చట్టం 1948 ప్రకారం జనగణన - 2027 కార్యక్రమాన్ని ప్రారంభించినది. ఈ సందర్భంగా ఎల్ కోట మండలంలో అధికారులు శనివారం నుంచి ఈ జనగణనను అధికారికంగా ప్రారంభించడం జరిగింది కార్యక్రమంలో తహసీల్దార్ టీ రమేష్ ఎంపీడీఓ అల్లు భాస్కర్ రావు లు పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ జన గణన రెండు దశల్లో నిర్వహించబడును అని . మొదటి దశగా గృహ జాబితా, గృహాల లెక్కింపు కార్యక్రమం 01.05.2026 నుండి 30.05.2026 వరకు ఉంటుంది అన్నారు మండలంలో ప్రభుత్వం నియమించిన గణకులు (ఏనుమిరేటర్స్ ) మరియు పర్యవేక్షకులు (సూపెర్వైసర్స్) ద్వారా జనగణన పనులు నిర్వహించడం జరుగుతుంది అని తెలిపారు ఈ దశలో ఇళ్ల వివరాలు, భవనాల స్థితి, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, వంటగ్యాస్, ఇంటర్నెట్ సౌకర్యం, గృహ సదుపాయాలు మరియు ఇతర వివరాలు సేకరించబడును అని. ప్రజలు అందించే సమాచారం జనగణన చట్టం ప్రకారం గోప్యంగా ఉంచబడును అని తెలిపారు. మండల ప్రజలందరూ సహకరించగలరు: గణకులకు పూర్తి సహకారం అందించాలి. సరైన సంపూర్ణ సమాచారం ఇవ్వాలి.గణకుల గుర్తింపు కార్డు పరిశీలించిన తరువాత మాత్రమే వివరాలు ఇవ్వాలిఅని . సర్వే సమయంలో ఇంటిలో గల కుటుంబ పెద్ద ద్వారా సమాచారం సేకరించబడును.అని గ్రామ/వార్డు సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు ప్రజలందరూ జనగణన - 2027 కార్యక్రమాన్ని విజయవంతం చేయుటకు సహకరించవలసింది అని తహసీల్దార్ ప్రజలకు సూచించారు శనివారం రంగారాయపురంలో జరుగుతున్న జనగణన చేస్తున్న తీరును పరిశీలించి సచివాలయం సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమం లో తహసీల్దార్ టి రమేష్ ఎంపీడీఓ ఏ భాస్కర్ రావు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు .

## అంగన్‌వాడీ పోస్టులకు 14 లోగా దరఖాస్తులు చేసుకోవాలి



గరుగుబిల్లి, మే 2, ప్రభాతవార్త: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఖాళీగా ఉన్న ఏడు అంగన్వాడీ హెల్పర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని కొమరాడ ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి గొట్టాపు సుగుణ కుమారి వెల్లడించారు. ఈమేరకు మంగళవారం స్థానిక విలేకరులకు వివరాలను ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి గొట్టాపు సుగుణకుమారి తెలియజేశారు. మండల పరిధిలోని ఏడు గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాల పరిధిలో హెల్పర్ పోస్టులు భర్తీకి సంబంధించి ప్రస్తుతం నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందన్నారు. నాగూరు కాలనీ లోని అంగన్వాడి హెల్పర్ పోస్ట్కు సంబంధించి రోస్టర్ ప్రకారం ఎస్సి అభ్యర్థికి కేటాయించడం జరిగింద న్నారు. అదే విధంగా శివరాంపురం గ్రామంలోని హెల్పర్ పోస్టు ఎస్సి లకు కేటాయించడం జరిగిందన్నారు. తులసిరామినాయుడువలస గ్రామంలోని అంగన్వాడి హెల్పర్ పోస్ట్ ను ఈడబ్ల్యూఎస్కు కేటా యించడం జరిగిందని పిఓ సుగుణ కుమారి పేర్కొన్నారు. శివ్వాం గ్రామం లోని అంగన్వాడి కేంద్రం (1), కారివలస గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం పరిధి లోని హెల్పర్ పోస్ట్ లను ఓసీలకు కేటాయిం చడం జరిగిందన్నారు. సంతోషపురం పంచాయతీ పరిధిలోని ఖడ్గవలస గ్రామంలోని అంగన్వాడి హెల్పర్ పోస్టు బిసి (బి)కి కేటాయించడం జరిగిందన్నారు.

## భట్రాజుల సంక్షేమానికి చర్యలు చేపట్టాలి



విజయనగరం, మే 2, ప్రభాతవార్త : భట్రాజుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని భట్టాజల సంక్షేమ సంఘం నాయకుడు సిహెచ్ సి ఎస్ వి రాజు కోరారు. అంకిత కమిషన్ చైర్ పర్సన్ రాజీవ్ రంజన్ మిశ్రాను ఆయన శనివారం నేరుగా కలిశారు. బట్రాజుల సంక్షేమానికి సంబంధించి తీసుకోవలసిన చర్యలపై పలు అంశాలకు సంబంధించి వినతిపత్రం అందజేశారు.భట్రాజు సంఘం ప్రాధాన్యత, అభివృద్ధి కార్యకలాపాలు, సబ్సిడీ రుణాలు, ప్రభుత్వ నామినేటెడ్ పోస్టులలో తగిన ప్రాధాన్యత, భట్రాజు కార్పొరేషన్ డైరెక్టర్ల విస్తరణపై వ్రాతపూర్వక ప్రాతినిధ్యం అందించిన్నట్లు రాజు తెలిపారు.

## స్వర్ణ గ్రామ సచివాలయాల తనిఖీ



గరివిడి, మే2, ప్రభాతవార్త : మండలం లోని అర్తమూరు, కోనూరు, గెడ్డపువలస, తాటి గూడ స్వర్ణ గ్రామ సచివాలయాలను జిల్లా పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు, గరివిడి మండల ప్రత్యేక అధికారి డాక్టర్ ఎన్. దామోదర రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా కార్యాలయాల్లో రికార్డులను పరిశీలించారు. సచివాలయ సిబ్బంది పనితీరు పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజానీకానికి అందుబాటులో ఉండి పనులు సకాలంలో నిర్వహించాలని సూచించారు.

## హెల్మెట్ ధరించిన వారికి యాపిల్ పండు అందజేత.



దత్తిరాజేరు, మే 2 ప్రభాతవార్త : హెల్మెట్ వేసుకొని ప్రయాణం చేస్తే సురక్షితంగా గమ్యానికి చేరుకోవచ్చని గజపతినగరం సర్కిల్ ఇన్స్పెక్టర్ సన్యాసినాయుడు అన్నారు. శనివారం మానాపురం సంతను సందర్శించారు. అక్కడ వాహనదారులకు ట్రాఫిక్ పట్ల అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వాడకం , దాని ఉపయోగం ప్రయోజనాలను వివరించారు. హెల్మెట్ ధరించి ప్రయాణం చేస్తున్న వారికి గుర్తుగా ఒక యాపిల్ పండును అందించి సురక్షతంగా వెళ్లాలన్నారు. ప్రతి ఒక్క వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. వాహనాల తనిఖీల్లో భాగంగా వాహన దారులకు పత్రాలు లేకపోయినా హెల్మెట్ పెట్టకపోయినా కేసులు రాస్తారు. కానీ గజపతినగరం సీ.ఐ కేసులు రాయకుండా హెల్మెట్ ధరించిన వాహనదారులకు ఆపిల్ పండు ఇవ్వడంతో వాహనదారులు ఆయనకి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై కుమార్ నాయుడు ఏ ఎస్ ఐ పోలీసులు పాల్గొన్నారు.

## చిన్నారులకు చిత్రలేఖనం పోటీలు



తెర్లాం,మే2, ప్రభాతవార్త) : గ్రంథాలయంలో వేసవి విజ్ఞానం శిబిరం ఏర్పాటులో భాగంగా శనివారం పిల్లలకు చిత్రలేఖనం పోటీలు గ్రంధాల అధికారి సిహెచ్ కృష్ణమూర్తి ఏర్పాటు చేశారు . ఈ సందర్భంగా పిల్లలలో కళా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఆయన చేస్తున్న కృషి అభినందనీయం. విద్యార్థులకు పిల్లలకు కళల పట్ల మక్కువ కలిగేలా చిత్రలేఖనం వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాల పై ఆకర్షతు లయ్యేందుకు పలు రకాల పోటీలు ఏర్పాటు చేయడం విశేషం. గ్రంథాలయం పట్ల విద్యార్థులకు పుస్తక పఠనం చేయించడం తద్వారా జ్ఞానం పెంపొందించేందుకు విశేష కృషి చేయడం అభినందనీయమని గ్రంథాలయ పాఠకులు ప్రజలు భావించడం మరో విశేషం. ఈ వేసవిలో పిల్లలకు వివిధ రకాల పోటీలు ఏర్పాటు చేసి ఉల్లాసం ఉత్సాహం కలిగేలా వ్యాస రచన వ్యక్తి త్వం డాన్స్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి ముగింపు సమావేశంలో బహుమతులు అందించడం గ్రంథాలయ సంస్థ నిర్వహించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## వందశాతం ఉత్తీర్ణత సాధించడం అభినందనీయం



బొబ్బిలి, మే 2, ప్రభాత వార్త ): బొబ్బిలి మండలం పక్కి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల గత మూడు సంవత్సరాలుగా పదో తరగతి ఫలితాల్లో 100 ఉత్తీర్ణత సాధించి సందర్భంగా ఈరోజు ఉదయం బొబ్బిలి నియోజకవర్గ మాజీ శాసన సభ్యులు శంబంగి వెంకట చిన్న అప్పలనాయుడు కేక్ కట్ చేసి ఉపాధ్యాయులను, విద్యార్థులను అభినందనలు తెలియజేశారుఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక ప్రభుత్వ పాఠశాల ఇలాంటి ఫలితాలు సాధించడం వల్ల గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని అన్నారు. ప్రధానోపాధ్యాయులు రిజుశీవి రాజు ఇతర ఉపాధ్యాయులకు మరియు కష్టపడి చదివిన విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలియచేసారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఇలాంటి విజయాలు ఎంతో స్ఫూర్తినిస్తాయని అన్నారు.

## జిందాల్ భూ దోపిడీపై విచారణ చేపట్టాలి




శృంగవరపుకోట, మే 2, ప్రభాత వార్త : మండలంలోని బొడ్డవర ప్రాంతంలో జిందాల్ భూదోపిడి అవినీతిపై సమగ్రమైన విచారణ చేపట్టాలని అప్పుడే అన్ని నిజాలు బయటపడతాయని జిందాల్ నిర్వాసితులు డిమాండ్ చేశారు.శనివారం చేపట్టిన నిరసన కార్యక్రమంలో నిర్వాసితులు మాట్లాడుతూ జిందాల్ యాజమా న్యం, జిల్లా యంత్రాంగంపై విమర్శలు గుప్పించారు.జిందాల్ సంస్థ చేస్తున్న అక్రమాలు రోజుకోకటి వెలుగులోకి వస్తున్నా జిల్లా కలెక్టర్ స్పందించకపోవడంపై నిర్వాసితులు మండిపడ్డారు.చీడిపాలెంలోని సర్వే నంబర్ 11లో అటవీ భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని అలాగే కిల్తంపాలెంలోని సర్వే నంబర్ 189లో ఉన్న పి.ఓ.టి భూములకు సంబంధించి భారీ కుంభకోణం జరిగిందని ఆరోపించారు.స్థానిక నిర్వాసితులకు అర్హులకు కాకుండా బినామీ పేర్లతో రికార్డుల్లో ఉద్యోగాలు సృష్టించి మోసాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.న్యాయం కోసం చావుకైనా సిద్ధమని తమ భూములు వదిలేది లేదని స్పష్టం చేసారు.జిందాల్ వ్యవహారాలపై తక్షణమే సమగ్ర విచారణ జరిపించాలని అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని నిర్వాసితులు డిమాండ్ చేశారు.

## ఇంటి గణనకు సహకరించాలని విజ్ఞప్తి



పార్వతీపురం, మే 2, ప్రభాతవార్త: మొదటి దశ గృహ గణన్థ కార్యక్రమం మే 1వ తేదీ నుండి ప్రారంభం అయింది. ప్రభుత్వం నియమించిన ఎన్యూమరేటర్లు మే 1 నుండి 30వ తేదీ వరకు ప్రతి ఇంటినీ సందర్శించి వివరాలను సేకరిస్తున్నారు ఇంటి గణన వివరాలు సేకరణకు వచ్చిన అధికారులకు పూర్తి సమాచారం అందజేయాలి అని జిల్లా కలెక్టర్ డా ఎన్ ప్రభాకర రెడ్డి అన్నారు. ఈ మొదటి దశలో ప్రధానంగా గృహాల స్థితిగతులు మరియు అందుబాటులో ఉన్న వసతులపై దృష్టి సారిస్తారు. ఎన్యూమరేటర్లు సేకరించే అంశాలు కుటుంబ యజమాని పేరు, ఇంట్లోని వ్యక్తుల సంఖ్య మరియు వివాహిత జంటల వివరాలు, వాహనాల లభ్యత,కుటుంబం ఉపయోగిస్తున్న ప్రధాన ఆహార ధాన్యాల వివరాలు. జనగణనలోని రెండవ దశను 2027, ఫిబ్రవరి 1 నుండి 28 వరకు నిర్వహించనున్నారు. ఈ దశలో వ్యక్తుల అక్షరాస్యత, సంతానం, వలసలు మరియు ఇతర సామాజిక, ఆర్థిక గణాంకాలను సేకరిస్తారు. ప్రజలు అందించే వివరాలన్నీ అత్యంత గోప్యంగా ఉంచబడతాయి.

## సివినిలో మెగా కార్డన్ సెర్చ్



కొమరాడ, మే 2, ప్రభాత వార్త: మాదకద్రవ్యాల నియంత్రణకు చేపట్టిన ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా సివిని గ్రామంలో శనివారం మెగా కార్డన్‌సెర్చ్ ఆపరేషన్‌ను కొమరాడ పోలీసులు నిర్వహించారు. మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా మరియు సంబంధిత నేరాలను అరికట్టడమే లక్ష్యంగా ఈ ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నట్లు పార్వతీపురం సీఐ రంగనాథ్ తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగం జరుగుతున్నట్లు అనుమానం ఉన్న ప్రాంతాలు, అద్దె ఇళ్లు, ఇతర అనుమానాస్పద ప్రదేశాలలో పోలీసులు సోదాలు నిర్వహించారు. ఈ కార్డన్ సెర్చ్ ఆపరేషన్లో భాగంగా మొత్తం 36 మంది పోలీసులు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి ప్రజల వివరాలు, వాహనాల వివరాలు మరియు అనుమానాస్పద వ్యక్తులపై పరిశీలన చేపట్టారు.ఈ ఆపరేషన్లో భాగంగా: మొత్తం 50 మంది వ్యక్తులను, 30 వాహనాలను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పోలీసు అధికారులు ప్రజలకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక మరియు చట్టపరమైన దుష్పరిణామాల గురించి అవగాహన కల్పించారు. గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని, కుటుంబ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే ఏపీ నితిబిలిని టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. సమాచారం ఇచ్చే వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు.

## సైబర్ నేరాలపై అవగాహన సదస్సు




రామభద్రపురం, మే 2 ప్రభాతవార్త : ఆరికతోట గ్రామ జంక్షన్లో ఎస్ఐ జ్ఞాన ప్రసాద్ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల నివారణ డ్రగ్స్ సైబర్ నేరాలు నివారణ పైన అవగాహనా కార్యక్రమం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఎస్ ఐ మాట్లాడుతు జిల్లా ఎస్పీ ఆదేశాలు మేరకు డ్రగ్స్ మరియు రోడ్డు ప్రమాదాలు నివారణ, సైబర్ నేరాలు , మహిళలు పై నేరాలు వంటి అంశాలు పై ఆటో లోఆరిక తోట దుప్పులపూడి నరసాపురం పాతరేగకొత్తరేగ కోటసెర్ల బూసియ్య వలసగ్రామాలలో ఆటో తోతిరుగుతూ మైక్ సహాయంతో అవగాహన కార్యక్రమం కల్పించడం జరిగింది అని అన్నారు ఈ కార్యక్రమం లో ఎస్ జ్ఞానప్రసాద్ రావు ఐ తో పాటు హెడ్ కానిస్టేబుల్ ఎం సత్యనారాయణ కానిస్టేబుల్ నరేంద్ర సిబ్బంది ఎక్కువ సంఖ్యలో ప్రజలు పాల్గొనడం జరిగింది.

## విశ్రాంత ఉపాధ్యాయుడికి తీవ్ర గాయాలు

చీపురుపల్లి మే 2 : లావేరు రోడ్డు నందు ఉల్లిపేట మెట్టపల్లి గ్రామాల మధ్య శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో విశ్రాంత ఉపాధ్యాయుడు మీసాల వెంకటరమణ గాయాల పాలయ్యారు.. గరివిడి మండలం ఏ పాలవలస గ్రామానికి చెందిన , గరివిడి మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మీసాలు విశ్వేశ్వరరావు సోదరుడు మీసాల వెంకటరమణ. సుభద్రాపురం నుండి చీపురుపల్లి వస్తుండంగా వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం సంభవించినది .. ఈ ప్రమాదంలో విశ్రాంత ఉపాధ్యాయుడు మీసాల వెంకటరమణ తలకు బలమైన గాయం తగిలి రక్తస్రావ గాయమైనది... స్థానికులు సంఘటనను చూసి చలించిపోయి 108 కి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న 108 వాహనము వారు చికిత్స నిమిత్తం చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చీపురుపల్లి సీఐ. శంకర్రావు. ఘటనా స్థలాన్ని. పరిశీలించి తదుపరి చర్యలు చేపట్టారు.

## ప్రజల ఆరోగ్యంతో ఆడుకుంటే చర్యలు తప్పవు : కలెక్టర్

కురుపాం మే 2:ప్రభాతవార్త : జిల్లాలో ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆహార భద్రతా విభాగం తనిఖీలను ముమ్మరం చేసింది. జిల్లా కలెక్టర్ డా ఎన్ ప్రభాకర రెడ్డి శుక్రవారం పర్యటన లో ఆదేశాల మేరకు శనివారం గుమ్మలక్ష్మీపురం లో ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ (డివిజన్1) ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో పలు దుకాణాల్లో గడువు ముగిసిన (ఆహార పదార్థాలు,కూల్ డ్రింక్స్ విక్రయిస్తున్నట్లు గుర్తించి, సంబంధిత వ్యాపారులపై అడ్యుడికేషన్ కేసులు దాఖలు చేశారు. ఏడు ప్రధాన వ్యాపార సంస్థలను తనిఖీ చేయగా, షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి, క్యాంపా కోలా, పెప్సీ, థమ్సప్, 7గేశి వంటి బ్రాండెడ్ కూల్ డ్రింక్స్‌తో పాటు ఎనర్జీ డ్రింక్స్ వందల సంఖ్యలో గడువు ముగిసినా విక్రయానికి ఉంచినట్లు అధికారులు గుర్తించారు, బిర్యానీ పౌడర్, సాంబార్ పౌడర్, సోన్ పాపిడి వంటి ప్యాక్ చేసిన ఆహార పదార్థాలు కూడా ఎక్స్‌పైరీ డేట్ దాటినట్లు కనుగొన్నారు. బుడంకాయల మదన్ కుమార్, పుట్నూరు సుందర్ రావు, బి. నాగరాజు, అందవరపు శ్రీనివాసరావు, డోకి శ్రీధర్, మాజి వెంకటకృష్ణ, చప్పా మాధవ నాయుడు అనే వ్యాపారుల షాపుల్లో నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు రిపోర్టులో పేర్కొన్నారు. ఆహార భద్రతా ప్రమాణాల చట్టం2006 ప్రకారం, గడువు ముగిసిన వస్తువులను విక్రయించడం తీవ్రమైన నేరమని అధికారులు స్పష్టం చేశారు. పట్టుబడిన స్టాక్‌ను సీజ్ చేసి, బాధ్యులపై కేసులు నమోదు చేసినట్లు ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ తెలిపారు.

03-05pg10exHMNWJQEBGV.qxd:03-05pg10exHMNWJQEBGV.qxd 1/1/02 6:51 AM Page 1






# హైదరాబాద్ ఆరేస్తుందా?

## నేడు ఉప్పల్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో మ్యాచ్



**హైదరాబాద్, మే 2(వార్త క్రీడా ప్రతినిధి):** ఉప్పల్ ఇచ్చిన విజయాల బూస్టింగ్‌తో జోరు మీదికొచ్చిన సన్‌రైజర్స్ హైదరాబాద్...జైపూర్, వాంఖడేలోనూ విజయాలు అందుకుంది. వరుస అయిదు విజయాలతో ఊపు మీదున్న ఆరేంజ్ టీమ్... సొంతగడ్డపై మరో మ్యాచ్‌కు సిద్ధమైంది. ఫామ్‌తో సతమతమవుతున్న కోల్‌కతాతో మధ్యాహ్నం మూడున్నర గంటలకు మ్యాచ్ ఆడనుంది. ఈ సీజన్‌ను నెమ్మదిగా ప్రారంభించిన సన్‌రైజర్స్.. తమ తొలి 4 మ్యాచ్‌లలో మూడింటిలో ఓడింది. అయితే బౌలింగ్ విభాగంలో సమూల మార్పులు చేసి గాడిలో పడ్డారు. పాట్ కమిన్స్ సారథ్యంలోని ఈ జట్టు వరుసగా ఐదు మ్యాచ్‌ల విజయ పరంపరలో ఉంది. కోల్‌కతాపై నెగ్గి పతకాల పట్టికలో అగ్రస్థానానికి చేరుకోవడంపై ఫోకస్ పెట్టింది.

సన్‌రైజర్స్ బ్యాటింగ్ భీకరంగా ఉంది.టాప్‌ఆర్డర్ పరుగుల వరద పారిస్తోంది. ముంబై ఇండియన్స్ నిర్దేశించిన 244 రన్స్ టార్గెట్‌ను కూడా ఉఫ్ మనేసింది. అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్ ఫ్లయింగ్ స్టార్ట్ అందిస్తున్నారు. ఇక ఇషాన్ కిషన్ గత మ్యాచ్‌లో గోల్డెన్ డక్‌తో నిరాశపరిచినా ఓవరాల్‌గా చక్కగా ఆడుతున్నాడు. హెన్రిచ్ క్లాసెన్ మ్యాచ్ ఫినిషింగ్‌లతో అదరగొడుతున్నాడు. నితీష్, సలీల్ అరోరా వరకు బ్యాటింగ్ ఆర్డర్ పటిష్టంగా ఉంది. కమిన్స్ నేతృత్వంలోని బౌలింగ్ డిపార్ట్‌మెంట్ కూడా ప్రత్యర్థి జట్లను చక్కగా కట్టడి చేస్తోంది. యంగ్ పేస్ గన్స్ ప్రఫుల్, షాకిబ్, మలింగ వికెట్ల వేటలో ఉన్నారు.

మరో వైపు వరుస పరాజయాలకు ఫుల్‌స్టాప్ పెడుతూ కోల్‌కతా నైట్ రైడర్... గత రెండు మ్యాచ్‌ల్లో పుంజుకుంది. మూడుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన ఈ జట్టు, తమ తొలి ఆరు మ్యాచ్‌లలో ఐదింటిలో ఓడిపోయినప్పటికీ, ఆ తర్వాత వరుసగా రెండు విజయాలు నమోదు చేసింది. లక్నో సూపర్ జెయింట్స్‌ను సూపర్ ఓవర్‌లో ఓడించారు. అయితే బ్యాటింగ్ వైఫల్యం వెంటాడుతోంది. రింకూ సింగ్ తప్పిస్తే మిగతా బ్యాట్స్‌మెన్ అంతా తమ స్థాయికి తగ్గ ఆటతీరు కనబడరచడం లేదు. మతీషా పతిరన తుది జట్టులోకి రానుండటం పెద్ద ఊరటగా నిలవనుంది.

**హెడ్ టు హెడ్ :** సన్‌రైజర్స్‌పై కోల్‌కతాదే ఆధిక్యం. ఇరు జట్లు 31 మ్యాచ్‌ల్లో తలపడగా... సన్‌రైజర్స్ 11 మ్యాచ్‌ల్లో, కోల్‌కతా నైట్ రైడర్స్ 19 మ్యాచ్‌ల్లో గెలుపొందాయి. ఒక మ్యాచ్‌లో ఫలితం రాలేదు. ఈ సీజన్‌లో ఇరుజట్లు తలపడినపుడు సన్‌రైజర్స్ గెలుపొందింది. ఉప్పల్‌లో వరుసగా మూడు మ్యాచ్‌లు నెగ్గిన సన్‌రైజర్స్‌కే హోమ్ అడ్వాంటేజ్ ఉంటుంది.

**పిచ్ రిపోర్ట్:** ఉప్పల్ పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంటుంది. లైన్ అండ్ లెంగ్త్‌కు కట్టుబడి బౌలింగ్ చేయగలిగితే బౌలర్లకు అడ్వాంటేజ్ ఉంటుంది. ఈసీజన్‌లో నాలుగు మ్యాచ్‌లు జరగ్గా సగటు మొదటి ఇన్నింగ్స్ స్కోరు 202. మూడు మ్యాచ్‌ల్లో మొదట బ్యాటింగ్ చేసిన జట్టు గెలుపొందింది.

**సన్‌రైజర్స్ హైదరాబాద్(అంచనా):**అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, ఇషాన్ కిషన్, హెన్రిచ్ క్లాసెన్, సలీల్ అరోరా, అనికేత్ వర్మ, నితీష్ కుమార్ రెడ్డి, పాట్ కమిన్స్ (కెప్టెన్), హర్ష్ దూబే, ప్రఫుల్ హింగే, ఎషాన్ మలింగ. **ఇంపాక్ట్ ప్లేయర్:** సాకిబ్ హుస్సేన్

**కోల్‌కతా నైట్ రైడర్స్(అంచనా):** అజింక్య రహానే (కెప్టెన్), సునీల్ నరైన్, రఘువంశీ, కెమెరూన్ గ్రీన్, రోవ్‌మన్ పావెల్, రింకూ సింగ్, అనుకుల్ రాయ్, రమణదీప్ సింగ్, వైభవ్ అరోరా, కార్తీక్ త్యాగి, వరుణ్ చక్రవర్తి; **ఇంపాక్ట్ ప్లేయర్:** పతిరన

### ముంబై ఇండియన్స్ ప్లే ఆఫ్ ఆశలు గల్లంతు

## చెన్నై ఖాతాలో నాలుగో విక్టరీ



మూడు వికెట్లు తీసి ముంబైను కుప్పకూల్చిన కంబోజ్‌ను అభినందిస్తున్న సహచరులు

**చెన్నై:** టాప్ ఫేవరేట్‌గా బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్ ఈ ఐపీఎల్ సీజన్‌లో తేలిపోతోంది. తాజాగా మరో ఓటమి ఖాతాలో వేసుకుంది. దీంతో ప్లే ఆఫ్ అవకాశాలు దాదాపు గల్లంతయ్యాయి. మరోవైపు సొంతగడ్డపై చెన్నై సూపర్ కింగ్స్...ముంబై ఇండియన్స్‌పై 8 వికెట్ల తేడాతో గెలుపొందింది. 160 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని మరో 11 బంతులు మిగిలి ఉండగానే రెండు వికెట్లు కోల్పోయి అందుకుంది. సంజూ శాంమ్సన్(11)ను ఆరంభంలోనే బుమ్రా బోల్తాకొట్టించాడు. క్రీజ్‌లోకి వచ్చిన ఉర్విల్ పటేల్(12 బంతుల్లో 24) అండగా ముంబై బౌలర్లపై రుతురాజ్ ధాటిగా ఆడాడు. రెండో వికెట్‌కు 49 రన్స్ జోడించాడు. ఉర్విల్ ఔటైన తర్వాత వచ్చిన కార్తీక్ శర్మ(40 బంతుల్లో 54 నాటౌట్) కలిసి విజయాన్ని అందించాడు. ఈ క్రమంలో అర్ధసెంచరీ సాధించిన రుతురాజ్ గైక్వాడ్ 48 బంతుల్లో అయిదు ఫోర్లు, రెండు సిక్స్‌లతో 67 పరుగులతో కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు.

అంతకుముదు టాస్ నెగ్గి మొదట బ్యాటింగ్‌కు చేసిన ముంబై ఇండియన్స్‌ను కంబోజ్ ఆరంభంలోనే దెబ్బతీశాడు. విల్ జాక్స్(10)ను పెవలియన్‌కు చేర్చాడు. ర్యాన్ రికల్టన్(37), సూర్యకుమార్(21) అండగా నమన్ ధిర్(37 బంతుల్లో 57) ఆదుకునే ప్రయత్నం చేశారు. అయితే మిడిల్ ఓవర్లలో ముంబై వేగంగా వికెట్లు కోల్పోయింది. 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 159 పరుగులే చేయగలిగింది. చెన్నై బౌలర్లలో కంబోజ్ మూడు, నూర్ ఆహ్మద్ రెండు వికెట్లు పడగొట్టారు.



## టీ20 ప్రపంచకప్‌కు భారత్ మహిళా జట్టు ఎంపిక

### విమెన్ ఇన్ బ్లూలో శ్రీచరణి, అరుంధతికి చోటు

**ముంబై:** ఇంగ్లాండ్ వేదికగా జరగనున్న ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్‌కు భారత జట్టును బీసీసీఐ ప్రకటించింది. అమితా శర్మ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ.. శనివారం బీసీసీఐ కార్యదర్శి దేవ్‌జిత్ సైకియా, మహిళల జట్టు ప్రధాన కోచ్ అమోల్ మజుందార్, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌లతో సుదీర్ఘ చర్చ అనంతరం 15 మంది జట్టును ప్రకటించారు. హర్మన్‌ప్రీత్ కౌర్ రికార్డు స్థాయిలో ఐదోసారి కెప్టెన్‌గా జట్టును నడిపించనుంది. తెలుగు క్రికెటర్లు శ్రీచరణి, అరుంధతిలకు జట్టులో చోటు దక్కింది. గాయంతో దూరమైన అమన్‌జ్యోత్ కౌర్ స్థానంలో భారతి ఫుల్మాలిని ఎంపిక చేసినట్లు సెలెక్షన్ కమిటీ ప్రకటిం చింది. బ్యాటర్ హర్లీన్ డియోల్, స్పిన్నర్ స్నేహ రాణాలకు జట్టులో చోటు దక్కలేదు.

జూన్ 12 నుంచి ఇంగ్లండ్ వేదికగా టీ20 ప్రపంచకప్ జరగనుంది. గ్రూప్‌ఏలో భారత్‌తో పాటు పాకిస్తాన్, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, నెదర్లాండ్స్, దక్షి ణాఫ్రికా ఉన్నాయి. డిఫెండిగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగనున్న టీమిండియా...తొలి మ్యాచ్‌ను జూన్ 14న పాకిస్తాన్‌తో ఆడనుంది.ఆ తర్వాత 17న నెదర్లాండ్స్, 21న సౌతాఫ్రికా, 25న బంగ్లాదేశ్, 28న ఆస్ట్రేలియాతో ఆడనుంది. ఇక గతేడాది స్వదేశంలో జరిగిన టీ20 ప్రపంచకప్ ఫైనల్లో దక్షిణాఫ్రికాను ఓడించి తొలి సారి కప్ అందుకుంది.

**భారత జట్టు:** హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన, షఫాలీ వర్మ, జెమిమా రోడ్రిగ్స్, భారతీ ఫుల్మాలి, దీప్తి శర్మ, రిచా ఘోష్, శ్రీచరణి, యాస్తికా భాటియా, నందనీ శర్మ, అరుంధతీ రెడ్డి, రేణుకా సింగ్, క్రాంతి గౌడ్, శ్రేయాంక పాటిల్, రాధా యాదవ్.

## మాడ్రిడ్ ఓపెన్ ఫైనల్లో సిన్నర్, జ్వెరెవ్

**మాడ్రిడ్:** టాప్ సీడ్లు జానిక్ సిన్నర్, అలెగ్జాండర్ జ్వెరెవ్... మాడ్రిడ్ ఓపెన్ పురుషుల సింగిల్స్ ఫైనల్ చేరారు. తొలి సెమీస్‌లో ప్రపంచ నంబర్ వన్ జానిక్ సిన్నర్ 6-2, 6-4తో వరుస సెట్లలో అలవోకగా ఆర్థర్ ఫిల్స్‌ను ఓడించాడు. కార్లోస్ అల్కరాజ్‌ను వెనక్కి నెట్టి ఇండియన్ వెల్స్, మయామి, మాంటె కార్లో టైటిల్స్ గెలిచి జైత్రయాత్ర కొనసాగిస్తున్న సిన్నర్‌కు ఫిల్స్ నుంచి ఎలాంటి ప్రతిఘటన ఎదురుకాలేదు. తొలి సెట్‌ను 6-2తో అలవోకగా నెగ్గిన సిన్నర్‌కు.. ఫిల్స్ రెండో సెట్‌లో కాస్త పోటీ ఇచ్చాడు. అయితే సిన్నర్ ఏస్‌లతో విరుచుకుపడుతూ ఫిల్స్ సర్వీస్‌ను బ్రేక్ చేసి సెట్‌ను మ్యాచ్‌ను ముగించాడు. ఇది సిన్నర్‌కు వరుసగా 22వ గెలుపు. వరుసగా రికార్డు స్థాయిలో ఐదో మాస్టర్స్ 1000 టైటిల్ గెలవడంపై దృష్టి పెట్టాడు. ఇక రెండో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్... 6-2, 7-6తో బ్లాక్స్‌ను ఓడించి ఫైనల్ పోరుకు సిద్ధమయ్యాడు. బ్లాక్స్‌పై మొదటి సెట్‌ను జ్వెరెవ్ సునాయాసంగా గెలుచుకున్నాడు, కానీ రెండో సెట్‌లో బెల్జియన్ ఆటగాడి సర్వ్‌ను బ్రేక్ చేయడానికి చాలా కష్టపడ్డాడు. ఇరువురు పోటాపోటీగా సర్వీసులు నిలబెట్టుకోవడంతో రెండో సెట్ టైబ్రేకర్‌కు సాగింది.

## గాయంతో ఫ్రాన్స్‌తో పోరుకు లక్ష్యసేన్ ఔట్



**డెన్మార్క్:** ఫ్రాన్స్‌తో జరిగే థామస్ కప్ సెమీ ఫైనల్‌కు ముందే భారత్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ ఆటగాడు లక్ష్యసేన్ గాయంతో జట్టుకు దూరమయ్యాడు. చైనీస్ తైఫీతో జరిగిన క్వార్టర్ ఫైనల్ పోరులో రెండుమ్యాచ్ పాయింట్లు కాచుకుని మరీ ప్రపంచ నెంబర్ సిక్స్ చౌ టియెన్ చెన్‌పై నెగ్గిన లక్ష్యసేన్... సుదీర్ఘ మ్యాచ్ ఆడాడు. ఆ మ్యాచ్‌లో స్మాష్ కోసం డైవ్ చేస్తున్నపుడు మోచేతికి గాయమైంది. అది తగ్గకపోవడంతో ఫ్రాన్స్‌తో జరిగే సెమీస్ పోరుకు అందుబాటులో ఉండడం లేదని జట్టు కోచ్ వెల్లడించాడు.పాదాలకు బొబ్బలతోకూడా లక్ష్యసేన్ ఇబ్బంది పడుతున్నాడని విమల్ కుమార్ తెలిపారు.లక్ష్యసేన్ అందుబాటులో లేకపోవడంతో.. యువ ఆటగాడు ఆయుష్ శెట్టి ఆరంభ సింగిల్స్‌లో ప్రపంచ నంబర్ 4 క్రిస్టో పోపోవ్‌తో, కిదాంబి శ్రీకాంత్.. రెండో సింగిల్స్‌లో ప్రపంచ నంబర్ 10 అలెక్స్ లానియర్‌తో తలపడతారు.

## బీమా రంగంలోకి 100శాతం ఎఫ్‌డిఐ

### నోటిఫై చేసిన కేంద్రం

వాణిజ్యం




**న్యూఢిల్లీ, మే 2:** బీమారంగంలోకి నూరుశాతం ప్రత్యక్ష విదేశీ పెట్టుబడులు అనుమతించే విధానాన్ని ఆర్తికశాఖ శనివారం నోటిఫైచేసింది. ఆటోమేటిక్ రూట్‌లో 100శాతం ఎఫ్‌డిఐలు వచ్చేందుకు ఇపుడు నిబంధనలు సడలించారు. జీవిత బీమా సంస్థలో ఇప్పటివరకూ 20శాతం వరకూ మాత్రమే పరిమితులున్నాయి. ఇపుడు విదేశీ పెట్టుబడులు 100శాతానికి సడలించారు. భారతీయ బీమారంగంలో నూరుశాతం అధీకృత ఈక్విటీ అనుమతిస్తున్నట్లు ఆర్థికశాఖ ప్రకటించింది. అయితే ఇందుకు ఐఆర్‌డిఎ సమగ్ర పరిశీలన, ఆమోదం తర్వాతనే 100శాతం పెట్టుబడులు ఆమోదించడం జరుగుతుందని ఆర్థిక మంత్రిత్వశాఖ ప్రకటించింది.సబ్‌కా బీమా, సబ్‌కీ రక్షా బిల్లును 2025లో ఆమోదించింది. డిసెంబరు 2025లోనే ఈ పరిమితిని నూరుశాతానికి పెంచారు. అప్పటివరకూ 74 శాతంగా ఉన్న ఎఫ్‌డిఐలు ఈ బిల్లుతో 100శాతానికి పెరిగాయి.

2020లో బీమా అనుబంధ రంగాల్లోకి నూరుశాతం, ఎల్‌ఐసిలోకి 20శాతం విదేశీ పెట్టుబడులను మాత్రమే ప్రభుత్వం అనుమతించింది.జీవిత బీమా కార్పొరేషన్ చట్టం పరిధిలోని వివిధ నిబంధనలకు లోబడి ఈ విదేశీ పెట్టుబడులు అనుమతిస్తారని తేలింది. ఇపుడు నూరుశాతం పెట్టుబడులతో బీమా రంగంలోకి విదేశీ ఇన్వెస్టర్లు, పెట్టుబడుల సంస్థలు రావాలన్న ఆసక్తి మరింత పెరుగుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఎల్‌ఐసితో పాటు వివిధ బీమా సంస్థలు ప్రభుత్వరంగంలో పనిచేస్తున్నాయి. వీటికి తోడు ఇప్పటికే ప్రైవేటు రంగంలోకూడా బీమా సంస్థలు విదేశీ సంస్థలను కలుపుకుని వ్యాపార లావాదేవీలునిర్వహిస్తున్న సంగతి తెలిసిందే.




## వారంలోనే 13,945కోట్లు విత్‌డ్రా

**ముంబయి, మే 2:** విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు గతనెల 30వ తేదీతో ముగిసిన వారంలో మార్కెట్ల నుంచి రూ.13,944.59 కోట్లు విత్‌డ్రా చేసుకున్నారు. ప్రత్యేకించి ఈక్విటీ, డెట్, హైబ్రిడ్, మ్యూచువల్‌ఫండ్ ఉత్పత్తుల్లోనే ఈ విత్‌డ్రాలు ఎక్కువ కనిపిస్తున్నాయి. ఎక్కువగా ఈక్విటీలనుంచే విత్‌డ్రా అయ్యాయి. ఎన్‌ఎస్‌డిఎల్ డేటా ప్రకారంచూస్తే ఈక్విటీలనుంచి 8721.65 కోట్లు విత్‌డ్రా అయ్యాయి. ఒక్క రోజే ఈ మొత్తం విత్‌డ్రా అయింది.

మంగళవారం కూడా 4188.34కోట్లు, బుధవారం 1991.87 కోట్లు, గురువారం 1978.63క ఓట్లు విత్‌డ్రా అయ్యాయి. మొత్తంగా వారంలో ఈక్విటీ విత్‌డ్రాలు రూ.16,880.49 కోట్లుగా ఉన్నాయి. ఇక డెట్ మార్కెట్లలోకూడా ఇదే తీరు కనిపించింది. సోమ, మంగళవారాల్లో కొంతమేర కొనుగోళ్లు జరిగాయి. 1338.95 కోట్ల వరకూ ఉంటే గురువారం రూ.1257.01 కోట్లుగా ఉంది. ఇక స్వచ్ఛంద రిటెన్షన్ రూట్‌లో ఇన్‌ఫ్లోలు రూ.1591.32 కోట్లుగా ఉంటే మంగళవారం 911.10 కోట్లు ఉన్నాయి. ఏప్రిల్ నెలలో పోర్టుఫోలియో విదేశీ ఇన్వెస్టర్లు రూ.63,167 కోట్లు విత్‌డ్రాచేసుకున్నారు. ప్రైమరీ మారెనకట్‌లో రూ.2319 కోట్లుమాత్రమే పెట్టుబడులు పెట్టారు. దీనితో ఎఫ్‌పిఐ అమ్మకాలురూ.60,848 కోట్లుగా ఉన్నాయని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ ముఖ్య వ్యూహకర్త డా.వికె విజయ్‌కుమార్ తెలిపారు. 2026 కేలండర్‌సంవత్సరంలో ఇప్పటివరకూ రూ.1,91,968 కోట్లు విత్‌డ్రా అయినట్లు ఆయన చెప్పారు. పశ్చిమాసియా ఉద్రిక్తతలు, ఫెడ్ రిజర్వు ఫండ్స్‌రేట్, ఆయా దేశాల కేంద్ర బ్యాంకుల మానిటరీ పాలసీ నిర్ణయాలు కూడా స్థానిక మార్కెట్లనుంచి నిధులు విత్‌డ్రాకు ఆస్కారం కల్పించింది. బ్రెంట్ ముడిచమురు కూడా ఏడుశాతం పెరిగి బ్యారెల్‌కు 114 డాలర్లుగా పెరగడంతో కరెన్సీ మార్కెట్‌లో రూపాయి విలువలు కూడా మరింత క్షీణించాయి.

### ఉత్పత్తుల ధరలు పెంచుతున్న

## హిందూస్థాన్ యూనిలీవర్

**ముంబయి, మే 2:** ఎఫ్‌ఎంసీజీ సంస్థ హిందూస్థాన్ యూనీలీవర్, తన వినియోగరంగ ఉత్పత్తుల ధరలను పెంచుతున్నట్లు ప్రకటించింది. పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ ఉద్రిక్తతలు ఇప్పుడు నేరుగా సామాన్యుడి జేబుకు చిల్లు పెట్టబోతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో చోటుచేసుకుంటున్న పరిణామాలు ఈపెంపునకు మూలకారణంగా కనిపిస్తున్నాయి. యుద్ధ మేఘాల వల్ల ముడి చమురు ధరలు భారీగా పెరిగాయి. దీనివల్ల రవాణా ఖర్చులు పెరగడమే కాకుండా, ప్యాకేజింగ్ కోసం వాడే ప్లాస్టిక్,సబ్బులు తదితర అన్ని వస్తువుల తయారీకి అవసరమైన ముడి సరుకుల వ్యయం 8 నుంచి 10 శాతం పెరిగింది. పెరిగిన ఉత్పత్తి వ్యయాన్ని తట్టుకుని, కంపెనీ లాభాలను కాపాడుకోవడానికి ధరల సర్దుబాటు తప్పనిసరి అయిందని సీఈఓ ప్రియా నాయర్, సీఎఫ్ఓ నిరంజన్ గుప్తా స్పష్టం చేశారు.

మనం రోజూ వాడే అనేక బ్రాండ్ల ధరలు ఇప్పటికే 2 నుంచి 5 శాతం పెరిగాయి.మరికొన్ని ఉత్పత్తుల విషయంలో ధర పెంచకుండా, ప్యాకెట్ పరిమాణాన్ని తగ్గించే వ్యూహాన్ని కూడా కంపెనీ అమలు చేస్తోంది. సాధారణంగా హిందుస్థాన్ యూనీలీవర్ వంటి పెద్ద సంస్థ ధరలు పెంచితే, దానిని అనుసరిస్తూ మిగిలిన పోటీ సంస్థలు కూడా రేట్లు పెంచే అవకాశం ఉంటుంది. ఇది మొత్తం ఎఫ్‌ఎంసీజీ రంగంలో ధరల పెరుగుదలకు దోహదంచేయడంతోపాటు ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం కూడా లేకపోలేదు.




### రిజర్వు బ్యాంకు డిప్యూటి గవర్నర్‌గా

## రోహిత్ జైన్

**ముంబయి, మే 2:** రిజర్వుబ్యాంకు డిప్యూటి గవర్నర్‌గా రోహిత్ జైన్‌ను నియమించేందుకు కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఉన్న టి రవిశంకర్ పదవీకాలం శనివారంతో ముగియడంతో కేబినెట్ కమిటీ రోహిత్‌జైన్ నియామకానికి ఆమోదం తెలిపింది. మూడేళ్ల పదవీకాలంతో రోహిత్ జైన్ ఫనిచేస్తారు.ప్రస్తుతం ఆర్‌బిఐలో 2020 నుంచి రోహిత్‌జైన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు.బ్యాంకులో రిస్క్ అనలిటిక్స్,కీలక అధ్యయనం విభాగాలను పర్యవేక్షించారు. ఎంబిఎలో మాస్టర్స్ డిగ్రీ తీసుకున్న రోహిత్ ఇంటర్నేషనల్ సర్టిఫికేట్ బ్యాంకింగ్ ఇన్ రిస్క్ రెగ్యులేషన్‌ను సాధించారు. సిఎఐఐబి, సర్టిఫైడ్ బ్యాంక్ ట్రైనర్‌గా కూడా ఆయన గుర్తింపు పొందారు. నలుగురు డిప్యూటి గవర్నర్లలో ఇద్దరు అంతర్గత ర్యాంకుల్లోనే ప్రమోషన్ పొందారు. వారిలో ఎస్‌సి ముర్ము ఆర్‌బిఐ ర్యాంకుల్లో పదోన్నతిపొందారు. మరో ఇద్దరు బయటినుంచి అంటే ఆర్థికవేత్త పూనమ్ గుప్తా వాణిజ్య బానయంకులనుంచి జె స్వామినాథన్‌లను ఎంపిక చేసారు. ఇపుడు రోహిత్‌జైన్ ఆర్థిక మార్కెట్ల క్రమబద్ధీకరణ, విదేశీ కరెన్సీ, పేమెంట్ సెటిల్‌మెంట్ వ్యవస్థలు ఇతరత్రా రవిశంకర్ చూసిన అన్ని విభాగాలు పర్యవేక్షిస్తారు. కేబినెట్ నియామకాల కమిటీ ఇప్పటి వరకూ డిప్యూటి గవర్నర్ పోస్టు కోసం నలుగురు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లను ఇంటర్వ్యూలు చేసింది.







### కోటక్ మహీంద్ర నికరలాభం

## రూ.5423 కోట్లు

**ముంబయి, మే 2:** కోటక్ మహీంద్ర బ్యాంకు నికరలాభాలు పదిశాతంపెరిగి నాలుగోత్రైమాసికంలో రూ.5423 కోట్లకు పెరిగాయి. ఏకీకృత లాభం చూస్తే 13 శాతం పెరిగి 4027 కోట్లుగా ఉంది. అంతకుముందు ఏడాది ఇదే కాలంలో రూ.3552 కోట్లుగా ఉంది.నికరవడ్డీ ఆదాయం 8శాతం పెరిగి రూ.7876 కోట్లకు చేరింది. ఇతర రాబడుల్లో రెండుశాతం తగ్గినా రుణాల్లో వృద్ధి నమోదయింది. ఇతర రాబడులు రూ.3116 కోట్లుగా ఉంది. నికరవడ్డీ మార్జిన్ 13 బేసిస్ పాయింట్లు పెరిగి 4.67శాతంగా ఉంది. ఇక కేటాయింపుల పరంగా కూడా తక్షణ కేటాయింపులు 43శాతం తగ్గాయి. మూడో త్రైమాసికంలో 810 కోట్లు ఉంటే ఈ త్రైమాసికంలో రూ.516 కోట్లుగా ఉంది. అదే గత ఏడాది రూ.909 కోట్లవరకూ ఉన్నాయి.ఇతర రాబడుల్లో స్లిప్పేజెస్‌కింద చూస్తే 1605 కోట్లనుంచి 1018కోట్లకు కట్టడిచేయగలిగింది. గత ఏడాది ఇదేకాలంలో రూ.1488 కోట్లవరకూ స్లిప్పేజిలున్నాయి. స్థూల నిరర్థక ఆస్తులు 10 బేసిస్‌పాయింట్లు తగ్గి 1.20శాతంగా ఉంటే నికర ఎన్పీయే నిష్పతి కూడా ఆరు బేసిస్‌పాయింట్లు మెరుగుపడి 0.25శాతంగా ఉన్నాయి. అడ్వాన్సులు కూడా 16శాతంపెరిగి రూ.5.14 లక్షలకోట్లకు చేరాయి. ఎస్‌ఎంఇ రంగానికి 19శాతం కార్పొరేట్ బుక్ 22శాతం, కన్స్యూమర్ బ్యాంకింగ్ 14శాతం, కమర్షియల్ బ్యాకింగ్ 8శాతం చొప్పున రుణాలిచ్చింది. డిపాజిట్లు కూడా 15శాతంపెరిగి రూ.5.72 లక్షలకోట్లుగా ఉనాననయి.కాసా నిష్పతికి 43.3శాతంగా ఉంది. సిడి నిష్పత్తి కూడా 86.6శాతంగా ఉందని వెల్లడించింది.

## స్పిరిట్ ఎయిర్‌లైన్స్ మూసివేత!




**ముంబయి,మే 2:**పశ్చిమాసియా యుద్ధమేఘాల కారణంగా స్పిరిట్ ఎయిర్‌లైన్స్ శనివారం తమ సేవలను నిలిపివేస్తున్నట్లుప్రకటించింది. అమెరికా ప్రభుత్వ బెయిల్ ఔట్ ప్రణాళికకుతోడు బ్యాంకర్ల మద్దతును కూడా సాధించలేకపోవడం కూడా మూసివేతకు ఒక కారణంగా కనిపిస్తోంది. దీనికి తోడు జెట్ ఇంధన ధరలు రెట్టింపు అయ్యాయి. రెండునెలలుగా ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధం ఇపుడు వేలాది ఉద్యోగాల మెడపై లేఆఫ్ కత్తిని వేలాడదీసింది. స్పిరిట్‌ను రక్షించేందుకు 500 మిలియన్ డాలర్ల బెయిల్ ఔట్ ప్లాన్‌ను ట్రంప్ ప్రతిపాదించినా బ్యాంకర్ల నుంచి మద్దతు సాధించలేకపోయింది. ట్రంప్ ప్రణాళికను రిపబ్లికన్లు కాంగ్రెస్‌తో తీవ్రంగా వ్యతిరేకించినా ట్రంప్ స్పిరిట్‌ను నష్టాలనుంచి బైట పడేయాలని భావించారు. అమెరికా విమానసర్వీసుల్లో ఐదుశాతం విమానాలు స్పిరిట్ నడుపుతోంది.

స్పిరిట్ విమానసంస్థ ఇతర మేజర్ సంస్థలతో పోలిస్తే ధరలు కూడా తక్కువ స్థాయిలోనే కొనసాగించింది. కంపెనీ రక్షణకు ఎలాంటి ప్రత్యామ్నాయ ప్రణాళికలపై చర్చించకుండానే బోర్డు సమావేశం కూడా ముగిసింది. ముందురోజే ట్రంప్ 500మిలియన్ డాలర్ల ఫైనాన్సింగ్ ప్యాకేజిని ప్రకటించి సేవ్ చేసారని వైట్‌హౌస్ ప్రకటించింది. అమెరికా ఎయిర్‌లైన్స్‌కు ఇరాన్ యుద్ధం ఎఫెక్ట్ భారీగా పడిందనడానికి స్పిరిట్ ఎయిర్‌లైన్స్ మూసివేత ప్రత్యక్ష నిదర్శనమని నిపుణులు చెపుతున్నారు. స్పిరిట్ పునర్వ్యవస్థీకరణ ప్రణాళికలో జెడ్ ఇంధన వ్యయాలు గ్యాలన్‌కు 2.24 డాలర్లుపెరిగాయి.2027లో 2.14డాలర్లు ఉంటాయని అంచనా. అయితే ధరలు మాత్రం 4.51 డాలర్లకు పెరిగాయి. ఏప్రిల్ చివరినాటికి గ్యాలన్‌ధరలకు అదనంగా 4.51 డాలర్లు చెల్లించాల్సివస్తోంది. స్పిరిట్ ఎయిర్‌లైన్స్ కొనుగోలు కోసం అనేక ఇతర సంస్థలను కూడా సంప్రదించామని అయితే బయ్యర్లు నిరాసక్తంగా ఉన్నారని రవాణా మంత్రి సీన్ డఫ్ఫీ వెల్లడించారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942–271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.